

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



శుక్రవారం | 17-10-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 199 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి ఉ.11:12 తదుపరి ద్వాదశి; నక్షత్రం: మఖ మ.1:58 తదుపరి పుబ్బ; వర్జ్యం: రా.10:32-12:15; దుర్ముహూర్తం: ఉ.8:31-9:18, మ.12:23-1:10; అమృతఘడియలు: ఉ.11:26-1:07; రాహుకాలం: ఉ.10:30-12:00; సూర్యోదయం: 6:12; సూర్యాస్తమయం: 5:48

ఆంధ్రజ్యోతి II

నవ్య నివేదన

శుక్రవారం • 17 అక్టోబర్ 2025

పర్వదినం



భారతీయ సాంస్కృతిక వారసత్వ చిహ్నంగా... యుగయుగాలుగా జరుపుకొంటున్న పండుగ దీపావళి. భారతీయ సనాతన ధర్మం దీపారాధనకు విశిష్ట స్థానం ఇచ్చింది. శ్రీఆదిశంకరాచార్యులు షణ్మత స్థాపన చేసినప్పుడు... పంచాయతన పూజా విధానంలో స్కంధునికి ప్రతీకగా... దీపారాధన ఏర్పాటు చేశారు. ఏ శుభ కార్యాన్ని ప్రారంభించినా ముందుగా దీపారాధన చేయడం ఆచారం. దీపం అగ్నికి సంకేతం. సత్కార్యాన్ని అడ్డుకోవడానికి వచ్చిన దుష్టశక్తులను దహించేయాలన్నది దానిలోని అంతరార్థం. సృష్టి, స్థితి, లయలకు దీపంతో సంబంధం ఉంది. దీపంలో కనిపించే నీలం, తెలుపు, ఎరుపు రంగులు త్రిమూర్తులకు ప్రతీకలంటారు. అదే విధంగా, విద్య, శక్తి, ఐశ్వర్యాలను ప్రసాదించే సరస్వతి, దుర్గ, మహాలక్ష్మి ఆ దీపకాంతిలో కొలువై ఉంటారని పూర్వులు చెప్పారు.

దీపావళి... దివ్య శోభావళి

దీపదర్శనం సకల పాపాలను పోగొడుతుంది. హృదయం అనే ప్రమిదలో భక్తి అనే తైలాన్ని నింపి, విశ్వాసం అనే వత్తిని ప్రేమ అనే అగ్నితో జ్వలింపజేసేదే దీపం. కళ్లలో కనిపించే వెలుగు దాని కాంతి, జ్ఞానం అనే జ్యోతి. దీపకాంతులు విరజిమ్మే ఇంట్లో లక్ష్మీదేవి నివసిస్తుందనీ, నిత్యం ఉభయ సంధ్యల్లో దీపాలు వెలిగే ఇంట సిరిసంపదలు, సౌభాగ్యాలు వెల్లివిరుస్తాయని శాస్త్రవచనం. దీపావళి వేడుకలు ప్రాచీన కాలం నుంచి జరుగుతున్నాయి. పురాణాల్లో, ఇతిహాసాల్లో దీని ప్రస్తావన ఉంది. ప్రస్తుతం వివిధ ప్రాంతాల వారు తమతమ ఆనవాయితీల ప్రకారం ఈ పండుగను నిర్వహించుకుంటున్నారు. ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లో అయిదు రోజుల పాటు... ధనత్రయోదశి (లక్ష్మీ పూజ), నరకచతుర్దశి (నరక సంహారం), దీపావళి (నరకాసుర సంహారానికి ఆనందం ప్రకటించడం, పితృదేవతలను స్మరిస్తూ, భూలోకానికి వచ్చిన వారు తిరిగి ఊర్ధ్వలోకాలకు వెళ్ళే మార్గం సూచిస్తున్నట్టు దివిటీలు చూపించడం) ఆశ్వయుజ మాసం చివరిలో వస్తాయి. కార్తిక మాసం ప్రారంభం రోజును... అంటే 'బలి పాడ్యమి'గా పరిగణిస్తారు. ఆ రోజున గోవర్ధన పూజలు జరుగుతాయి. విదియనాడు సోదరి ఇంట సోదరుడు విందు (భగినీ హస్తభోజనం) ఆరగించి, దీవెనలు, కానుకలు ఇస్తాడు. ఇది రక్షాబంధన్‌ను పోలి ఉంటుంది. దక్షిణ భారతదేశంలో... నరక చతుర్దశి, దీపావళిగా... రెండు రోజుల పండుగగా దీన్ని నిర్వహిస్తారు. బెంగాల్ ప్రాంతంలో కాళీ పూజలు, తమిళనాడులో ప్రత్యేకంగా పితృ పూజలు చేస్తారు.

విధి, విధానం

దీపావళి ముందురోజే ఇంట్లో అందరూ తైలంతో అభ్యంగన స్నానం చెయ్యాలి. తైలంలో లక్ష్మి, జలంలో గంగ సూక్ష్మరూపంలో ఉంటారని శాస్త్రాలు చెప్పాయి. అలాగే దీపావళి రోజున కూడా సూర్యోదయానికి ముందే తలస్నానం చేయాలి. ఆ రెండు రోజులూ ఉదయాన్నే ఇష్ట దైవాలను పూజించాలి. దీపాలను వెలిగించి, పూజామందిరం దగ్గర, ఇంటి ముందు, తులసి కోట దగ్గర ఉంచాలి. దీపావళి నాడు లక్ష్మీ పూజ నిర్వహించాలని విష్ణు, మార్కండేయ పురాణాలు ప్రత్యేకంగా చెప్పాయి. అది క్షీరసాగర మథనంలో లక్ష్మీదేవి ఆవిర్భవించిన రోజు. దీపావళి నాటి సాయంత్రం ఇంటి ముంగిట కల్లాపు చల్లి ముగ్గులు పెట్టాలి. తులసికోట దగ్గర అలంకారాలు చేయాలి. అష్టైశ్వర్యాలు అనుగ్రహించే లక్ష్మీదేవితోపాటు గణపతిని కూడా అర్చించాలి. ప్రమిదల్లో దీపాలు వెలిగించాలి. షడ్రుచులతో కూడిన వంటకాలను నివేదించాలి. ధూప, దీప నివేదనలు పూర్తయిన తరువాత... ప్రమిదలను ఇంటి ముంగిట అలంకరించాలి. తులసికోట దగ్గర, ప్రతి గుమ్మానికి ఇరువైపులా దీపాలు పెట్టాలి. అలా దీపజ్యోతులతో ప్రకాశవంతమైన ఇంటికి మహాలక్ష్మి వచ్చి కొలువై ఉంటుందన్నారు పెద్దలు. అనంతరం బాణాసంచా కాల్చి, ఆనందోత్సాహాలతో వేడుక జరుపుకోవాలి.

• ఆయపిళ్ళ రాజపాప

(20న దీపావళి)

దైవమార్గం

మార్త-మరియ

ఏసు క్రీస్తు తన పన్నెండు మంది శిష్యులతో గ్రామగ్రామానికీ సంచరిస్తూ, ప్రజల్ని పలకరించి... వారికి బోధలు చేస్తున్న కాలం అది. వారు ఎక్కడికైనా వెళ్ళినప్పుడు... తమతో పాటు ఏదీ తీసుకువెళ్ళేవారు కాదు. కట్టుబట్టలతోనే పర్యటించేవారు. కనీసం ఒక జోలె కూడా ఉండేది కాదు. ఎవరైనా ఆహ్వానిస్తే తప్ప ఏ ఇంట్లోనూ అడుగుపెట్టేవారు కాదు. ఎవరినీ ఏదీ అడిగేవారు కాదు.

ఒకసారి ఏసు శిష్యసమేతంగా ఓ కుగ్రామంలో అడుగు పెట్టాడు. ఆయన



గురించి అప్పటికే ఎన్నో విషయాలు విన్న మార్త అనే యువతి... ఏసును, ఆయన శిష్యులను తన ఇంటికి ఆహ్వానించింది. ఇంటికి వచ్చిన వారికి మర్యాదలు చేయాలి. కానీ వారు పదమూడు మంది. అలాగే గ్రామానికి చెందిన మరికొందరు పెద్దలు కూడా వారి వెనుక ఉంటారు. ఏ సౌకర్యాలు లేని పల్లెలో... వారందరికీ సంతృప్తిగా ఆతిథ్యం ఇవ్వడం మాటలు కాదు. కాబట్టి అతిథులకు మర్యాదలు చేయాలన్న ఆత్రుతతో ఆమె పనిలో నిమగ్నమైపోయింది.

మార్తకు ఒక చెల్లెలు ఉంది. ఆమె పేరు మరియ. వచ్చినవారిని వినయ విధేయతలతో ఆహ్వానించింది. నమస్కారాలతో, ఆత్మీయమైన మందహాసంతో పలకరించింది. ప్రభువు మాట్లాడుతూ ఉంటే... వినసొంపుగా ఉన్న ఆయన సంభాషణలకు ఆకర్షితురాలైన మరియ... ఆయన పాదాల చెంతనే కూర్చుంది. ఆయన ప్రసంగాన్ని శ్రద్ధాసక్తులతో వింటోంది. ఇదంతా చూసిన మార్తకు మనసు మండిపోయింది. కోపం వచ్చింది. విసుక్కొంది. నేరుగా ప్రభువును సమీపించి... "స్వామీ! ఏమిటిది? నేను హడావిడిగా గొడ్డు చాకిరీ చేస్తూ ఉంటే... మరియ పనీపాటా లేకుండా మీ దగ్గర కూర్చుంది. ఆమెను కనీసం మందలించరా? మీరు చెప్పేవి వింటూ కూర్చుంటే పనులన్నీ ఎవరు చేస్తారు?" అని అడిగింది.

అప్పుడు ప్రభువు చిన్నగా నవ్వి... "ఆమె తన జీవితానికి ఏది అవసరమో దాన్నే వెతుక్కుంటూ వచ్చింది తల్లీ! ఆమె చేసిన పనిలో నాకు దోషం కనిపించలేదు. నీవు చేసే అనవసరమైన అనేక పనుల కన్నా... మరియ చేసేదే మిన్న. మనిషికీ, మనసుకు కావలసిన దాన్నే ఆమె ఎంపిక చేసుకుంది" అంటూ మరియలోని ఆధ్యాత్మిక కోణాన్ని మార్తకు చూపించాడు అజ్ఞానంతో మూసుకుపోయిన ఆమె కళ్ళు తెరిపించాడు.


• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్, 9866755024

సద్బోధ

మార్గాలు వేరు, గమ్యం ఒక్కటే

జెన్ గురించి, జెన్ గురువుల గురించి ఓషో (ఆచార్య రజనీశ్) ఎన్నో ఉపన్యాసాలు ఇచ్చారు. ఆయన జైన కుటుంబంలో జన్మించినా... శ్రీకృష్ణుడు, గౌతమబుద్ధుడు, మహావీరుడు, ఏసు క్రీస్తు, మహమ్మద్ ప్రవక్తల గురించి అద్భుతంగా ప్రసంగించేవారు. ఒకసారి ఒక వ్యక్తి ఆయనను "మీరు ఏ మత ప్రవక్త గురించి చెప్పినా... అతను మాకు జెన్ గురువులాగే అనిపిస్తారు. ఎందుకని?" అని ప్రశ్నించాడు.

అప్పుడు ఓషో "నిజమే. వారంతా జెన్ గురువులే. 'జెన్' అంటే ఒక మతం కాదు. అది అన్ని మతాల మూలం, హృదయాల సారాంశం. సంస్కృతంలోని 'ధ్యానం'... పాళీ భాషలో 'ఝానం', చైనాలో 'చాన్', జపాన్‌లో 'జెన్' అయింది. అన్ని మతాల్లో ధ్యానమే ప్రధానమైన అంశం. ధ్యానం అంటే... ఆలోచనా తరంగాలు లేని చైతన్యం, ఎరుక. నేను కృష్ణుడు, మహావీరుడు, క్రీస్తు, మహమ్మద్... ఇలా ఎవరి గురించి ప్రసంగించినా... నా ఉద్దేశం మిమ్మల్ని అహంభావం, ఆలోచన లేని ఆ ధ్యాన స్థితికి చేర్చడమే. మీ అహంభావాన్ని నిర్మూలించడానికి, సమూలంగా నరికెయ్యడానికి వారిని నా కత్తులుగా ఉపయోగిస్తాను. 'కృష్ణ' అనే కత్తి కొందరికి ఉపయోగపడుతుంది. 'క్రీస్తు' అనే కత్తి మరి కొందరి విషయంలో పని చేస్తుంది" అన్నారు.



వివిధ మతాలకు చెందిన మహనీయులు ఎన్నో విషయాలు చెప్పారు. అయితే వారు ప్రాధాన్యత ఇచ్చింది అహంకార, మమకార నిర్మూలనకే. వాటిని వదులుకున్నప్పుడు చేరే స్థితిని 'జెన్' అని, 'ధ్యానం' అని, 'జ్ఞానం' అని అంటారు. 'పూర్ణం, బ్రహ్మం' అని కొందరు అంటే... 'శూన్యం, నిర్వాణం' అని మరికొందరు అంటారు. 'తావో' అని కొందరు చెబితే, 'నిర్వికల్ప సమాధి' అని ఇంకొందరు చెబుతారు. భాష వేరు, గురువులు వేరు, మతాలు వేరు, ప్రాంతాలు వేరు... కానీ సారాంశం ఒక్కటే. ఏకం సత్... విప్రా బహుధా వదన్తి... ఒకే సత్యాన్ని పండితులు బహు విధాలుగా చెప్పారు. మార్గాలు వేరు, గమ్యం ఒక్కటే. "ధ్యానమే మన స్వరూపం. ఇతర తలపులన్నిటినీ తొలగిస్తే... మన ఆత్మ సంభాషించడాన్ని వినగలుగుతాం. దానిని మీరు ఏ పేరుతోనైనా పిలవవచ్చు" అన్నారు రమణ మహర్షి.

• రాచమడుగు శ్రీనివాసులు

తెలుసుకుందాం

శ్రీవారి రూపం... అపురూపం

తిరుమలలోని ఆనంద నిలయ విమానంలో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి రూపం సర్వాంగ సుందరం. ఆ దివ్య స్వరూపాన్ని బ్రహ్మాది దేవతలు, అగస్త్యాది ఋషులు... ఇలా ఎందరో దర్శించి తరించారు. బ్రహ్మపురాణం, శ్రీవరాహ పురాణాల్లో దీనికి సంబంధించిన వర్ణన ఉంది. "భుజకీర్తులు, కడియాలు తదితర అందమైన ఆభరణాలు కలవాడు, పొడవైన చక్కని నాలుగు చేతులు కలవాడు. నీల మేఘాల్లాంటి శరీర వర్ణం కలిగినవాడు, చిక్కని చిరునవ్వుతో భక్తుల మనసులను దోచుకొనే అందమైన ముఖమండలాన్ని, 'దయ' అనే తరంగంతో వికసించిన తామరల్లాంటి విశాలమైన కన్నులు, నిటారైన ముక్కు కలిగినవాడు. బంగారు మకర కుండలాలను, సుదర్శన చక్రాన్ని, శంఖాన్ని ధరించినవాడు. ఎల్లప్పుడూ వరాలు ఇవ్వడానికి వరద హస్తాన్ని, తనను ఆశ్రయించిన వారికి సంసార సాగరం మోకాలి లోతు వరకే ఉంటుందని సూచిస్తూ... కటి ప్రదేశం దగ్గర హస్తాన్ని కలిగినవాడు అయిన నారాయణుణ్ణి స్తుతిస్తూ.. దేవతలు, ఋషులు, దశరథుడు తదితరులు సూర్యుణ్ణి పోలిన ఆ తేజోరాశిని సందర్శించారు" అని అది చెబుతోంది.

ఆభరణాలు, అలంకారాలు....

తిరుమల కొండపై కొలువైన శ్రీవారి రూప సౌందర్యాన్ని ఆపాదమౌళి పర్యంతం కేవలం శుక్రవార అభి



షేకం సమయంలో మాత్రమే దర్శించవచ్చు. పైన పేర్కొన్న పురాణ వర్ణన... శ్రీవారి నిజరూపానికి సరిగ్గా సరిపోలుతోంది. శ్రీ వేంకటేశ్వర స్వామి పదహారు దళాలతో ఉన్న విశాలమైన పద్మపీఠంపై స్థిరంగా, ఠీవిగా నిలబడి ఉంటాడు. ఆయన రెండు పాదాలకు 'నూపురాలు' అనే ఆభరణాలు ఉన్నాయి. రెండు పాదాల్లో.... మధ్య వేళ్ళకు తప్ప మిగతా అన్ని వేళ్ళకూ ఉంగరాలు ఉన్నాయి. పాదాల నుంచి నడుము వరకు పీతాంబరాన్ని ధరించి ఉంటాడు. అందమైన మడతలతో నడుము చుట్టూ ధోవతి చుట్టుకొని, ముడి వేసుకొని, చక్కని సింహతలాటంతో కూడిన వడ్డాణం పెట్టుకొని ఉంటాడు. ఆ ధోవతి కుచ్చిళ్ళను పట్టి ఉంచే నిలువు కుచ్చిళ్ళు.. కాళ్ళకు మధ్యలో, నిండు పాదాల వరకూ ఉంటాయి. శ్రీ వైష్ణవ సంప్రదాయ ప్రకారం... గోచి పోసి, వెనుకవైపు నడుము మధ్య భాగంలో ముడివేసి చెక్కుకున్నట్టు ధోవతి ఉంటుంది. ఇక శ్రీవారి కంఠాభరణాలుగా మూడు హారాలు ఉంటాయి. శ్రీవైష్ణవ సంప్రదాయ 'విష్ణుముడి' కలిగిన యజ్ఞోపవీతం ఆరు పోగులతో ఉంటుంది. దాన్ని 'ప్రలంబ యజ్ఞోపవీతం' అంటారు. పొట్ట చుట్టూ 'ఉదరబంధం' అనే ఆభరణం ఉంటాయి. ఛాతీకి కుడివైపున వక్షస్థలంలో... త్రిభుజాకారంలో రెండు చేతులతో.. అభయ, వరద ముద్రలున్న 'వ్యూహలక్ష్మీ అమ్మవారి' స్వరూపం అత్యంత స్పష్టంగా ఉంటుంది. స్వామి నాలుగు చేతులకు కేయూరాలు, కటక, కంకణాలనే ఆభరణాలను, బాహువుల పైభాగంలో కేయూరాలను ధరించి ఉంటాడు. నాలుగు చేతులలో... మణికట్టు దగ్గర మూడేసి కంకణాలు, ప్రతి చేతికి ముంజేతి భాగంలో 'వలయం' అనే మరో ఆభరణం ఉంటాయి. 'వరద హస్తం' లేదా 'వైకుంఠ హస్తం' అని పిలిచే శ్రీవారి కుడి అరచేతి మీద.. ఉత్తమమైన హస్త సాముద్రిక లక్షణాలతో కూడిన హస్తరేఖలు స్పష్టంగా కనిపిస్తాయి. 'కటి హస్తం' లేదా 'కట్యవలంబిత హస్తం' అని పిలిచే ఎడమ చేతిలో నాలుగు వేళ్ళు ఎడమ తొడను తాకుతూ ఉంటాయి, బొటన వేలు పైకి ఉంటుంది.

అతృప్త్య అమృతరూపం

శ్రీవారి రెండు చెవులకూ మకర కుండలాలు భుజాల వరకూ వేలాడుతూ ఉంటాయి. శిరస్సు మీద అత్యంత గంభీరంగా, వెదురుకాండంలా పొడవైన, అందమైన కిరీటం ఉంటుంది. కిరీటం కింది భాగంలో రత్నపట్ట, మధ్యభాగంలో కళాసౌందర్యంతో నిండిన పత్రపూరిమం, కిరీటం కింది భాగంలో 'ముకుళం' అనే పద్మం, దానిపైన శిఖామణి ఉంటాయి. కిరీటానికి, లలాటానికి మధ్య అనుసంధానంగా 'లలాట పట్టి' అనే రమణీయ ఆభరణం ఉంటుంది. స్వామి వారి నాసిక సూటిగా కొనదేలి ఉంటుంది. పుష్టిగా ఉన్న బుగ్గలు, చిన్న గడ్డం, అందమైన పెదవులు, వాటిపై అందరినీ మంత్రముగ్ధుల్ని చేసే చిరునవ్వుతో దర్శనమిస్తారు. కళ్ళు కలువల్లా ఉంటాయి. మధ్యలో కనుపాప గుండ్రంగా స్పష్టంగా కనిపిస్తుంది. కనుబొమ్మలు చక్కటి కృతితో, నాసిక ప్రారంభమయ్యేచోట కలుస్తాయి. ఒక్కటని ఏమిటి... శ్రీవారి దివ్యమంగళ విగ్రహంలో ప్రతి భాగం... పాదాల నుంచి కిరీటం వరకూ అత్యద్భుతంగా ఉంటుంది. చూసేకొద్దీ చూడ ముచ్చటగా భక్తుల మనస్సులను కట్టి పడేస్తుంది. అందుకే శ్రీవారి అర్చన స్వరూపానికి 'అతృప్త్య అమృతరూపం' అని పేరు.

థాయిలాండ్‌లో విష్ణురూపం

ఇటీవల థాయిలాండ్‌లో వెలుగుచూసిన విష్ణురూపం విషయానికి వస్తే... అర్చారూపంలో ఉన్న స్వామి రెండు పరహస్తాలలో శంఖు, చక్రాలను ధరించాడు. కుడి స్వహస్తాన్ని అభయముద్రగా, ఎడమ హస్తాన్ని 'కట్యవలంబిత ముద్ర'గా కలిగి ఉన్నాడు. తలపై కిరీటం, మెడలో కంఠహారం, ఉదర బంధం, యజ్ఞోపవీతం, కటిపై మణిమేఖలం, పాదాలపై మంజీరాలు, చేతులకు కడియాలు, బాహు వలయాలు, నడుము నుంచి దిగువకు పట్టుధోతీ, మధ్యలోనూ, నడుముకు అటూ ఇటూ కుచ్చిళ్ళు ఆ ధోతీని బిగించి పట్టి ఉంచేందుకు అందమైన వడ్డాణం ధరించి ఉన్నాడు. ప్రతిమా లక్షణాన్ని అనుసరించి... ఆ విష్ణుమూర్తి శిల్పం క్రీస్తుశకం పది లేదా పదకొండో శతాబ్దాల కాలానిదని చెప్పవచ్చు. అయితే గదా పద్మాలు లేవు కాబట్టి... అది విష్ణుమూర్తి చతుర్వింశతి మూర్తులకన్నా భిన్నంగా ఉంది. ఎడమ హస్తం... కట్యవలంబిత హస్తంగా... శ్రీ వేంకటేశ్వరస్వామిని పోలి ఉన్నా, కుడి హస్తం వరద ముద్రగా కాకుండా అభయ ముద్రగా ఉంది కాబట్టి.... ఆ అందమైన మూర్తిని విష్ణు అంశకు చెందిన ఒక ప్రత్యేక ప్రతిమగా చెప్పవచ్చు. కానీ పాదపీఠం అచ్చం తిరుమల శ్రీవారి పాదపీఠంలా ఉండడం విశేషం.

• దగ్గుపాటి నాగవరప్రసాద్ స్థపతి, 9440525788

(శ్రీ విఖనస ట్రస్ట్ ప్రచురించిన 'ది హిల్ ష్రైన్ ఆఫ్ తిరువేంగడం', టిటిడి ప్రచురించిన 'శ్రీ వేంకటేశ్వరస్వామివారు', 'శ్రీవారి సేవాక్రమం' గ్రంథాల ఆధారంగా)

విశేషం

ప్రాచీనులు ఏర్పాటు చేసిన సంప్రదాయాలకు సంబంధించిన ప్రతి విధానం కుటుంబ సామరస్యానికి, ఆరోగ్య అభివృద్ధికి, ముఖ్యంగా సమాజ ఐకమత్యానికి సరిపడేలా చేసినదే. 'భగినీ హస్త భోజనం' కూడా అటువంటిదే. 'కార్తికమాసం ఎప్పుడు వస్తుందా? అక్క లేదా చెల్లెలి చేతి భోజనం ఎప్పుడు చేద్దామా?' అని ఎదురు చూస్తూ, బాంధవ్యపు గౌరవాన్ని నిలబెట్టుకొనేవారు నేటికి కూడా ఎందరో ఉన్నారు.

బంధాలు నిలిపే భోజనం...

'భగిని' అంటే 'పురుష సంతానమైన తనతో పాటు అదే తల్లి గర్భంలో పుట్టిన స్త్రీ సంతానం 'అని అర్థం. దీన్నే 'సహ+ఉదర' (సహోదర) అనే పదంతో వ్యవహరిస్తూ ఉంటారు. 'సోదర' అనే పదం కూడా ఉంది. సమానం ఉదరం యయోస్తౌ సోదరౌ... తనకు, తన చెల్లెలికి, అక్కకు తల్లి గర్భం ఒకటే అయినప్పుడు 'సోదర', 'సోదరి' అంటారు. ఆ సోదరీమణుల్లో వివాహాలు అయ్యాక, ప్రధాన కుటుంబం నుంచి వేరైపోయి, వేరే చోట ఉన్నప్పుడు... అప్పుడప్పుడు ఒక్క చోట కలుసుకోవడానికి, కలిసి భోజనం చేస్తూ, చిన్ననాటి విశేషాలను ముచ్చటించుకుంటూ, ఒక రోజంతా ఆనందంగా గడపడానికి ఏర్పాటు చేసిన పండుగ రోజు ఇది.

'పుట్టింటి చుట్టమైతే వంటింట్లో, అత్తింటి చుట్టమైతే వరండాలో...' అని తెలుగులో ఒక సామెత ఉంది. అక్కా చెల్లెళ్ల ఇంటికి అన్నా తమ్ముళ్ళు వస్తే... కాళ్ళు కడుక్కున్నదే తడవుగా వంట చేస్తున్న అక్క దగ్గరకో, చెల్లెలి దగ్గరకో చేరుతారు. చిన్నప్పుడు బడిలో పెన్సిలు దొంగతనాలు, ఇంట్లో పాలూ పెరుగూ ఎవరికీ తెలియకుండా తాగెయ్యడం, మామయ్యను ఆటపట్టించడం, తాతయ్యతో మొట్టికాయలు తినడం, కలిసి ఎడ్ల బండి మీద పొరుగూరు తిరునాళ్ళకు వెళ్ళడం, అక్కడ కొనుక్కున్న బూరాలు, జడకుప్పెలు... ఇలా ఎన్నెన్నో మాట్లాడుకుంటూ ఉంటే, ఎంతో ఆనందం వెల్లివిరుస్తుంది.

దాంపత్యాలకు చికిత్స

ఈ పండుగ ప్రయోజనం అంతమాత్రమే కాదు... ఆ ఇద్దరూ ఉన్నవేళ... బావగారో, బావమరిదో తమ భార్యల మీద విసుక్కున్నా, చిర్రుబుర్రుమన్నా ఆ ఇంటి పరిస్థితి అడగకుండానే తెలిసిపోతుంది. తమ సోదరులకు ఇలాంటి పరిస్థితి ఎదురైతే పరిష్కరించవచ్చు. కానీ సోదరీమణుల కుటుంబాల్లో అలా కుదరదు. కాబట్టి పరిస్థితిని మౌనంగా గమనించి, తిరిగి వచ్చిన తరువాత ఆ తమ తండ్రికి తెలియజేసేవారు. మనం కూడా ఏదైనా కార్యాలయంలో పని చేస్తున్నట్టయితే.. ఉద్యోగుల మధ్య తలెత్తే వివాదాన్ని సర్వాధికారి సమక్షంలో, అతని అనుమతికి లోబడి పరిష్కరించుకుంటున్నాం కదా! ఇదీ అంతే. అన్నదమ్ములు ఈ పండుగ రోజున వస్తారని తెలిసి... చెల్లెలు-మరిది, అక్క-బావ జాగ్రత్తపడే అవకాశం ఉంది. కాబట్టి తమ కుమార్తెల సంసారం గురించి కుమారులు గమనించి చెప్పిన సమాచారాన్ని తల్లితండ్రులు మనసులో ఉంచుకొనేవారు. అకస్మాత్తుగా కుమార్తెల ఇళ్ళకు వెళ్ళేవారు. తద్వారా వాళ్ళ కుటుంబాల నిజస్వరూపాలు అర్థమయ్యేవి. వారం పదిరోజుల పాటు అక్కడే ఉండి, చికిత్స ప్రారంభించి, పరిస్థితిని సరి చేస్తూ ఉండేవారు. వెనుకటి రోజుల్లో... సకాలంలో ఇటువంటి చికిత్స జరగడం వల్ల విడాకుల మాట వినబడేది కాదు. అంతేకాదు, అత్తమామలు కబురూ కాకరకాయ లేకుండా ఎక్కడ వచ్చేస్తారో అనే ముందుచూపుతో... ఆ భార్యాభర్తలు కూడా సర్దుకుపోయేవారు.

చెరిగిపోని వాత్సల్యం కోసం...

ఈ పండుగ రోజున అన్న చెల్లెలి ఇంటికి



వస్తే... చెల్లెలిని ఆశీర్వదించి, ఆ దంపతులకు, మేనల్లుళ్ళకు, మేనకోడళ్ళకు వస్త్రాలు ఇచ్చేవారు. సోదరీమణులు స్వయంగా వంట చేసి సోదరులకు వడ్డించేవారు. 'భగినీ హస్త భోజనం' అంటే... సోదరి స్వహస్తాలతో వండి, వడ్డించిన భోజనం చేయడం. కాబట్టి పనివారికో, కేటరింగ్ వాళ్ళకో ఆ బాధ్యత అప్పగించడం సరికాదు. ఇలా పండుగలు, పబ్బాలు అనే వంకతో తరచూ కలుసుకోవడం వల్ల బాంధవ్యం, ప్రేమానురాగాలు, వాత్సల్యాలు చెరిగిపోకుండా ఉంటాయి. పురి (పురం అంటే శరీరం. ఆ శరీరంలో ఉంటాడు కాబట్టి ఆయన పురి (పూరీ) జగన్నాథుడు) క్షేత్రంలో అన్నాదమ్ములైన బలభద్రుడు, శ్రీకృష్ణుల మధ్య సుభద్ర నిత్యం పూజలందుకుంటూ ఉంటుంది. భ్రాతృ సంబంధాన్ని ఎప్పటికీ చెడగొట్టుకోవద్దని ఆ విగ్రహాలు సూచిస్తాయి.

• డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు

(23న భగినీ హస్తభోజనం)

సందేశం

మూడు వాగ్దానాలు

దేవుడి పట్ల భక్తి విశ్వాసాలు ఉన్న వారికి భరోసాను కల్పించే మూడు వాగ్దానాలను దైవ ప్రవక్త మహమ్మద్ చేశారు. వాటిలో మొదటిది... దాసుడి సంపద దానం చేయడం వల్ల తరిగిపోదు. అంటే ఒక మనిషి అల్లాహ్ మార్గంలో తన ధనాన్ని వెచ్చించడం వల్ల పేదవాడు అయిపోడు. అంతేకాదు, అతనికి శుభం కలుగుతుంది. అతను దానాలకు, సత్కార్యాలకు చేసిన ఖర్చుకు ఎన్నో రెట్లు తన ధనాగారం నుంచి అల్లాహ్ ప్రసాదిస్తూ ఉంటాడు. అతని ధనాన్ని వృద్ధి చేస్తాడు. రెండోది... దౌర్జన్యం పట్ల సహనం వహించిన వారు దౌర్జన్యానికి గురికారు. అంటే ఒక వ్యక్తి దౌర్జన్యానికి, అన్యాయంగా హింసకు గురైనప్పుడు... దానికి ప్రతీకారంగా దౌర్జన్య మార్గాలను అనుసరించకుండా ఉంటే... అతని గౌరవాన్ని అల్లాహ్ ఇనుమడింపజేస్తాడు. ఇహపరాలలో గౌరవమైన పదోన్నతులు కల్పిస్తాడు. మూడోది... ఏ వ్యక్తి అల్లాహ్‌ను అర్థించే మార్గం తెరవడో... అతనికి దారిద్ర్యపు మార్గాన్ని అల్లాహ్ తెరుస్తాడు. అంటే... ఎవరైనా సృష్టికర్తను విస్మరించి, సృష్టిని అర్థించడం అలవాటుగా చేసుకుంటే... వారు దరిద్రుల దగ్గర చేతులు చాచే పరిస్థితికి ;గురవుతారు.

ఈ మూడు దైవ ప్రవక్త వాగ్దానం చేసిన తిరుగులేని అల్లాహ్ నిర్ణయాలు. అలాగే నాలుగు రకాల మనుషుల గురించి కూడా దైవప్రవక్త వివరించారు. ఒక రకం దాసులకు దైవం ధన సంపదలు ప్రసాదించాడు. సరైన జీవన విధానానికి కావలసిన జ్ఞానాన్ని ప్రసాదించాడు. అలాంటివారు తమ సంపదల వినియోగం విషయంలో అల్లాహ్‌కు భయపడతారు. ధన సంపదలతో తమ బంధు మిత్రులకు సాయపడతారు. సత్ప్రవర్తన కలిగి ఉంటారు. వారు అందరికన్నా అత్యున్నత స్థానంలో ఉంటారు. రెండో రకం వారికి దైవం మంచి జ్ఞానాన్ని, సత్సంకల్పాన్ని ప్రసాదించాడు. కానీ ధన సంపదలను ఇవ్వలేదు. అలాంటివారు "మేము కూడా ధనవంతులం అయి ఉంటే... వారిలా ఎన్నో పుణ్యకార్యాలు చేసేవాళ్ళం. మా ధనాన్ని సత్కార్యాలకు వినియోగించేవాళ్ళం" అంటారు. ఇలాంటి సంకల్పం కారణంగా... మొదటివారికి లభించినంత పుణ్యం వీరికి కూడా లభిస్తుంది. మూడోరకం వారికి దైవం ధన సంపదలు ప్రసాదించాడు. కానీ వాటిని సక్రమంగా వినియోగించే జ్ఞానాన్ని ప్రసాదించలేదు. అలాంటి వారు ధనాంధకారంతో ఉంటారు. తమ ధనాన్ని తప్పుడు మార్గాల్లో ఖర్చు చేస్తారు. బంధుమిత్రులను, బీదసాదలను పట్టించుకోరు. వారు అత్యంత నీచమైన స్థితిలో ఉంటారు. నాలుగోరకం వారికి అల్లాహ్ ధన సంపదను, మంచి జ్ఞానాన్ని ఇవ్వలేదు. వారు "మాకు ఆస్తిపాస్తులు ఉంటే హాయిగా ఉండేవాళ్ళం. కులాసాగా తిరిగేవాళ్ళం. భోగ విలాసాలలో తేలేవాళ్ళం" అని అనుకుంటారు. వీరి ఉద్దేశం మంచిది కాదు కాబట్టి సర్వ నాశనం అవుతారు. సంకల్పం మంచిది కాదు కాబట్టి అత్యంత నీచమైన స్థితిలో ఉంటారు. అంటే మనిషికి పాపాలు చేయాలనే కోరిక బలంగా ఉండి, వీలుకాకపోవడం వల్ల ఆ పాపాలు చేయకపోయినా... చెడ్డ ఆలోచనల కారణంగా అల్లాహ్ వేసే శిక్షకు పాత్రుడవుతాడు.

• మహమ్మద్ వహీదుద్దీన్



www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 17-10-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 199 | వరంగల్

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి ఉ.11:12 తదుపరి ద్వాదశి; నక్షత్రం: మఖ మ.1:58 తదుపరి పుబ్బ; వర్జ్యం: రా.10:32-12:15; దుర్ముహూర్తం: ఉ.8:31-9:18, మ.12:23-1:10; అమృతఘడియలు: ఉ.11:26-1:07; రాహుకాలం: ఉ.10:30-12:00; సూర్యోదయం: 6:12; సూర్యాస్తమయం: 5:48

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



లిచ్‌ఫీల్డ్ (84 నాటౌట్)

సెమీస్‌లో ఆస్ట్రేలియా

బంగ్లాపై 10 వికెట్ల విజయం

హీలీ అజేయ శతకం

మహిళల వన్డే వరల్డ్‌కప్


ఓపెనర్లే బాదేశారు..
హీలీ (113 నాటౌట్)

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా అదరగొడుతోంది. అజేయ ఆటతీరుతో దూసుకెళ్తున్న ఈ జట్టు సెమీస్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. గురువారం బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో కెప్టెన్ అలీసా హీలీ (77 బంతుల్లో 20 ఫోర్లతో 113 నాటౌట్) వరుసగా రెండో శతకం పూర్తి చేయగా, లిచ్‌ఫీల్డ్ (72 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్స్‌తో 84 నాటౌట్) సహకరించింది. దీంతో ఏకంగా 10 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించిన ఆసీస్ 9 పాయింట్లతో టాప్‌లో నిలిచింది. గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 198 పరుగులు సాధించింది. శోభన (66 నాటౌట్), రుబియా హైదర్ (44) రాణించడంతో ఆ మాత్రం స్కోరైనా అందుకోగలిగింది. మహిళల క్రికెట్‌లో ఆసీస్‌పై బంగ్లా తరఫున అత్యధిక వ్యక్తిగత స్కోరు శోభనదే కావడం విశేషం. అటు బౌలింగ్‌లో లెగ్ స్పిన్నర్ అలన కింగ్ (10-4-18-2) పొదుపైన బౌలింగ్‌తో అదరగొట్టింది. వేర్హమ్, సదర్లాండ్, గార్డ్‌నర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఆస్ట్రేలియా 24.5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 202 పరుగులతో నెగ్గింది. ఓపెనర్లు హీలీ, లిచ్‌ఫీల్డ్ చెలరేగడంతో పవర్‌ప్లేలోనే జట్టు 78 పరుగులు సాధించింది. 67 రన్స్ దగ్గర హీలీ సులువైన క్యాచ్‌ను ఫర్గానా వదిలేసింది. ఇక వరల్డ్‌కప్‌లో రెండో ఫాస్టెస్ట్ (73 బంతుల్లో) సెంచరీ పూర్తి చేసిన హీలీ ఆ వెంటనే హ్యాట్రిక్ ఫోర్లు బాదగా, అటు 25వ ఓవర్‌లో లిచ్‌ఫీల్డ్ రెండు వరుస ఫోర్లతో మ్యాచ్‌ను ముగించింది.

సంక్షిప్త స్కోర్లు

బంగ్లాదేశ్: 50 ఓవర్లలో 198/9 (శోభన 66 నాటౌట్, రుబియా 44; అలన కింగ్ 2/18, వేర్హమ్ 2/22, సదర్లాండ్ 2/41, గార్డ్‌నర్ 2/48); **ఆస్ట్రేలియా** : 24.5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 202 (హీలీ 113 నాటౌట్, లిచ్‌ఫీల్డ్ 84 నాటౌట్)

నేటి మ్యాచ్ మ.3 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో
శ్రీలంక x దక్షిణాఫ్రికా


గంభీర్, రోహిత్

వచ్చారు.. మొదలెట్టారు

నెట్స్‌లో చెమటోడ్చిన రోహిత్, కోహ్లీ

పెర్త్: ఆస్ట్రేలియాతో పరిమిత ఓవర్ల సిరీస్‌లో తలపడేందుకు ఇక్కడ అడుగుపెట్టిన టీమిండియా వెంటనే సాధనలోకి దిగింది. సిరీస్‌లో భాగంగా మూడు వన్డేలు, ఐదు టీ20లలో భారత్-ఆసీస్ తలపడనున్నాయి. తొలి వన్డే ఈనెల 19న జరగనుంది. ఈ నేపథ్యంలో గురువారం పెర్త్ చేరుకున్న టీమిండియా వెంటనే ప్రాక్టీస్ మొదలెట్టింది. ముఖ్యంగా స్టార్ బ్యాటర్లు రోహిత్, విరాట్ ఎక్కువ సేపు నెట్స్‌లో గడిపారు. టెస్టులు, టీ20లకు వీడ్కోలు పలికిన ఈ ఇద్దరు వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్న విషయం విదితమే. ఈ ఫార్మాట్‌లో రో-కో చివరిసారి గత మార్చిలో చాంపియన్స్ ట్రోఫీలో ఆడారు. నెట్ ప్రాక్టీస్ తర్వాత కోచ్ గంభీర్‌తో రోహిత్ చాలాసేపు సంభాషించడం ఆసక్తి రేపింది. మరోవైపు సాధనకు ముందు బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్‌తో మాట్లాడిన కోహ్లీ తర్వాత పేసర్ అర్ష్‌దీప్‌తో ముచ్చటించాడు. శుక్ర, శనివారాల్లో కూడా భారత జట్టు ప్రాక్టీస్ చేయనుంది.

పెర్త్ చేరిన క్రికెటర్లు..: తొలి విడతగా బుధవారం ఉదయం న్యూఢిల్లీ నుంచి బయలుదేరిన భారత క్రికెటర్లు రోహిత్, కోహ్లీ, కెప్టెన్ గిల్, కేఎల్ రాహుల్, జైస్వాల్, అర్ష్‌దీప్, హర్షిత్ రాణా, నితీశ్ కుమార్‌తోపాటు కొందరు సహాయ సిబ్బంది గురువారం తెల్లవారుజామున పెర్త్ చేరుకున్నారు. వారు ప్రయాణించిన విమానం మూడున్నర గంటలు ఆలస్యంగా వచ్చింది. ఆ తర్వాత కోచ్ గంభీర్, కుల్దీప్, అక్షర్, బౌలింగ్ కోచ్ మోర్కెల్, ఇతర కోచింగ్ సిబ్బంది పెర్త్ చేరుకున్నారు.




యశస్వీ జైస్వాల్, ధ్రువ్ జురెల్, నితీశ్‌కుమార్ రెడ్డి


పెర్త్ పిచ్‌పై రో-కోకి కష్టమే

ఆకాశ్ చోప్రా

సుదీర్ఘ విరామం తర్వాత విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ భారత్ తరఫున బరిలోకి దిగబోతున్నారు. అయితే ఆదివారం ఆసీస్‌తో జరిగే తొలి వన్డే ఈ ద్వయానికి సవాల్‌గా మారనుందని మాజీ ఆటగాడు ఆకాశ్ చోప్రా తెలిపాడు. 'ఐపీఎల్‌లో ఆడిన తర్వాత విరాట్, రోహిత్ మళ్లీ ఇప్పుడే బ్యాట్ పట్టనున్నారు. అదీ బౌన్స్ అధికంగా ఉండే పెర్త్ పిచ్‌పై తొలి మ్యాచ్ కావడం వారికి ఇబ్బందికరమే. అయితే ఈ మూడు వన్డేలు ఆ ఇద్దరు దిగ్గజ ఆటగాళ్ల భవిష్యత్‌ను నిర్ణయించలేవు' అని చోప్రా స్పష్టం చేశాడు. మరోవైపు విరాట్-రోహిత్‌లకు ఆసీస్ పర్యటన అంత సులువు కాదని, కుదురుకునేందుకు సమయం పడుతుందని మాజీ క్రికెటర్ షేన్ వాట్సన్ అభిప్రాయపడ్డాడు. ఇక విదేశీ ఫ్రాంచైజీ లీగ్‌ల్లో ఆడేందుకు భారత యువ ఆటగాళ్లను అనుమతించాలని మాజీ కోచ్ రవిశాస్త్రి కోరాడు.

బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్‌లో చాముండేశ్వర్‌నాథ్

న్యూఢిల్లీ: మాజీ క్రికెటర్ వంకిన చాముండేశ్వర్‌నాథ్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అత్యున్నత కమిటీలో చోటు లభించింది. బోర్డు అపెక్స్ కౌన్సిల్‌లో భారత క్రికెటర్ల సంఘం (ఐసీఏ) ప్రతినిధిగా చాముండి (66) ఎన్నికయ్యాడు. బుధ, గురువారాల్లో జరిగిన ఆన్‌లైన్ ఓటింగ్‌లో చాముండి 672 ఓట్ల భారీ తేడాతో ప్రత్యర్థి రాజేష్ వి. జడేజాపై భారీ విజయం సాధించాడు. చాముండికి 755 ఓట్లు పోల్‌కాగా.. జడేజాకు 83 ఓట్లు మాత్రమే లభించాయి. బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్‌కు ఎన్నికైన తొలి తెలుగు వ్యక్తిగా నిలిచిన చాముండి భారత జట్టు మాజీ క్రికెటర్ దిలీప్ వెంగ్‌సర్కార్ స్థానంలో ఈ బాధ్యతలు చేపట్టనున్నాడు. బీసీసీఐకి సంబంధించిన అత్యున్నత నిర్ణయాలను తీసుకొనే బాడీ అపెక్స్ కౌన్సిల్. ఇందులో బోర్డు అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి సంయుక్త కార్యదర్శి కోశాధికారి, ఇద్దరు ఐసీఏ సభ్యులు, 'కాగ్, జనరల్ బాడీనుంచి ఒక్కొక్కరు...ఇలా 9 మంది ఉంటారు. కాగా ఐసీఏ మహిళా నామినీగా సుధా షా, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ప్రతినిధిగా శుభాంగి దత్తాత్రేయ కులకర్ణి ఎన్నికయ్యారు. ఇక ఐసీఏ బోర్డు ఎన్నికల్లో చాముండి మినహా అందరి ఎన్నిక ఏకగ్రీవమైంది.



ఫస్ట్‌క్లాస్ క్రికెట్ నుంచి..

రాజమండ్రికి చెందిన చాముండేశ్వర్‌నాథ్ ఆంధ్ర తరఫున 1978 నుంచి 1992 వరకు ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడాడు. 13 మ్యాచ్‌లకు సారథ్యం కూడా వహించాడు. ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) మాజీ కార్యదర్శి అయిన ఆయన జాతీయ జూనియర్ సెలెక్షన్ కమిటీ ఛైర్మన్‌గానూ పనిచేశాడు. 2009 ఐసీసీ టీ20 వరల్డ్‌కప్‌లో భారత జట్టు మేనేజర్‌గా సేవలందించాడు. ప్రస్తుతం ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడిగా వ్యవహరిస్తున్నాడు.

తెలుగు టైటాన్స్ ఓటమి

న్యూఢిల్లీ: ప్రొ.కబడ్డీ లీగ్‌లో భాగంగా గురువారం జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ పరాజయం చవిచూసింది. యు ముంబా 33-26తో టైటాన్స్‌పై గెలుపొందింది. ఉత్కంఠ భరితంగాసాగిన మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 6-4తో బెంగళూరు బుల్స్‌పై విజయం సాధించింది.

క్వార్టర్స్‌లో తన్వీ, ఉన్నతి

బీడబ్ల్యూఎఫ్ జూనియర్ చాంపియన్‌షిప్స్

గువాహటి: వర్ధమాన షట్లర్లు తన్వీ శర్మ, ఉన్నతి హుడా బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ జూనియర్ చాంపియన్‌షిప్స్ క్వార్టర్స్‌కు చేరుకొన్నారు. జ్ఞాన దత్తుతోపాటు భవ్య చబ్రా జోడీ కూడా తమకంటే మెరుగైన ర్యాంకర్లను ఓడించి రౌండ్-8లోకి అడుగుపెట్టింది. గురువారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో తన్వీ 15-8, 15-5తో సన్ లి యువాన్ (చైనా)ను, ఉన్నతి 15-10, 15-7తో కరిన్ టీ (మలేసియా)ను ఓడించింది. బాలుర సింగిల్స్‌లో దత్తు 15-12, 15-13తో గారెట్ టాన్‌పై గెలిచాడు. మిక్స్‌డ్‌లో భవ్య-విశాఖ జంట 12-15, 15-11, 15-12తో ఫ్రెంచ్ జోడీ తిబౌల్ట్ గార్డన్-అగాతే క్యువాస్‌పై గెలిచింది.

శ్రీరామ్‌కు కాంస్యం

ప్రపంచ యూత్ చెస్ చాంపియన్‌షిప్



డ్యూరెస్ (అల్బేనియా): ఫిడే ప్రపంచ యూత్ చెస్ చాంపియన్‌షిప్ అండర్-18 విభాగంలో హైదరాబాద్‌కు చెందిన ఉప్పల శ్రీరామ్ ఆదర్శ్ కాంస్యం సాధించాడు. 11 రౌండ్ల ఈ చాంపియన్‌షిప్‌లో శ్రీరామ్ మొత్తం 8.5 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. చివరి రౌండ్‌లో సింగపూర్‌కు చెందిన జేవియర్ హుబన్స్‌తో గేమ్‌ను ఆదర్శ్ డ్రా చేశాడు. సిద్ధార్థ్ జగదీశ్ (సింగపూర్) స్వర్ణం, అర్టియమ్ స్ట్రిబక్ (ఫిడే) రజత పతకం నెగ్గారు.

సనత్, ఆయుష్ డబుల్ ధమాకా

● ఢిల్లీ 529/4 డిక్లేర్
● హైదరాబాద్ 77/1

హైదరాబాద్: సనత్ సంగ్వాన్ (211 నాటౌట్), ఆయుష్ డిసౌజా (209) ద్విశతకాలతో చెలరేగడంతో.. హైదరాబాద్‌తో రంజీ మ్యాచ్‌లో ఢిల్లీ భారీ స్కోరు చేసింది. ఆటకు రెండో రోజు 256/3తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఢిల్లీ 529/4 వద్ద డిక్లేర్ చేసింది. మిలింద్ 3 వికెట్లు పడగొట్టాడు. అయితే, ఆయుష్‌ను అవుట్ చేసిన మిలింద్.. నాలుగో వికెట్‌కు 319 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని విడదీశాడు. ప్రత్యర్థి డిక్లరేషన్ అనంతరం బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టానికి 77 పరుగులు చేసింది. తన్మయ్ (27 బ్యాటింగ్), అక్షిత్ (7 నాటౌట్) క్రీజులో ఉన్నారు. కాన్పూర్‌లో యూపీతో జరుగుతున్న మ్యాచ్‌లో రషీద్ సెంచరీ చేయడంతో ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 470 పరుగులు సాధించగలిగింది.

యూఏఈకి టీ20 ప్రపంచ కప్ బెర్త్

దుబాయ్: యూఏఈ జట్టు వచ్చే ఏడాది జరిగే పురుషుల టీ20 వరల్డ్ కప్‌కు అర్హత సాధించింది. ఆసియా-ఈఏపీ క్వాలిఫయర్స్ టోర్నీలో భాగంగా గురువారం జరిగిన మ్యాచ్‌లో యూఏఈ ఎనిమిది వికెట్లతో జపాన్‌ను ఓడించింది. దాంతో ఈ టోర్నీలో నేపాల్, ఒమన్‌తో కలిసి మూడో జట్టుగా యూఏఈ టిక్కెట్ దక్కించుకుంది. యూఏఈ ఎంట్రీతో ఈ ప్రపంచకప్‌లో పాల్గొనే మొత్తం 20 జట్లూ ఖరారయ్యాయి. 2026 ఫిబ్రవరి-మార్చిలో జరిగే ఈ వరల్డ్‌కప్‌నకు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి.

క్వార్టర్స్‌లో సాత్విక్ జోడీ, లక్ష్యసేన్

డెన్మార్క్ ఓపెన్

ఒడెన్స్: డెన్మార్క్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో సాత్విక్/చిరాగ్, లక్ష్యసేన్ క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించారు. గురువారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి ద్వయం 21-19, 21-17తో లీ/యాంగ్ (తైపీ) జంటని ఓడించింది. ఇక సింగిల్స్‌లో లక్ష్యసేన్ 21-13, 21-14తో అంటొన్‌సెన్ (డెన్మార్క్)కు షాకిచ్చాడు. మిక్స్‌డ్‌లో ధ్రువ్ కపిల/తనీషా క్రాస్టో జోడీ వాకోవర్ ఇచ్చింది.

బ్లాక్ హాక్స్ గెలుపు

హైదరాబాద్: ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో హైదరాబాద్ బ్లాక్ హాక్స్ 3-1తో గోవా గ్లాడియేటర్స్‌పై నెగ్గింది. బ్లాక్ హాక్స్ 15-13, 20-18, 17-15, 15-9తో విజయం సాధించింది. యుధి యమమోటో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

బిజినెస్

ఇన్ఫీ లాభం రూ.7,364 కోట్లు

క్యూ2లో 13 శాతం వృద్ధి నమోదు | రూ.44,490 కోట్లకు పెరిగిన ఆదాయం

వార్షికాదాయ అంచనా 2-3 శాతం ● ఒక్కో షేరుకు రూ.23 డివిడెండ్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికానికి (క్యూ2) దేశీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ రూ.7,364 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఇదే కాలానికి గడించిన రూ.6,506 కోట్ల లాభంతో పోలిస్తే 13.2 శాతం వృద్ధి నమోదైంది. ఈ క్యూ2లో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 8.6 శాతం పెరిగి రూ.44,490 కోట్లకు చేరింది. 2024-25 క్యూ2లో రెవెన్యూ రూ.40,986 కోట్లుగా ఉంది. కాగా, ఈ ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఆదాయం వృద్ధి అంచనా శ్రేణిని జూన్ త్రైమాసికంలో (క్యూ1)లో ప్రకటించిన 1-3 శాతం నుంచి 2-3 శాతానికి మెరుగుపరిచింది. ఈ ఆర్థిక సంవత్సరానికిగాను కంపెనీ తన వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.23 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. క్యూ2 ఆదాయంలో ఆర్థిక సేవల విభాగం వాటా 5.6 శాతం పెరిగి 27.7 శాతానికి చేరుకుంది. మాన్యుఫాక్చరింగ్ విభాగ వాటా 16.5 శాతంగా నమోదైంది. ఎనర్జీ, యుటిలిటీస్, రిసోర్సెస్ అండ్ సర్వీసెస్ విభాగ వాటా 13.4 శాతంగా, రిటైల్ 12.7 శాతం, కమ్యూనికేషన్స్ విభాగ వాటా 12.1 శాతంగా ఉంది. ఈ జూన్ 30 నాటికి కంపెనీలో మొత్తం 3,23,788 మంది ఉద్యోగులుండగా.. ఈ సెప్టెంబరు 30 నాటికి 8,203 పెరుగుదలతో 3,31,991కి పెరిగింది. క్యూ2లో ఉద్యోగుల వలసల రేటు 14.3 శాతానికి తగ్గింది.



ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్ , సీఎఫ్ఓ జయేశ్ సంఘ్రాజ్కా

12,000 మంది ఫ్రెషర్ల నియామకం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబరుతో ముగిసిన ప్రథమార్ధంలో 12,000 మంది ఫ్రెషర్లను నియమించుకున్నట్లు ఇన్ఫోసిస్ సీఎఫ్ఓ జయేశ్ సంఘ్రాజ్కా తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం మొత్తానికి ప్రణాళికకు అనుగుణంగా 20,000 మంది ఫ్రెషర్లను చేర్చుకోనున్నట్లు ఆయన చెప్పారు.

హెచ్1బీ వీసాల అవసరం చాలా తక్కువే..

అమెరికాలోని మా కార్యాలయాల్లో పనిచేస్తున్న మెజారిటీ ఉద్యోగులకు ఇమ్మిగ్రేషన్ మద్దతు అవసరం లేదు. వీసా స్పాన్సర్‌షిప్ అవసరమైన వారు చాలా తక్కువ మందేనని ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్ తెలిపారు.

"అనిశ్చిత వాతావరణం ఇంకా కొనసాగుతోంది. సాధారణంగా ఐటీ రంగంలో ప్రథమార్ధంతో పోలిస్తే ద్వితీయార్ధంలో వ్యాపారం నెమ్మదిస్తుంది. అయితే, కొత్త డీల్స్ చురుకుగా జరుగుతున్న నేపథ్యంలో వార్షికాదాయ అంచనా దిగువ శ్రేణిని 2 శాతానికి పెంచాం. ఈ అంచనాను అందుకుంటామని పూర్తి ధీమాతో ఉన్నాం."
- సలీల్ పరేఖ్, ఎండీ, సీఈఓ, ఇన్ఫోసిస్

తగ్గిన సైయెంట్ లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో సైయెంట్ రూ.137 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం 16.4 శాతం క్షీణించింది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం మాత్రం 4.5 శాతం వృద్ధితో రూ.1,438 కోట్లుగా నమోదైంది. కాగా ఒక్కో షేరుకు కంపెనీ రూ.16 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది.

అమెరికాకు తగ్గిన ఎగుమతులు

న్యూఢిల్లీ: అమెరికాకు జరిగే వస్తు ఎగుమతులపై సుంకాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. సెప్టెంబరు నెలలో మన దేశం నుంచి అమెరికాకు ఎగుమతులు 546 కోట్ల డాలర్లకు (సుమారు రూ.48,000 కోట్లు) పడిపోయాయి. గత ఏడాది సెప్టెంబరుతో పోలిస్తే ఇది 11.7% తక్కువ. ఈ ఏడాది ఆగస్టులో నమోదైన 687 కోట్ల డాలర్ల ఎగుమతులతో పోల్చినా ఎగుమతులు 17.9% తగ్గాయి. ఆగస్టు 27 నుంచి అమెరికా మన వస్తు ఎగుమతులపై 50% సుంకాలు విధించడమే ఇందుకు ప్రధాన కారణం.

మార్కెట్‌కు కొనుగోళ్ల మద్దతు

862 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్

ముంబై: ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన సానుకూల సంకేతాల ప్రభావం వల్ల గురువారం వరుసగా రెండో రోజు కూడా ఈక్విటీ మార్కెట్లలో ర్యాలీ కొనసాగింది. అమెరికన్ ఫెడరల్ కీలక వడ్డీ రేటు తగ్గిస్తుందన్న ఆశలు మార్కెట్లలో కొనుగోళ్ల జోరును పెంచాయి. సెన్సెక్స్ 862.23 పాయింట్ల లాభంతో 83,467.66 వద్ద ముగియగా నిఫ్టీ 261.75 పాయింట్ల లాభంతో 25,585.30 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 1010.05 పాయింట్ల లాభంతో 83,615.48 పాయింట్లను తాకింది. బీఎస్ఇ స్మాల్‌క్యాప్ సూచీ 0.47%, మిడ్‌క్యాప్ సూచీ 0.29% లాభపడ్డాయి.

ఐపీఓకి డ్యూరోఫ్లెక్స్: మ్యాట్రెసెస్ తయారీ కంపెనీ డ్యూరోఫ్లెక్స్ తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి అనుమతి కోరుతూ సెబీకి ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. ఇష్యూలో భాగంగా తాజాగా రూ.183.6 కోట్ల విలువ గల ఈక్విటీ షేర్లు జారీ చేయనుంది. ఓఎఫ్ఎస్ విధానంలో ప్రమోటర్లు 2.25 కోట్ల ఈక్విటీ షేర్లు విక్రయించనున్నారు.

ఔన్స్ గోల్డ్ 4,300 డాలర్లు దాటిన

అంతర్జాతీయ మార్కెట్లో బంగారం సరికొత్త రికార్డు స్థాయికి ఎగబాకింది. ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ రేటు ఒక దశలో 100 డాలర్లకు పైగా పెరిగి తొలిసారిగా 4,300 డాలర్లు దాటింది. అమెరికా-చైనా మధ్య మళ్లీ మొదలైన వాణిజ్య యుద్ధం, యూఎస్ షట్‌డౌన్ వంటి ప్రతికూలతలతో పాటు అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లను మరింత తగ్గించవచ్చన్న అంచనాలు బులియన్ డిమాండ్‌ను ఎగదోస్తున్నాయని విశ్లేషకులు పేర్కొన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు ఔన్స్ గోల్డ్ 61 శాతానికి పైగా పెరిగింది. భారత్‌లో బంగారం ధరలు ఇంటర్నేషనల్ మార్కెట్ రేటు, డాలర్-రూపాయి మారకం విలువకు అనుగుణంగా మారుతుంటాయి. దీంతో శుక్రవారం ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల పసిడి మరో రూ.2,800కు పైగా పెరిగి రూ.1.35 లక్షలకు చేరువయ్యే అవకాశం కనిపిస్తోంది.

ఎస్‌జీబీలు అదుర్స్: 2017-18 ఆర్థిక సంవత్సరంలో సిరీస్-3 కింద జారీ చేసిన సావరిన్ గోల్డ్ బాండ్స్ (ఎస్‌జీబీ) కూడా మదుపరులు బంపర్ లాభాలు పంచాయి. 2017 అక్టోబరు 16న జారీ చేసిన ఈ ఎస్‌జీబీల ఫైనల్ రిడంప్షన్ గడువు గురువారంతో ముగిసింది. ఒక్కో గ్రాము రూ.2,860 చొప్పున ఈ బాండ్స్ కొనుగోలు చేసిన వారికి తుది రిడంప్షన్ నాటికి ఒక్కో గ్రాము ఎస్‌జీబీపై రూ.12,567 అందుకున్నారు. అంటే ఎనిమిదేళ్ల కాలపరిమితి ముగిసేసరికి మదుపరులు 388 శాతం లాభం కళ్లజూశారు.

విప్రో ఆదాయం రూ.22,697 కోట్లు

లాభం రూ.3,246 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికానికి (క్యూ2) విప్రో ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన ఒక శాతం పెరిగి రూ.3,246.2 కోట్లుగా నమోదైంది. క్రితం ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి కంపెనీ లాభం రూ.3,208.8 కోట్లుగా ఉంది. ఈ క్యూ2లో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 1.7 శాతం పెరిగి రూ.22,697.3 కోట్లకు చేరింది. ఈ జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంతో పోలిస్తే మాత్రం విప్రో లాభం 2.5 శాతం తగ్గగా.. ఆదాయం 2.5 శాతం పెరిగింది. ఈ క్యూ2 ఆదాయంలో 34.3 శాతం బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) రంగం నుంచి సమకూరింది. కన్స్యూమర్ 18.2 శాతం, ఎనర్జీ, మాన్యుఫాక్చరింగ్ అండ్ రిసోర్సెస్ 17.4 శాతం, టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్స్ 15.6 శాతం, హెల్త్‌కేర్ రంగం నుంచి 14.5 శాతం రెవెన్యూ లభించింది.

ఏఐ సేవల కోసం విప్రో ఇంటెలిజెన్స్

కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతిక సేవలను మరింత విస్తృతం చేసేందుకు విప్రో ఇంటెలిజెన్స్‌ను ప్రారంభించింది సంస్థ. ఏఐ పవర్డ్ ప్లాట్‌ఫామ్స్, పరిష్కారాలు, ఆఫరింగ్స్‌తో కూడిన ఈ ఏకీకృత సూట్ ద్వారా కంపెనీ తన క్లయింట్లకు సమగ్ర స్థాయి ఏఐ సేవలందించనుంది. క్లయింట్లు ఏఐ సంబంధిత ప్రాజెక్టులపై ఎక్కువగా వెచ్చిస్తున్నారని విప్రో సీఈఓ, ఎండీ శ్రీనివాస్ పల్లియా అన్నారు.

2,900 మంది ఫ్రెషర్ల నియామకం

క్యూ2లో విప్రో ఉద్యోగుల సంఖ్య 2,260 పెరిగి మొత్తం 2,35,492కు చేరింది. గడిచిన మూడు నెలల్లో 2,900 మంది ఫ్రెషర్లను ఉద్యోగంలో చేర్చుకున్నట్లు విప్రో సీహెచ్ఆర్ఓ సౌరభ్ గోవిల్ తెలిపారు. డిమాండ్ ఆధారంగా భవిష్యత్‌లో ప్రాంగణ నియామకాలు జరుపుతామన్న గోవిల్.. నిర్దిష్ట సంఖ్యనేమీ చెప్పలేదు. గత క్వార్టర్‌లో కంపెనీ ఉద్యోగుల వలసల రేటు 14.9 శాతంగా ఉంది.

అమెరికా ఉద్యోగుల్లో 80 శాతం స్థానికులే..

హెచ్1బీ వీసా ఫీజు లక్ష డాలర్లకు పెంచిన విషయంపై విప్రో సీహెచ్ఆర్ఓ స్పందిస్తూ.. అమెరికాలోని తమ ఉద్యోగుల్లో 80 శాతం స్థానికులేనని అన్నారు. వీసా ఫీజు పెంపు ప్రభావం కంపెనీపై చాలా స్వల్పమేనని గోవిల్ పేర్కొన్నారు.

సంక్షిప్తంగా..

- జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ మార్కెట్లోకి విండ్సర్ ఇన్‌స్పైర్ ఎడిషన్‌ను తీసుకువచ్చింది. హైదరాబాద్‌లోని పీపీఎస్ మోటార్స్ ఎల్‌బీనగర్ షోరూమ్‌లో జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ వినయ్ రైనా, జోనల్ హెడ్ సౌరవ్ ప్రకాశ్, పీపీఎస్ మోటార్స్ ఎండీ రాజీవ్ సంఘ్వీ ఈ కారును మార్కెట్లోకి విడుదల చేశారు. విండ్సర్‌ను మార్కెట్లోకి తెచ్చిన ఏడాది కాలంలోనే 40,000 పైగా యూనిట్లను విక్రయించినట్లు రైనా వెల్లడించారు.
- రైడ్ షేరింగ్ ప్లాట్‌ఫామ్ ర్యాపిడో.. విమాన టికెట్లు, హోటల్స్ బుకింగ్స్ కోసం గోఇబిబో, బస్ బుకింగ్స్‌కు రెడ్ బస్, రైల్ టికెట్ల కోసం కన్ఫర్మ్‌టికెట్‌తో జట్టు కట్టింది. ఈ ఒప్పందంతో మొబిలిటీ రంగంలో వన్ స్టాప్ ట్రావెల్ యాప్‌గా ర్యాపిడో అవతరించింది. అందరికీ అందుబాటులోకి ప్రయాణ, బుకింగ్స్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యానికి అనుగుణంగా ఈ కంపెనీలతో జట్టు కట్టినట్లు ర్యాపిడో వెల్లడించింది.
- ఎల్ అండ్ టీ ఫైనాన్స్ లిమిటెడ్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.735 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం 6% పెరిగింది. సమీక్షా కాలంలో రుణాల మంజూరు కూడా 25శాతం వృద్ధితో రూ.18,883 కోట్లకు చేరుకుంది.
- బ్రిటిష్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజన్ తయారీ సంస్థ రోల్స్-రాయిస్.. పెరల్ 700, పెరల్ 10ఎక్స్ ఇంజన్ల కోసం ఫ్యాన్ బ్లేడ్స్ తయారీ, సరఫరా కోసం భారత్ ఫోర్జ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. 2030 నాటికి భారత్ నుంచి సప్లయ్ చెయిన్‌ను రెండింతలు పెంచుకోవాలన్న లక్ష్యానికి అనుగుణంగా ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు రోల్స్-రాయిస్ వెల్లడించింది.
- చైనాలో భారతీయ వీసా దరఖాస్తు సెంటర్ల (ఐవీఏసీఎస్)ల ఏర్పాటు, నిర్వహణ కోసం భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ నుంచి మూడేళ్ల కాలానికి కాంట్రాక్ట్‌ను దక్కించుకున్నట్లు బీఎల్ఎస్ ఇంటర్నేషనల్ వెల్లడించింది. ఇందులో భాగంగా బీజింగ్, షాంఘై, గ్వాంగ్‌ఝూల్లో ఈ వీసా సెంటర్లను ఏర్పాటు చేయనుంది.
- ఎయిర్‌టెల్ క్లౌడ్‌ను మరింతగా విస్తరించేందుకు ఐబీఎంతో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు భారతి ఎయిర్‌టెల్ ప్రకటించింది. ఈ ఒప్పందంతో ఐబీఎంకు చెందిన కీలక సొల్యూషన్స్‌ను ఎయిర్‌టెల్ క్లౌడ్‌పై అందుబాటులోకి తీసుకురానుంది.
- సీఎన్‌హెచ్ బ్రాండ్.. న్యూ హాలెండ్ భారత మార్కెట్లోకి తన కొత్త ట్రాక్టర్ 'వర్క్‌మాస్టర్ 105 హెచ్‌వీఏసీ క్యాబిన్' మోడల్‌ను విడుదల చేసింది. దీని ప్రారంభ ధర రూ.35 లక్షలు. 106 హెచ్‌పీ సామర్థ్యంతో 3.4 లీటర్ల టీఆర్ఈఎమ్-4 ఇంజన్‌తో దీన్ని తీసుకువచ్చింది.
- ఎలక్ట్రిక్ వాహన దిగ్గజం ఓలా ఎలక్ట్రిక్.. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈఎస్ఎస్) మార్కెట్లోకి అడుగుపెట్టింది. ఇందులో భాగంగా తన తొలి రెసిడెన్షియల్ ఎనర్జీ స్టోరేజ్ సొల్యూషన్ 'ఓలా శక్తి'ని ఆవిష్కరించింది. ఓలా శక్తిని దేశీయంగా తయారు చేసిన 4680 భారత్ సెల్ టెక్నాలజీతో తీసుకువచ్చినట్లు ఓలా ఎలక్ట్రిక్ తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



17వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	560
వరంగల్	527	గోదావరి	550
చిత్తూరు	573	విశాఖపట్నం	545
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	124
వరంగల్	110	గుంటూరు	121
కరీంనగర్	110	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	102
కర్నూలు	110	నెల్లూరు	107
విశాఖపట్నం	129	అనంతపురం	107
గోదావరి	124		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,29,440 ▲	1,18,650 ▲	2,06,000 ▲
విజయవాడ	1,31,000 ▲	1,25,000 ▲	1,81,000 ▲
విశాఖపట్నం	1,31,230 ▲	1,18,150 ▲	2,06,000 ▼
రాజమండ్రి	1,28,440 ▲	1,18,650 ▲	1,93,000 ▼
ప్రొద్దుటూరు	1,31,300 ▼	1,20,800 ▲	1,80,000 ▼
ముంబై	1,27,470 ▲	1,16,763 ▲	1,68,083 ▼



www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



శుక్రవారం | 17-10-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 199 | Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | వరంగల్

పార్టీపరంగా 42%!

స్థానిక ఎన్నికల నిర్వహణపై ముందుకు వెళ్లాలని సర్కారు సూత్రప్రాయ నిర్ణయం!

కోర్టు తీర్పుల నేపథ్యంలో పునరాలోచన

న్యాయ నిపుణులతో చర్చించి ముందడుగు

ఎన్నికలకు వెళ్లడానికే మెజారిటీ మంత్రుల ఓటు

19న టీపీసీసీ పీఏసీ భేటీ.. తుది నిర్ణయం

23న మళ్లీ క్యాబినెట్.. అధికారిక ప్రకటన!?

సుప్రీంకోర్టు ఆదేశాల వివరాలు అందాక నిర్ణయం: మంత్రి పొంగులేటి

హైదరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టి వేయడంతో ప్రభుత్వం పునరాలోచనలో పడింది. ప్రస్తుత పరిస్థితుల్లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ అనివార్యం కావడంతో పార్టీపరంగా బీసీలకు 42 శాతం సీట్లు ఇస్తామని ప్రకటించి ఎన్నికలకు వెళ్లాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. దీనిపై రానున్న రెండు రోజులు న్యాయ నిపుణులతో చర్చించి.. వారి సూచనలు తీసుకోనుంది. ఈనెల 19న గాంధీ భవన్‌లో టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశం నిర్వహించి.. అందులో ఈ అంశంపై చర్చించి నిర్ణయం ప్రకటించనుంది. ఈ మేరకు సచివాలయంలో గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో చర్చించారు. పాత రిజర్వేషన్ల పద్ధతితోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని జీవో 9పై స్టే విధించిన సందర్భంగా హైకోర్టు.. పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ సుప్రీం కోర్టు స్పష్టం చేసిన అంశం ఈ సందర్భంగా చర్చకు వచ్చింది. ఉన్నత, సర్వోన్నత న్యాయస్థానాలు

మిగతా 11వ పేజీలో...



సదర్ సమ్మేళనానికి సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న శ్రీకృష్ణ సదర్ సమ్మేళన్ ఉత్సవ్ కమిటీ సభ్యులు. చిత్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ యాదవ్

ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత

ఇద్దరికన్నా ఎక్కువ సంతానం ఉన్న వారు కూడా స్థానిక ఎన్నికల్లో పోటీకి అర్హులే!

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్ణయం.. వానాకాలం సీజన్లో 80 లక్షల టన్నుల ధాన్యం సేకరణ

ఈ సీజన్లోనూ సన్నాలు క్వింటాకు 500 బోనస్.. రైతు ఖాతాల్లో వెంటనే మద్దతు ధర, బోనస్

మెట్రో స్వాధీనానికి కమిటీ.. కొత్తగా 3 అగ్రి కాలేజీలు.. నల్సార్‌లో స్థానిక కోటా 50%కి పెంపు

హ్యామ్ మోడల్‌లో 10,547 కోట్లతో 5,566 కి.మీ. రోడ్ల నిర్మాణానికి టెండర్లకు ఆమోదం

డిసెంబరు 1-9 దాకా ప్రజాపాలన విజయోత్సవాలు.. క్యాబినెట్ నిర్ణయాలు 11



హైకోర్టులోనే తేల్చుకోండి

అక్కడ విచారణలో ఉండగా కల్పించుకోలేం

బీసీ రిజర్వేషన్ల పెంపుపై సుప్రీంకోర్టు

హైకోర్టు విధించిన స్టే ఎత్తివేతకు నిరాకరణ

రిజర్వేషన్లు 50 శాతం మించవద్దని స్పష్టీకరణ

శాస్త్రీయంగా సర్వే చేసి రిజర్వేషన్లు ఖరారు చేశామని వివరించిన రాష్ట్ర ప్రభుత్వం

గతంలోని సుప్రీం తీర్పులకు అనుగుణంగానే వ్యవహరించామని వాదనలు

ఈ అంశాలతో ఏకీభవించని ధర్మాసనం

పాత రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించుకోవచ్చని సూచన

న్యూఢిల్లీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అంశంలో ప్రస్తుతం కల్పించుకోలేమని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన జీవోపై హైకోర్టు విధించిన స్టే ఎత్తివేసేందుకు నిరాకరించింది. బీసీ రిజర్వేషన్ల అంశం హైకోర్టులో పెండింగ్‌లో ఉండగా తాము విచారణకు స్వీకరించలేమని, దీనిపై హైకోర్టులోనే తేల్చుకోవాలని స్పష్టం చేసింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్పీ)ని జస్టిస్ విక్రంనాథ్, జస్టిస్ సందీప్ మెహ్రాలతో కూడిన ధర్మాసనం తోసిపుచ్చింది. తాము తీసుకున్న ఈ నిర్ణయంతో హైకోర్టు విచారణ ప్రభావితం కావొద్దని, ఉచితానుచితాలపై స్వతంత్రంగా నిర్ణయం

మిగతా 9వ పేజీలో...



లొంగిపోవడానికి అడవుల నుంచి బయటకు వస్తున్న క్రమంలో మీడియాతో ఆశన్న

భారీగా లొంగుబాట్లు!

కాంకేర్‌లో 50.. బీజాపూర్‌లో 140 మంది

వీరిలో వాసుదేవరావు అలియాస్ ఆశన్న కూడా

ఆయన వెంటే నాయకులు రాజమల్లు, రనిత

నేడు ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి సమక్షంలో తుపాకులు వీడనున్న మావోయిస్టు నేతలు

చర్ల, మంచిర్యాల, చింతూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ దెబ్బకు మావోయిస్టులు భారీఎత్తున లొంగుబాట పడుతున్నారు. మొన్న అగ్రనేత మల్లోజుల వేణుగోపాల రావు అలియాస్ అభయ్‌తోపాటు 61 మంది మావోయిస్టులు లొంగిపోగా.. గురువారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ పోలీసుల ఎదుట 50 మంది, బీజాపూర్ జిల్లాలో మరో 140 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో కేంద్ర కమిటీ సభ్యుడు, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ముఖ్య నాయకుడు తక్కెళ్లపల్లి వాసుదేవ రావు అలియాస్ ఆశన్న కూడా ఉన్నారు. ఆయన వెంట దండకారణ్య కమిటీలో ముఖ్య నాయకులుగా వ్యవహరించిన రాజమల్లు, రనిత కూడా

మిగతా 2వ పేజీలో...

ముందు మనల్ని మనం కాపాడుకోవాలి

- ఆ తర్వాత ఏం చేయాలో ఆలోచించవచ్చు
- సహచరులు అర్థం చేసుకోవాలి: ఆశన్న 2
- లొంగిపోవాలని ఇతర మావోయిస్టులకు పిలుపు

మీనాక్షి కోర్టులోకి కొండా వివాదం!



కూతురు సుస్మితతో కలిసి మీనాక్షితో కొండా సురేఖ సుదీర్ఘ భేటీ

వివాదంపై వివరణ.. పరిష్కరిస్తామన్న మీనాక్షి, మహేశ్ గౌడ్

తొలుత ఉప ముఖ్యమంత్రి భట్టితో సురేఖ సమావేశం 11

క్యాబినెట్ భేటీకి గైర్హాజరు.. ప్రస్తుతానికి సద్దుమణిగిన వివాదం

శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ వ్యయంలో 50 శాతం రాష్ట్ర వాటాకు క్యాబినెట్ ఆమోదం 11



ఏపీలోని కర్నూలులో జరిగిన బహిరంగ సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్

ఆత్మ నిర్భర్ భారత్‌లో ఆంధ్రప్రదేశ్ కీలకం

- పరుగులు పెడుతున్న 'ఢిల్లీ-అమరావతి' ప్రగతి రథం
- చంద్రబాబు, పవన్‌ల నేతృత్వంలో ఏపీ ముఖచిత్రం మారుతోంది.. కర్నూలు సభలో ప్రధాని నరేంద్ర మోదీ
- పలు పనుల ప్రారంభం, శంకుస్థాపనలు 3
- మోదీ సంస్కరణలు.. దేశానికే గేమ్ చేంజర్లు
- 21వ శతాబ్దం ఆయనదే: ఏపీ సీఎం చంద్రబాబు

రష్యా చమురుపై మళ్లీ మంటలు!

కొనుగోళ్లు ఆపేస్తామని మోదీ నాకు హామీ ఇచ్చారు

ట్రంప్ వ్యాఖ్య.. తప్పుబట్టిన భారత్ 2

ఆయనతో ప్రధాని అసలు మాట్లాడలేదని స్పష్టీకరణ

ట్రంప్‌కు మోదీ భయపడుతున్నారు.. రాహుల్ విమర్శ





'నెస్లే'లో 16 వేల ఉద్యోగాల కోత!

» భారీ లే ఆఫ్‌లకు సిద్ధమైన దిగ్గజ ఆహార సంస్థ

» రానున్న రెండేళ్లలో తొలగింపునకు ప్రణాళికలు

జ్యూరిచ్, అక్టోబరు 16: ప్రముఖ స్విట్జర్లాండ్ ఆహార దిగ్గజ సంస్థ 'నెస్లే' భారీగా ఉద్యోగాల కోతకు సిద్ధమైంది. రానున్న రెండేళ్లలో ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 16 వేల మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు కంపెనీ గురువారం ప్రకటించింది. 'ప్రపంచం మారుతోంది.. దానికి తగ్గట్లే నెస్లే కూడా వేగంగా మారాల్సి ఉంది' అని కంపెనీ సీఈవోగా గత నెల బాధ్యతలు చేపట్టిన ఫిలిప్ నవ్రాటిల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇది కఠినమైన నిర్ణయమేనని పేర్కొన్న ఆయన.. అయితే ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకోవాలంటే కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిందేనన్నారు. పొదుపు లక్ష్యంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

అమెరికా ప్రభుత్వ ఉద్యోగుల తొలగింపును నిలిపివేసిన కోర్టు

వాషింగ్టన్, అక్టోబరు 16: అమెరికాలో ప్రభుత్వ ఉద్యోగుల తొలగింపుపై ట్రంప్ యంత్రాంగం నిర్ణయాన్ని అక్కడి కోర్టు నిలిపివేసింది. అమెరికా బడ్జెట్‌కు సెనేట్ ఆమోదం తెలపకపోవడంతో రెండు వారాలుగా 'ప్రభుత్వ షట్‌డౌన్' పరిస్థితి కొనసాగుతోంది. ఈ క్రమంలో ఇప్పటికే 4 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులను తొలగించిన ట్రంప్ యంత్రాంగం.. మరికొందరిని తొలగించేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ క్రమంలో ఉద్యోగుల సంఘం కోర్టును ఆశ్రయించగా.. ప్రభుత్వ నిర్ణయాన్ని నిలిపివేస్తూ ఆదేశాలు ఇచ్చింది. కాగా, వివిధ దేశాలపై అడ్డగోలు టారిఫ్‌లు విధించడం సరికాదంటూ అమెరికా సుప్రీంకోర్టుకు చేరిన పిటిషన్‌పై నవంబరు 5న వాదనలు జరగనున్నాయి. వాదనలను వీక్షించడానికి తాను అమెరికా సుప్రీంకోర్టుకు హాజరవుతానని ట్రంప్ వెల్లడించారు.

మేం బీసీలం కాదు..!

» సర్వేకు ఇన్ఫోసిస్ నారాయణమూర్తి దంపతులు దూరం

బెంగళూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణమూర్తి, ఆయన భార్య ఎంపీ సుధామూర్తి కర్ణాటక ప్రభుత్వం నిర్వహిస్తున్న కుల సర్వేలో పాల్గొనడానికి నిరాకరించారు. బెంగళూరు నగరపాలక సంస్థ(బీబీఎంపీ) అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు.. కొద్దిరోజుల క్రితం ఎన్యూమరేటర్లు నారాయణమూర్తి నివాసానికి వెళ్లారు. వారికి ఆ దంపతులిద్దరూ 'మా ఇంటిలో ఎటువంటి సర్వే అవసరం లేదు' అని స్పష్టం చేశారు. కర్ణాటక వెనుకబడిన తరగతుల కమిషన్ నిర్వహిస్తున్న సామాజిక, విద్యా సర్వే 2025లో నిర్దేశించిన స్వీయ ధ్రువీకరణ పత్రంలో ఆమేరకు సంతకం చేశారు. ఆ అధికారిక నమూనా దరఖాస్తులో... 'కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల కర్ణాటక వెనుకబడిన తరగతుల కమిషన్ నిర్వహిస్తున్న సర్వేకు అవసరమైన సమాచారాన్ని ఇవ్వడానికి నిరాకరిస్తున్నాను' అని రాసి ఉంది. దానికితోడు సుధామూర్తి కన్నడంలో 'మేం ఏ బీసీ కులానికీ చెందము. కాబట్టి బీసీ కులాల కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేలో మేం పాల్గొనం' అని రాశారని తెలిసింది. అయితే దీనిని నిర్ధారించుకోవడానికి సుధామూర్తి, ఆమె వ్యక్తిగత సహాయకులు, ఇన్ఫోసిస్ అధికారులకు ఫోన్ చేయగా వారు స్పందించలేదు.

బీజేపీ ఉపముఖ్యమంత్రి పోస్టు ఆఫర్ చేసింది

» వద్దంటే జైలుకు పంపుతామన్నారు: డీకే శివకుమార్

బెంగళూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆరేళ్లక్రితం కాంగ్రెస్-జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వాన్ని కాపాడేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో, బీజేపీ సీనియర్ నేత ఒకరు తనకు ఉపముఖ్యమంత్రి ఆఫర్ ఇచ్చారని కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. దీనికి అంగీకరించకపోతే జైలుకు పంపుతామని బెదిరించారని, తాను పదవికి ఆశపడకుండా జైలుకే వెళ్లానని అన్నారు. స్థానిక ఎఫ్‌కేసీసీఐ ఆడిటోరియంలో కేఎం రఘు రచించిన 'ఏ సింబల్ ఆఫ్ లాయల్టీ.. డీకే శివకుమార్' అనే పుస్తకాన్ని బుధవారం రాత్రి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాను కాంగ్రెస్‌కు విధేయుడనని పేర్కొన్నారు. ఒకవేళ ఆనాడు తాను ఉప ముఖ్యమంత్రి పదవికి ఆశపడి ఉంటే రాష్ట్ర రాజకీయ చిత్రమే సంపూర్ణంగా మారిపోయి ఉండేదన్నారు.

వైమానిక దళ ర్యాంకుల్లో భారత్ సత్తా

» చైనాను అధిగమించి మూడో స్థానంలోకి

» నాలుగో స్థానానికి పరిమితమైన డ్రాగన్ దేశం

న్యూఢిల్లీ, అక్టోబరు 16: వైమానిక దళం ర్యాంకుల్లో చైనాను భారత్ అధిగమించింది. ప్రపంచంలోనే మూడో అత్యంత శక్తిమంతమైన దేశంగా అవతరించింది. సుదీర్ఘ కాలం నుంచి ఆసియాలో ప్రధాన వైమానిక శక్తిగా పేరొందిన చైనా ఇప్పుడు నాలుగో స్థానానికి పరిమితమైంది. ఈ జాబితాలో అమెరికా టాప్‌లో ఉండగా రెండో స్థానంలో రష్యా నిలిచింది. 103 దేశాలకు చెందిన 120 రకాల వైమానిక సేవలకు సంబంధించిన ర్యాంకులను వరల్డ్ డైరెక్టరీ ఆఫ్ మోడ్రన్ మిలిటరీ ఎయిర్‌క్రాఫ్ట్ (డబ్ల్యూడీఎంఎంఏ) తాజాగా విడుదల చేసింది. దీని ప్రకారం 242.9 ట్రూ వాల్ రేటింగ్ (టీవీఆర్)తో అమెరికా వాయుసేన మొదటి స్థానంలో ఉంది. రష్యా (114.24) రెండో స్థానంలో నిలవగా భారత్ (69.4), చైనా (63.8), జపాన్ (58.1), ఇజ్రాయెల్ (56.3), ఫ్రాన్స్ (55.3) ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. 46.3 రేటింగ్‌తో పాకిస్థాన్ 18వ స్థానానికి పరిమితమైంది.

డిజిటల్ అరెస్ట్ పేరుతో రూ.58 కోట్ల దోపిడీ

» ముంబై వ్యాపారవేత్త నుంచి దోచేసిన సైబర్ నేరగాళ్లు

ముంబై, అక్టోబరు 16: డిజిటల్ అరెస్ట్ మోసాలు పెరుగుతూనే ఉన్నాయి. తాజాగా డిజిటల్ అరెస్ట్ పేరుతో సైబర్ మోసగాళ్లు ముంబైకి చెందిన ఓ వ్యాపారవేత్త (72) నుంచి ఏకంగా రూ.58 కోట్లు దోచేసిన ఘటన వెలుగు చూసింది. ఈడీ, సీబీఐ అధికారులమని చెప్పి వాట్సాప్ వీడియో కాల్స్ చేసిన ఆ మోసగాళ్లు.. మనీలాండరింగ్ కేసు విచారణ పేరుతో వ్యాపారవేత్త దంపతులిద్దరినీ బెదిరించారు. దీని నుంచి బయటపడటానికిగాను డబ్బు బదిలీ చేయాలని ఒత్తిడి చేశారు. దీంతో ఆ వ్యాపారి ఆగస్టు నుంచి రెండు నెలల వ్యవధిలో మోసగాళ్లు చెప్పిన పలు బ్యాంకు ఖాతాలకు రూ.58.13 కోట్లు బదిలీ చేశారు. అయితే ఆ తర్వాత తాను మోసపోయినట్టుగా తెలుసుకున్న బాధితుడు పోలీసులను ఆశ్రయించారు. ఈ కేసులో అబ్దుల్ ఖుల్లి (47), అర్జున్ కద్వసార (55), అతని సోదరుడు జేతారామ్ కద్వసార (35)లను పోలీసులు అరెస్ట్ చేశారు.

విమాన ప్రమాదంపై విచారణ జరిపించాలి

» సుప్రీంకోర్టులో పైలట్ తండ్రి పిటిషన్

న్యూఢిల్లీ, అక్టోబరు 16: అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంపై న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ దుర్ఘటనలో మరణించిన పైలట్ కెప్టెన్ సుమీత్ సభర్వాల్ తండ్రి 91 ఏళ్ల పుష్కరాజ్ సభర్వాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జూన్ 12న ఎయిర్ ఇండియా ఏఐ171 విమానం కూలడంతో 260 మంది మరణించిన దుర్ఘటనపై రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తితో దర్యాప్తు జరిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆయనతో పాటు ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్ కూడా పిటిషన్ దాఖలు చేసింది. ఇప్పటికే ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బోర్డు (ఏఏఐబీ) దర్యాప్తు చేసి, ఇచ్చిన ప్రాథమిక నివేదికలో లోపాలు ఉన్నాయని తెలిపారు. ఆ ప్రమాదంలో మరణించిన పైలట్ సుమీత్ సభర్వాల్, కో-పైలట్ క్లైవ్ కుందర్‌లదే తప్పు అన్నట్టుగా నివేదిక ఉందని, అందువల్ల నిష్పక్షపాతంగా దర్యాప్తు జరపించాలని కోరారు.

గుజరాత్ మంత్రుల సామూహిక రాజీనామా

» నేడు కొత్త మంత్రివర్గ ప్రమాణ స్వీకారం

అహ్మదాబాద్, అక్టోబరు 16: గుజరాత్‌లో గురువారం అనూహ్య రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. సీఎం భూపేంద్ర పటేల్ మినహా మొత్తం 16 మంది మంత్రులు రాజీనామా చేశారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో కూర్పు సజావుగా సాగేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం నూతన మంత్రివర్గం ఏర్పాటు కానుంది. ప్రస్తుతం మంత్రివర్గంలో 16 మంది ఉండగా, ఆ సంఖ్యను 26కు పెంచే అవకాశం ఉంది.

రష్యా చమురుపై మళ్లీ మంటలు!



కొనుగోళ్లు ఆపేస్తామని మోదీ హామీ ఇచ్చారు

» ఉక్రెయిన్ యుద్ధం ముగింపు వైపు ఇదొక గొప్ప ముందడుగు: ట్రంప్

» ట్రంప్ వ్యాఖ్యలను తప్పుబట్టిన భారత్

» ఆయనతో మోదీ మాట్లాడలేదని ప్రకటన

వాషింగ్టన్/న్యూఢిల్లీ, అక్టోబరు 16: రష్యా చమురు కొనుగోళ్ల అంశం మరోసారి మంటలు రేపుతోంది. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను ఆపేస్తానని మోదీ తనకు హామీ ఇచ్చారంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొనగా.. మోదీ ట్రంప్‌కు భయపడి, చెప్పినట్టు వింటున్నారని ప్రతిపక్ష కాంగ్రెస్ విరుచుకుపడింది. మరోవైపు అసలు బుధవారం ట్రంప్, మోదీ మాట్లాడుకోనే లేదని భారత విదేశాంగ శాఖ ప్రకటించింది. చమురు కొనుగోళ్ల విషయంలో భారత్ తన జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేసింది.

మోదీ నా స్నేహితుడు: ట్రంప్

రష్యా నుంచి చమురు కొనుగోళ్లను ఆపేస్తామని భారత ప్రధాని మోదీ తనకు హామీ ఇచ్చారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధాన్ని ఆపేదిశగా ఇదొక గొప్ప ముందడుగు అని వ్యాఖ్యానించారు. బుధవారం (అమెరికా కాలమానం ప్రకారం) ఆయన అధ్యక్ష కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. "మోదీ నా స్నేహితుడు. మా మధ్య గొప్ప బంధం ఉంది. కానీ రష్యా నుంచి భారత్ చమురుకొనుగోలు చేయడం ఏమీ బాగోలేదు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధాన్ని కొనసాగించడానికి అది తోడ్పడుతోంది. అయితే రష్యా నుంచి చమురు కొనుగోళ్ల నిలిపివేస్తామని మోదీ నాకు హామీ ఇచ్చారు. ఇప్పటికిప్పుడు చమురు కొనుగోళ్లను ఆపేయలేరు. దానికి కొంత సమయం పడుతుంది. ఆ ప్రక్రియ ఇప్పుడు మొదలైంది" అని ట్రంప్ పేర్కొన్నారు. ఉక్రెయిన్‌పై యుద్ధం ఆపాక రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేసుకోవచ్చన్నారు. ప్రధాని మోదీ గొప్ప వ్యక్తి అని, ఆయనకు తానంటే చాలా ఇష్టమని పేర్కొన్నారు. మోదీ రాజకీయ భవిష్యత్తును దెబ్బతీయాలని తాను కోరుకోవడం లేదని పేర్కొన్నారు. భారత్‌కు ఒకప్పుడు తరచూ నేతలు మారిపోయేవారని.. కానీ మోదీ సుదీర్ఘకాలం కొనసాగుతున్నారని చెప్పారు.

మా ప్రయోజనాలకు అనుగుణంగా చమురు కొనుగోళ్లు: భారత్

రష్యా చమురు కొనుగోలు నిలిపివేస్తామని మోదీ హామీ ఇచ్చారన్న ట్రంప్ వ్యాఖ్యలను భారత విదేశాంగ శాఖ తప్పుబట్టింది. బుధవారం మోదీ, ట్రంప్ మాట్లాడుకోనే లేదని స్పష్టం చేసింది. భారత్ చమురు కోసం దిగుమతులపైనే ఆధారపడి ఉందని.. అలాంటప్పుడు జాతీయ ప్రయోజనాలు, మార్కెట్ స్థితిగతులకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటుందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ చెప్పారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విభిన్న మార్గాల్లో చమురు కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. అమెరికా నుంచి చమురు కొనుగోళ్ల పెంచేందుకూ చర్యలు చేపడుతున్నామని, దానిపై చర్చలు కూడా జరుగుతున్నాయని తెలిపారు. కాగా, భారత్-రష్యా మధ్య వాణిజ్య బంధం మరింత బలోపేతం అవుతోందని, భారత జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగానే చమురు కొనుగోలు చేస్తోందని భారత్‌లోని రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ పేర్కొన్నారు. మరోవైపు రష్యా నుంచి చమురు కొనుగోళ్లు చేస్తున్న భారత్.. తమకు కొంత మేర చైనా కరెన్సీ యువాన్లలో చెల్లింపు చేస్తోందని రష్యా ఉప ప్రధాని అలెగ్జాండర్ నొవాక్ తెలిపారు. ఇది స్వల్పమేనని, చాలా వరకు నేరుగా రష్యా కరెన్సీలోనే చెల్లింపులు జరుగుతున్నాయని వివరించారు.

ట్రంప్‌కు మోదీ భయపడుతున్నారు: రాహుల్

రష్యా కొనుగోళ్లు ఆపేస్తామని మోదీ హామీ ఇచ్చారన్న ట్రంప్ వ్యాఖ్యల నేపథ్యంలో.. ప్రధాని మోదీపై కాంగ్రెస్ విరుచుకుపడింది. భారత విదేశాంగ విధా నం పూర్తిగా కుప్పకూలిపోయిందని ఆరోపించింది. కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రతిపక్షాల సూచనలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ట్రంప్‌కు ప్రధాని మోదీ భయపడుతున్నారని, అమెరికా చెప్పినట్టుగా నడుచుకుంటున్నట్టు కనిపిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ వ్యాఖ్యానించారు. "ట్రంప్ తరచూ భారత్ పరువు తీస్తుంటే.. మోదీ మాత్రం ప్రశంసలు కురిపిస్తూ సందేశాలు పెడతారు. అమెరికాలో భారత ఆర్థిక మంత్రి పర్యటనను రద్దు చేశారు. గాజా శాంతి ఒప్పందానికి వెళ్లలేదు. భారత్-పాక్ యుద్ధం తానే ఆపానని ట్రంప్ ఎన్నిసార్లు చెబుతున్నా.. మోదీ నేరుగా ఖండించడం లేదు.." అని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. టారిఫ్‌లు వేస్తానని బెదిరించి భారత్-పాక్ యుద్ధాన్ని ఆపానని ట్రంప్ చెబుతూ ఉంటే.. ప్రధాని 56 అంగుళాల ఛాతీ ఏమైపోయిందని సీనియర్ నేత జైరాం రమేష్ ప్రశ్నించారు.

ఎస్ఐఆర్.. అత్యంత కచ్చితం

» దురుద్దేశంతోనే పార్టీలు, ఎన్జీవోలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయ్.. సుప్రీంకోర్టులో ఈసీ వాదనలు

న్యూఢిల్లీ, అక్టోబరు 16: బిహార్‌లో చేపట్టిన ఓటరు సమగ్ర సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్) అత్యంత కచ్చితంగా జరిగిందని ఎన్నికల సంఘం (ఈసీ) సుప్రీంకోర్టుకు తెలిపింది. ఆ ప్రక్రియను అప్రతిష్ఠపాలు చేయాలనే దురుద్దేశంతోనే కొన్ని రాజకీయపార్టీలు, స్వచ్ఛంద సంస్థలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని పేర్కొంది. ఓటర్ల తుది జాబితాను ప్రకటించిన తర్వాత.. తొలగింపునకు గురైన పేర్లను సవాల్ చేస్తూ ఒక్క ఓటరు కూడా ఇప్పటి వరకూ అప్పీల్ దాఖలు చేయలేదని వెల్లడించింది. ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్ల మీద విచారణను సుప్రీంకోర్టు గురువారం కొనసాగించింది. ఈ సందర్భంగా ఈసీ ధర్మాసనానికి అఫిడవిట్ సమర్పించింది. ఎస్ఐఆర్ నిర్వహణకు 90 వేల మందికి పైగా బూత్ స్థాయి అధికారులను నియమించామని, ఒక్కో ఇంటిని ఒకటికన్నా ఎక్కువసార్లు సిబ్బంది సందర్శించి వివరాలు సేకరించారని ఆ అఫిడవిట్‌లో ఈసీ పేర్కొంది. తుది జాబితాలో 3.66 లక్షల పేర్లు తొలగించామని, అయినప్పటికీ, ఒక్క ఓటరు కూడా అభ్యంతరం వ్యక్తం చేయలేదని, కాబట్టి, మొత్తం ప్రక్రియ అత్యంత కచ్చితంగా జరిగినట్లు భావించవచ్చని తెలిపింది. తొలగించిన పేర్లలో 34% ముస్లింలవేనని అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్, యోగేంద్రయాదవ్ (ఈ కేసులో పిటిషనర్లు) చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని పేర్కొంది. బిహార్‌లో ఎన్నికల నేపథ్యంలో రాజకీయపార్టీల ప్రతినిధులు విచారణకు హాజరు కాకపోవటాన్ని ప్రస్తావిస్తూ.. ధర్మాసనం తదుపరి విచారణను నవంబరు 4వ తేదీకి వాయిదా వేసింది. కాగా, ముఖంపై కొంగు కప్పుకున్న, బుర్ఖా ధరించిన మహిళా ఓటర్ల గుర్తింపును పోలింగ్‌బూత్‌లలో తనిఖీ చేయాల్సిందేనన్న తన ఆదేశాలను ఈసీ సమర్థించుకుంది. ఈ ఆదేశాలపై కొన్ని రాజకీయపార్టీలు అభ్యంతరం వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈసీ గురువారం స్పందించింది.

లోకం తీరు



చాట్‌జీపీటీలో శృంగార కంటెంట్

డిసెంబరు నుంచి 18 ఏళ్లు నిండినవారికి అందుబాటులోకి

వాషింగ్టన్, అక్టోబరు 16: నీలి చిత్రాలు, అశ్లీల చిత్రాలు చూడ్డానికి ప్రస్తుతం ప్రత్యేక వెబ్‌సైట్లు ఉన్నాయి! త్వరలో 'ఆ' తరహా కంటెంట్ చాట్‌జీపీటీ ద్వారా కూడా అందుబాటులోకి రానుంది!! అంటే.. యూజర్లు ఇచ్చిన ప్రాంప్ట్‌ల ఆధారంగా చాట్‌జీపీటీ అశ్లీల కంటెంట్‌ను అందిస్తుందన్నమాట!! 18 ఏళ్లు నిండినవారికి.. కథలు, యానిమేషన్ చిత్రాలు, వీడియోలు.. ఇలా ఏ రూపంలో కావాలంటే ఆ రూపం లో ఎరోటిక్ కంటెంట్‌ను అందిస్తామని చాట్‌జీపీటీని తయారుచేసిన 'ఓపెన్ ఏఐ' చీఫ్ శామ్‌ఆల్ట్‌మన్ స్వయంగా ప్రకటించారు. "'అడల్ట్‌ను (18 ఏళ్లు నిండినవారిని) అడల్ట్‌లాగానే చూస్తాం' అనేది తమ సిద్ధాంతమని, అందులో భాగంగానే డిసెంబరు నుంచి 'పెద్దలకు' ఎరోటిక్ (శృంగారపరమైన) కంటెంట్‌ను అందిస్తాం" అని ఆయన గొప్పగా చెప్పుకొన్నారు. అయితే, చాట్‌జీపీటీలో వచ్చే ఆ తరహా కంటెంట్‌లో అసలైన వ్యక్తులెవరూ ఉండరు. అంతా ఏఐ జనితమే! కృత్రిమ శృంగారమే!! కాగా.. టెస్లా చీఫ్ ఈలన్ మస్క్‌కు చెందిన 'ఎక్స్ ఏఐ' అభివృద్ధి చేసిన గ్రోక్ చాట్‌బాట్‌లో త్రీడీ యానిమేటెడ్ కంపానియన్స్ ద్వారా ఈ తరహా కంటెంట్ వినియోగదారులకు అందుబాటులో ఉంది. సదరు చాట్‌బాట్ గర్ల్‌ఫ్రెండ్స్.. వినియోగదారులతో శృంగార సంభాషణలు చేస్తుంటాయి. గ్రోక్ ఇమాజిన్ అనే టూల్ ద్వారా చిన్న చిన్న వీడియోలు కూడా తయారుచేయొచ్చు. నిజానికి.. శృంగారపరమైన కంటెంట్‌కు ఓపెన్‌ఏఐ మొదట్నుంచీ కావాలనే దూరంగా ఉంది. కానీ, గ్రోక్‌తో పోటీలో వెనకబడిపోతున్నందునే ఆ సంస్థ ఈ నిర్ణయం తీసుకుందని పలువురు విమర్శిస్తున్నారు.

2 రోజుల్లో 258 మంది నక్సల్స్ లొంగిపోయారు

» మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలి: అమిత్ షా



న్యూఢిల్లీ, అక్టోబరు 16: గడచిన రెండు రోజుల్లో 258 మంది మావోయిస్టులు లొంగిపోయారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లో గురువారం 170 మంది, అంతకు ముందు రోజు 27 మంది, మహారాష్ట్రలో 61 మంది మావోయిస్టులు ఆయుధాలు అప్పగించి లొంగిపోయారని తెలిపారు. నక్సలిజంపై పోరులో ఇది భారీ విజయమన్నారు. మావోయిస్టు పార్టీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్‌రావు సహా భారీ సంఖ్యలో నక్సలైట్లు లొంగిపోతున్న నేపథ్యంలో షా ఎక్స్‌లో పోస్ట్ పెట్టి తాజా పరిస్థితులను వివరించారు. ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్, ఉత్తర బస్తర్ ప్రాంతాలు మావోయిస్టుల నుంచి విముక్తి పొందాయని ప్రకటించేందుకు సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుతం మావోయిస్టుల ప్రభావం దక్షిణ బస్తర్‌కు మాత్రమే పరిమితమైందని, వారిని భద్రతా బలగాలు త్వరలోనే తుదముట్టిస్తాయని చెప్పారు. మోదీ ప్రభుత్వ విధానం స్పష్టంగా ఉందని, లొంగిపోయే వారికి స్వాగతం పలుకుతామని, అలా కాకుండా ఆయుధాలు వదిలిపెట్టబోమంటే వారిని భద్రతా బలగాలు తుడిచిపెట్టేస్తాయన్నారు.

ముందు మనల్ని మనం కాపాడుకోవాలి: ఆశన్న

» లొంగిపోవాలని ఇతర మావోయిస్టులకు పిలుపు

» 62671 38163 నంబరుకు ఫోన్ చేయవచ్చని సూచన

జగదల్‌పూర్, అక్టోబరు 16: సాయుధ పోరు చేస్తున్న మావోయిస్టులు ముందుగా ఆయుధాలు అప్పగించి ప్రాణాలు కాపాడుకోవాలని ప్రభుత్వానికి లొంగిపోయిన ఆ పార్టీ అగ్రనేత ఆశన్న పిలుపునిచ్చారు. లొంగిపోవాలనుకుంటున్న మావోయిస్టులు తనను సంప్రదించవచ్చంటూ తన ఫోన్ నంబరును వెల్లడించారు. ప్రభుత్వానికి లొంగిపోయేందుకు వెళుతున్న సమయంలో గురువారం జగదల్‌పూర్‌లో మీడియా ప్రతినిధులతో ఆశన్న మాట్లాడారు. "సాయుధ పోరు చేస్తున్న సహచరులారా.. నేను ఈ నిర్ణయం తీసుకోవాల్సి రావడం కొందరికి అభ్యంతరకరంగా ఉంది. అయితే, ఏ పరిస్థితుల్లో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందో అర్థం చేసుకోవాలని కోరుతున్నాను. మీరు కూడా ఆలోచించాలి. మీ భద్రతపై ఆందోళనగా ఉంది. ముందుగా మనల్ని మనం కాపాడుకోవాలి. ఆ తర్వాత ఏం చేయాలనేది ఆలోచించుకోవచ్చు. అవకాశాలను సద్వినియోగం చేసుకోవచ్చు. లొంగిపోవాలనుకునే మావోయిస్టులు నన్ను సంప్రదించేందుకు నా నంబరు ఇస్తున్నా. మీ ఆలోచనలు చెప్పవచ్చు" అని వ్యాఖ్యానించారు. తన ఫోన్ నంబరును 62671 38163గా తెలిపారు.


భారీగా లొంగుబాట్లు!

(మొదటి పేజీ తరువాయి)

...ఉన్నారు. తొలుత, వీరంతా ఉప్పారి ఘాట్ వద్ద సమావేశమయ్యారు. అనంతరం బోట్లపై ఇంద్రావతి నదిని దాటి బీజాపూర్ చేరుకున్నారు. అక్కడి నుంచి వారిని ప్రత్యేక బస్సుల్లో బీజాపూర్ జిల్లా భైరంగఢ్ పోలీస్ క్యాంపునకు తరలించారు. అక్కడి నుంచి వారిని జగ్‌దల్‌పూర్‌కు తీసుకెళ్లారు. వీరు తమ వెంట 70 తుపాకులు, పేలుడు సామగ్రిని తీసుకెళ్లారు. అలాగే, కాంకేర్‌లో లొంగిపోయిన 50 మందిని కూడా జగ్‌దల్‌పూర్‌కు తరలించారు. శుక్రవారం ఉదయం ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి సమక్షంలో వీరంతా తుపాకులు వీడనున్నారు. ఆశన్న లొంగుబాటును కూడా శుక్రవారమే అధికారికంగా ప్రకటించనున్నారు. కాగా.. మావోయిస్టులు ఇంత పెద్ద మొత్తంలో లొంగిపోవడం ఇదే మొదటిసారి.



లొంగిపోవడానికి వస్తున్న మావోయిస్టులు



ఇంద్రావతి నది దాటి వస్తున్న మావోయిస్టులు

మాడ్ ఏరియా కమిటీ ఖాళీ

కేంద్ర కమిటీ సభ్యుడు ఆశన్నతోపాటు మాడ్ ఏరియా కమిటీ సభ్యులంతా శుక్రవారం లొంగిపోనున్నారు. వీరిలో 10 మందికిపైగా డీవీసీఎం సభ్యులున్నట్లు తెలుస్తోంది. మావోయిస్టు పార్టీకి మాడ్ ఏరియా చాలా కీలకమైన ప్రాంతం. అక్కడి నుంచే మావోయిస్టులు పార్టీని నడిపించేవారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలోని మావోయిస్టులంతా పూర్తిగా లొంగిపోయినట్లు తెలుస్తోంది. ఇప్పటికే అబూజ్‌మడ్ ప్రాంతం ఖాళీ కాగా తాజాగా మాడ్ ప్రాంతమూ ఖాళీ అయినట్లు అవుతోంది. ఒకప్పుడు 16 రాష్ట్రాల్లోని 336 జిల్లాలకు విస్తరించిన మావోయిస్టుల ప్రభావం.. ప్రస్తుతం 3 జిల్లాలకే పరిమితమైంది. పలు రాష్ట్రాల్లో సమాంతర ప్రభుత్వం నడిపిన అన్నలు.. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం, మావోయిస్టు పార్టీలో నెలకొన్న విభేదాలను అంచనా వేయలేకపోయారు. దీంతో, ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లతో మావోయిస్టు పార్టీ చతికిలపడింది. కాగా.. అడవుల్లో ప్రస్తుతం మావోయిస్టుల సంఖ్య కేవలం 200 వరకు ఉండొచ్చని పోలీసులు చెబుతున్నారు. అదే సమయంలో.. ఛత్తీస్‌గఢ్‌లో హిడ్మా, పాపారావు, తిప్పిరి తిరుపతి టార్గెట్‌గా కేంద్ర బలగాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి.

అందరూ లొంగిపోవాలి: ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి విజయశర్మ

మావోయిస్టులు అందరూ లొంగిపోవాలని ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి విజయ శర్మ కీలక ప్రకటన చేశారు. ఆపరేషన్ కగార్‌తో బస్తర్ డివిజన్‌లోని కొండగావ్, దంతెవాడ, కాంకేర్ జిల్లాల్లో నక్సల్ ప్రభావం పూర్తిగా తగ్గిందని, నారాయణపూర్, సుకుమా, బీజాపూర్ జిల్లాల్లో మాత్రమే మావోయిస్టుల కదలికలు ఉన్నాయని చెప్పారు. వచ్చే మార్చికి ఇతర జిల్లాల్లో కూడా నక్సల్స్ ప్రభావం ఉండదన్నారు. మావోయిస్టులు లొంగిపోతామని అంటే స్వాగతిస్తామని, లొంగుబాటు కార్యక్రమానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా రావడం లేదని తెలిపారు.

రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి ప్రకాశ్ కూడా!?

మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు, సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస) కార్యదర్శి బండి ప్రకాశ్ అలియాస్ ప్రభాత్ అలియాస్ అశోక్ కూడా హైదరాబాద్‌లో పోలీసు అధికారుల ఎదుట లొంగిపోవడానికి నిర్ణయించుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. బండి ప్రకాశ్ మంచిర్యాల జిల్లా మందమర్రివాసి. బండి రామారావు, అమృతమ్మ దంపతుల నలుగురు బిడ్డల్లో రెండో సంతానం. 40 ఏళ్ల కిందట మావోయిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితుడై అడవి బాట పట్టారు. మందమర్రి సీపీఐ నేత వీటి అబ్రహం హత్య కేసులో ప్రకాశ్ కీలక పాత్ర పోషించినట్లు చెబుతుంటారు. అప్పట్లో ఆ కేసులో అరెస్టయిన ఆయనను ఆదిలాబాద్ జైలుకు తరలించారు. అక్కడి నుంచే మావోయిస్టు నేతలు నల్ల ఆదిరెడ్డి, ముంజం రత్నయ్య, హుస్సేన్‌తోపాటు బండి ప్రకాశ్ కూడా 1988లో తప్పించుకున్నారు. నల్ల ఆదిరెడ్డి ఆ సమయంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు. కాగా, ఆయనను తప్పించడంలో ప్రకాశ్ కీలక పాత్ర పోషించినట్లు చెబుతారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో చర్చల సందర్భంగా అడవిని వదిలి బయటకు వచ్చిన ప్రకాశ్.. చర్చలు విఫలమైన తర్వాత తిరిగి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ప్రకాశ్ సికాస కార్యదర్శిగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కోల్‌బెల్ట్ ఏరియాలో సికాస పటిష్ఠానికి ఆయన తనవంతు కృషి చేశారనే పేరుంది. అలాగే, ప్రభాత్ పేరుతో ఆయన ప్రెస్ నోట్లు, కరపత్రాలు విడుదల చేసేవారు. ఆయన లొంగుబాటుతో సికాస బాధ్యతలు చూసేవారు కరువయ్యారనే అభిప్రాయలు వ్యక్తమవుతున్నాయి. కాగా, పోలీసుల రికార్డుల ప్రకారం.. ప్రకాశ్ తలపై రూ.20 లక్షల రివార్డు ఉంది.



చంద్రబాబుపై దాడిలో ఆశన్న కీలకం


ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన కీలక మావోయిస్టు దాడుల్లో తక్కెళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న కీలక పాత్ర పోషించారు. ఆయన స్వస్థలం ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని నర్సింగాపూర్. గ్రామానికి చెందిన తక్కళ్లపల్లి భిక్షపతిరావు, సరోజన దంపతుల పెద్ద కుమారుడు ఆయన. ఐటీఐ పాలిటెక్నిక్ చదివిన ఆయన.. చిన్నతనంలోనే మావోయిస్టు భావజాలానికి ఆకర్షితుడై 1990లో అడవి బాట పట్టాడు. 2010 ప్రాంతంలో సీపీఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీలో చేరారు. దాడుల వ్యూహాలను రూపొందించడంలో, బాంబుల తయారీలో చేయి తిరిగిన ఆశన్న.. ఐపీఎస్ ఉమేష్‌చంద్ర, మాజీ హోం మంత్రి మాధవరెడ్డిపై జరిగిన దాడుల్లో కీలక పాత్ర పోషించారు. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడిపై 2003 అక్టోబరు 1న అలిపిరిలో జరిగిన దాడిలో కీలక పాత్ర ఆశన్నదే. మాజీ సీఎం నేదురుమల్లి జనార్దన్ రెడ్డి హత్యకు 2003, 2007లో రెండు సార్లు దాడి చేశారని చెబుతారు. అలాగే, గడ్చిరోలిలో 2019లో జరిగిన ఐఈడీ పేలుడు ఘటనలో 15 మంది మహారాష్ట్ర పోలీసులు చనిపోయిన సంగతి తెలిసిందే. ఆ ఘటనకు కీలక సూత్రధారి ఆశన్న. పార్టీలో అత్యంత ప్రమాదకరమైన మావోయిస్టుల్లో ఆశన్న ఒకరు. మూడు దశాబ్దాలుగా ఆయనను పట్టుకోవడానికి పోలీసులు విఫల యత్నాలు చేస్తూనే ఉన్నారు. ఇప్పుడు ఆయన లొంగుబాటు మావోయిస్టు పార్టీకి గట్టి దెబ్బే

ఆత్మ నిర్భర్ భారత్‌లో ఏపీ కీలకం

'ఢిల్లీ-అమరావతి' ప్రగతి పరుగు.. చంద్రబాబు, పవన్‌ల నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రం మారుతోంది

- కర్నూలు సభలో ప్రధాని మోదీ
- పనుల ప్రారంభం, శంకుస్థాపనలు

కర్నూలు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అభివృద్ధితోనే భారతదేశ అభివృద్ధి ముడిపడి ఉందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. వికసిత ఏపీలో రాయలసీమ అభివృద్ధి ఎంతో కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. 'ఢిల్లీ-అమరావతి' కలిసి ప్రగతిని పరుగులు తీయిస్తాయని స్పష్టం చేశారు. గురువారం ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ.. తొలుత శ్రీశైల మల్లికార్జునుడిని దర్శించుకున్నారు. అక్కడి శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని వీక్షించారు. అనంతరం కర్నూలుకు చేరుకున్నారు. నన్నూరు సమీపంలోని వేదిక నుంచి ఏపీలోని పలు ప్రాంతాల్లో రూ.13,429కోట్లతో చేపట్టిన పలు ప్రాజెక్టులు, పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. అనంతరం జరిగిన భారీ బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. 'సోదర సోదరీ మణులకు నమస్కారములు' అంటూ తెలుగులో తన ప్రసంగాన్ని ప్రారంభించారు. గత 16 నెలలుగా డబుల్ ఇంజన్ సర్కారుతో, చంద్రబాబు, పవన్ కల్యాణల సమర్థ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రగతి పరుగులు తీస్తోందని, రాష్ట్ర ముఖచిత్రం మారుతోందన్నారు. "ఏ దేశమైనా, రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే ఇంధన భద్రత చాలా ముఖ్యం. ఈ రోజు ఇక్కడ మూడు వేల కోట్ల విలువైన ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులు ప్రారంభిస్తున్నాం. ఫలితంగా దేశ ఇంధన సామర్థ్యం మరింత పెరుగుతుంది. ఈ రోజు కర్నూలులో ప్రారంభించిన పనులు రాయలసీమలో ఉద్యోగాలు సృష్టిస్తాయి. సీమ ప్రగతికి కొత్త ద్వారాలు తెరుస్తాయి. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి" అని మోదీ అన్నారు. 21వ శతాబ్దం మన దేశానిది, 140కోట్ల మంది భారతీయులది అని స్పష్టం చేశారు. "ఇప్పుడు ప్రపంచం మన దేశాన్ని 21వ శతాబ్దపు తయారీ కేంద్రంగా చూస్తోంది. 'ఆత్మ నిర్భర్ భారత్' దీనికి బలమైన పునాది. ఈ దిశగా ఏపీ ఎంతో కీలకం కాబోతోంది" అని వ్యాఖ్యానించారు. టెక్నాలజీ విషయంలో ఏపీ యువత చాలా ముందుంటుందని ప్రధాని కొనియాడారు. విశాఖలో ఏర్పాటవుతున్న గూగుల్ ఏఐ హబ్, గూగుల్ పెట్టుబడితో కొత్త అంతర్జాతీయ గేట్‌వే ప్రారంభమవుతుందని.. తూర్పు తీరంలోని విశాఖపట్నం కేబుల్ కేంద్రమై, దేశానికే కాక.. ప్రపంచానికే సేవలందించే కేంద్రంగా విశాఖ అవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు విజన్‌ను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. మోదీ తన ప్రసంగంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పుణ్యక్షేత్రాలు, మహనీయులను స్మరించుకున్నారు. "అహోబిలం నరసింహ స్వామి, మహానందిలోని మహానందీశ్వరుడికి నా నమస్సులు. మంత్రాలయంలో కొలువైన గురు రాఘవేంద్ర స్వామి ఆశీస్సులు మనందరిపైనా ఉండాలని ప్రార్థిస్తున్నాను. సోమనాథుడి భూమి సౌరాష్ట్రలో జన్మించడం నా అదృష్టం. కాశీ సేవ చేయడం మరింత సౌభాగ్యం. నేడు.. శ్రీశైల మల్లికార్జునుడి ఆశీస్సులు పొందాను. అల్లమప్రభువు, అక్క మహాదేవి వంటి శివ భక్తులకు నా నమస్కారాలు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, హరి సర్వోత్తమ్ రావులాంటి స్వాతంత్ర సమర యోధులకు నేను శ్రద్ధాంజలి అర్పిస్తున్నా!" అని తెలిపారు.



శ్రీశైలంలోని మల్లికార్జునస్వామి దర్శనానంతరం ఆలయ సన్నిధిలో మోదీ, చంద్రబాబు, పవన్

మోదీ అరుదైన నేత : చంద్రబాబు

"మోదీ 21వ శతాబ్దపు నేత. నేను ఎందరో ప్రధానులతో కలిసి పనిచేసినా ఆయనలాంటి వ్యక్తిని చూడలేదు. నిర్విరామంగా ప్రజాసేవలోనే ఉంటున్న అరుదైన నేత" అని ఏపీ సీఎం చంద్రబాబు ప్రధానిపై ప్రశంసల జల్లు కురిపించారు. గురువారం కర్నూలులో నిర్వహించిన 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' సభలో ఆయన ప్రసంగించారు. ప్రధాని మోదీ తెచ్చిన సంస్కరణలు దేశానికే గేమ్ చేంజర్లుగా అభివర్ణించారు. ఏపీకి 16 నెలలుగా ప్రధాని మోదీ అందిస్తున్న సాయం మరువలేనిదన్నారు. "మోదీ విజయయాత్ర నిరంతరం కొనసాగాలి. బిహార్ ఎన్నికల్లోనూ గెలుస్తుందని విశ్వసిస్తున్నాను" అని చంద్రబాబు పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

శాంతి ఆశలు!

ఈజిప్ట్ షర్మ్ అల్ షేక్‌లో ఎంతో ఆర్భాటంగా జరిగిన శిఖరాగ్ర శాంతి సదస్సుకు భారత ప్రధానమంత్రి ఎందుకు వెళ్ళలేదు? తనతో పాటు, పాకిస్థాన్ ప్రధాని షరీఫ్‌ను కూడా అమెరికా అధ్యక్షుడు ఆహ్వానించడం మోదీకీ నచ్చలేదా? ఇజ్రాయెల్–హమాస్ మధ్య ట్రంప్ బలవంతంగా కుదిర్చిన శాంతి ఒప్పందాన్ని అమెరికా ఆప్తమిత్రదేశాల అధినేతల కంటే ఘనంగా కీర్తించిన నరేంద్రమోదీ ఆ కార్యక్రమానికి వెళ్ళివుంటే భారత్–అమెరికా మధ్య ప్రస్తుతం నెలకొనివున్న వేడి కాస్తంత చల్లారేదని కొందరి భావన. ఒప్పందంలో కీలకపాత్ర పోషించిన టర్కీ, ఖతార్, అమెరికా, ఈజిప్ట్ వినా మిగతా దేశాధినేతలు, రాజులూ యువరాజులదంతా అక్కడ ప్రేక్షకపాత్రే. అయితే, కార్యక్రమానికి ఆతిథ్యం ఇచ్చిన ఈజిప్ట్ అధ్యక్షుడి ప్రసంగం మినహా, మాట్లాడమంటూ ట్రంప్ స్వయంగా ముందుకు తోసిన ఏకైకవ్యక్తి పాకిస్థాన్ ప్రధాని షరీఫ్. దీంతో ఉబ్బితబ్బిబ్బయిన పాక్ ప్రధాని ఈ వేదికగా మరోమారు తన విశ్వాస ప్రకటన చేశారు. ట్రంప్‌ను మహాద్భుతమైన అరుదైన వ్యక్తిగా కీర్తిస్తూ, ఈ శాంతి ప్రేమికుడిని తాను మళ్ళీ నోబెల్‌కు నామినేట్ చేస్తాననీ, ఇది కేవలం గాజాలో శాంతి సాధించినందుకు కాక, దక్షిణాసియాలోనే లక్షలాదిమంది ప్రాణాలను కాపాడినందుకని చిన్న షరీఫ్ ప్రకటించారు. మే నెలలో భారత్–పాక్ మధ్య ఘర్షణలను నిలువరించి, రెండు అణ్వాయుధ దేశాల మధ్య ఒక మహాయుద్ధం జరగకుండా ట్రంప్ చేశారని ఈ వ్యాఖ్యల అర్థం. ట్రంప్ తనను తెరముందుకు తెచ్చినందుకు కృతజ్ఞతగా ఈ మారు నేరుగా భారత్ పేరు ప్రస్తావించకుండానే ఆయనను కీర్తించి షరీఫ్ మంచి మార్కులు కొట్టేశారు. తాను కోరుకుంటున్నదే షరీఫ్ నోట వినబడుతుందని ట్రంప్‌కూ తెలుసు. అదిమాత్రమే కాక, గాజా శాంతి ఒప్పందం మరుసటి దశల అమలులో పాకిస్థాన్ ప్రముఖ పాత్ర పోషించబోతున్నదన్న సందేశం కూడా ఇందులో ఉన్నదని కొందరి వాదన.

పశ్చిమాసియా పరిస్థితులను ప్రముఖంగా మార్చివేసే ఈ ఘట్టానికి, భారత ప్రధాని దూరంగా ఉండిపోవడం సరికాదని, ఇజ్రాయెల్ నుంచి ఇరాన్ వరకూ, అరబ్ దేశాలన్నింటితోనూ సత్సంబంధాలున్న మనం, అంతటి పెద్ద వేదిక మీద కనిపించివుంటే బాగుండేదన్న అభిప్రాయం కొట్టిపారేయలేనిది. వందిమాగధులంతా ట్రంప్‌కు జేజేలు పలికే ఈ కార్యక్రమానికి వెడితే తానూ ఏమి చేయాల్సివస్తుందో తెలుసు కనుకనే దూతను మాత్రమే పంపి మోదీ సరిపెట్టివుండవచ్చు. ఎట్టకేలకు ఈ శాంతి ఒప్పందం కుదిరినందుకు ప్రపంచమంతా సంతోషిస్తున్నా, కేవలం తొలి అడుగుపడి, ఇంకా అనేక కీలకదశలు దాటాల్సి ఉన్న తరుణంలో అపనమ్మకాలూ లేకపోలేదు. హమాస్ చెరలో ఉండిపోయిన ఇజ్రాయెలీ పౌరులు, ఇజ్రాయెల్ జైళ్ళలో మగ్గుతున్న పాలస్తీనా పౌరుల్లో ఏదోవంతు మంది బయటకు వచ్చిన ఆ దృశ్యాలు ఎంతో ఉపశమనం కలిగించాయి. ఇజ్రాయెల్ సైన్యాలు వెనక్కు తగ్గడం, ఎక్కడెక్కడో తలదాచుకున్న గాజా పౌరులు తిరిగి రావడం వంటి పరిణామాలు బాగున్నాయి. అయితే, ఒప్పందాలూ అవగాహనలను ఉల్లంఘించడం ఇజ్రాయెల్‌కు అలవాటే కనుక, అమెరికా అధ్యక్షుడు హితవుపలికినట్టు శాంతిని కడవరకూ కాపాడాల్సిన బాధ్యత ప్రధానంగా ఇజ్రాయెల్‌పైనే ఉంది. రెండేళ్ళ యుద్ధంలో పూర్తిగా నేలమట్టమైపోయిన గాజా భవితవ్యం గురించి కానీ, స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటు ఊసు గానీ ఈ ఒప్పందంలో లేవు. హమాస్ చేతుల్లో నుంచి జీవించివున్న బందీలంతా విడుదలైనప్పటికీ, మిగతావారి మృతదేహాల అప్పగింత విషయంలో వివాదం సాగుతూనే ఉంది. నెతన్యాహూ చెబుతున్న లెక్కలకు, హమాస్ అప్పగింతలకు లెక్కసరిపోవడం లేదు. ఇరవై మృతదేహాలను తన దగ్గరే పెట్టుకొని హమాస్ కొత్త నాటకానికి తెరదీసిందని ఇజ్రాయెల్ ఆరోపణ. గాజాలో సామాన్యుల ప్రాణాలు తీస్తూ ఇజ్రాయెల్ ఈ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తున్న ఘటనలు కూడా వెలుగుచూస్తున్నాయి. నోబెల్ శాంతికోసం అల్లాడిపోతున్న ట్రంప్ మళ్ళీ హమాస్‌ను తప్పుబట్టడం ఆరంభించారు. బందీలంతా క్షేమంగా తిరిగి వచ్చేశారు కనుక, మృతదేహాల పేరిట ఇజ్రాయెల్ తిరిగి కయ్యానికి కాలుదువ్వే ప్రమాదం కనిపిస్తోంది. కట్టుదాటితే ఏ మాత్రం క్షమించేది లేదని ఇజ్రాయెల్‌ను ట్రంప్ ఘాటుగా హెచ్చరించినప్పుడే, ఈ ఒప్పందం నిలుస్తుంది.

తలను వదిలి తోక దగ్గర విన్యాసం!

'వారెక్కడ.. వీరెక్కడ?' శీర్షికతో అక్టోబరు 5న ఆంధ్రజ్యోతిలో దుగ్గరాజు శ్రీనివాసరావు రాసిన వ్యాసంలో– 2024 జనవరిలో విజయవాడలో జరిగిన విప్లవ రచయితల సంఘం 29వ మహాసభలు; తొలితరం కమ్యూనిస్టు నాయకుడు చండ్ర రాజేశ్వరరావులకు సంబంధించి ప్రస్తావనలు చేశారు. ఇంతకుమించి ఆయన వ్యాసంలో ఎంత వెతికినా పరిగణించదగ్గ మూడో అంశం కనిపించలేదు. ఆరెస్సెస్‌తో పాటే వందేళ్ల క్రితం ప్రయాణం మొదలుపెట్టిన కమ్యూనిస్టుల శిబిరంలో ఇప్పుడు నిరాశానిస్పృహలు ఆవరించాయని చెప్పడం ఆయన ఉద్దేశం.

కమ్యూనిస్టు రాజకీయాలు, భావజాల విఫలత గురించి చెబుతూ విరసం 29వ మహాసభల ప్రస్తావన తెచ్చారు. ఆ సభల్లో మా సభ్యుడు సంఘ్ భావజాల వ్యాప్తి పట్ల ఒకింత దిగ్భ్రాంతిని, విప్లవ భావజాల స్థితి పట్ల కొంత నైరాశ్యాన్ని కనపరిచినట్టు ఆయన చెప్పుకొచ్చారు. అయితే, ఇక్కడ దుగ్గరాజు సంవాద మర్యాదను పాటించలేదు. ఒకరి వ్యాఖ్యలను విశ్లేషణకు స్వీకరించినప్పుడు ముందుగా ఆ వ్యాఖ్యలను పూర్తిగా ఉటంకించాలి. అలా కాకుండా మా సభ్యుని మొత్తం ప్రసంగంలో తనకు అనుకూలంగా ఉన్న కొద్ది భాగం తీసుకుని ఈకలు పీకే పని చేశారు.



భిన్నాభిప్రాయాన్ని కమ్యూనిస్టులు సహించబోరనేది దుగ్గరాజు నిరూపించాలనుకున్న మరో అంశం. ఇందుకు కూడా విరసం 29వ మహాసభలనే ఆయన ఎంచుకున్నారు. మా భావజాలానికి భిన్నంగా నర్మద అనే మహిళ సభా వేదికపై మాట్లాడబోతే మేం మైక్ కట్ చేశామట! అయితే, ఆ పేరు కలిగినవారు ఎవరూ వేదిక మీద మాట్లాడలేదు. మరే మహిళా కార్యకర్త కూడా ఆయన చెబుతున్న మాటలు వేదికపై మాట్లాడలేదు. అనారోగ్యంతో చనిపోయిన మావోయిస్టు నాయకురాలు, విప్లవ రచయిత్రి నర్మద పేరిట ఆ సభల్లో మేం పోడియం ఏర్పాటుచేశాం. దుగ్గరాజు వ్యాసం చాలా భాగం ఇలాంటి గందరగోళాలతోనే నిండి ఉంది.

ఒక భావజాల సంస్థ భిన్నాభిప్రాయాలను ఆహ్వానించకుండా మనుగడ సాగించలేదు. నిజానికి, ఆయన ప్రస్తావించిన రెండు రోజుల మహాసభల్లో రాజ్యాంగవాదంపై క్రిటికల్ అవగాహనను మేం అందించాం. అదే సభల్లో మా అవగాహనతో విభేదిస్తూ, అనుకూలిస్తూ పలువురు వేర్వేరు సెషన్లలో స్పందించారు. అందులో కొందరు మహిళా కార్యకర్తలు కూడా ఉన్నారు. వారిలో ఎవరి మైక్‌ను కూడా మేం కట్ చేయలేదు. ఆయన అన్నట్టు రాజ్యాంగబద్ధ పోరాటాల గురించి ఎవరూ వేదికపై మాట్లాడలేదు అనేది అబద్ధం. రాజ్యాంగబద్ధంగా పోరాటాలు నిర్వహిస్తున్న ఆదివాసీలు మొదటిసారి విజయవాడ వచ్చి, వారి ప్రాంతాలలో జరుగుతున్న రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ అతిక్రమణ, ఫారెస్ట్ యాక్ట్ అమలుకాకపోవడం గురించి మాట్లాడారు. రాజ్యాంగవాద చర్చలో భాగంగా వచ్చిన అన్ని అభిప్రాయాలనూ మహాసభల ప్రత్యేక సంచికలో యథాతథంగా ప్రచురించాం.

తొలితరం కమ్యూనిస్టు నాయకులు ఎందరో ఉన్నారు. అయినా, చండ్ర రాజేశ్వరరావు ప్రస్తావననే దుగ్గరాజు ఎందుకు తెచ్చారు? తిరోగమన శక్తుల ఆధిక్యతను రాజేశ్వరరావు అంగీకరించారని చెప్పడానికి ఆయనవి అని చెబుతున్న వాక్యాలను, ఆయన కుమారుడి మాటలను మాత్రమే ఎందుకు తీసుకున్నారు? ఇది అర్థం కావాలంటే తెలుగు సమాజంలో జరిగిన ఫాసిస్టు వ్యతిరేక ఉద్యమాల చరిత్ర కొంతైనా మనకు తెలియాలి. అప్పుడే దుగ్గరాజు ఉద్దేశం మనకు తెలుస్తుంది. 1940ల్లో చండ్ర రాజేశ్వరరావు నాయకత్వంలో కమ్యూనిస్టు కార్యకర్తలు కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఆరెస్సెస్ విస్తరణ ప్రయత్నాలను నిలువరించారు. బెజవాడ వీధుల్లో సంఘ్ తలపెట్టిన సాయుధ ప్రదర్శనను వీరోచితంగా ఎదుర్కొని భగ్నం చేశారు. ఈ నేపథ్యంలోనే ఆయన ఆరెస్సెస్ నిజస్వరూపం అనే పుస్తకం కూడా రాశారు. అలాంటి రాజేశ్వరరావే కమ్యూనిస్టుల విఫలతను, ఆరెస్సెస్ ఆధిక్యతను గుర్తించారని చెప్పడానికి దుగ్గరాజు తన వ్యాసంలో తెగ తాపత్రయపడిపోయారు. చండ్ర రాజేశ్వరరావుకు సంబంధించి ఆయన కుమారుడు ఇచ్చినట్టు చెబుతున్న నోట్‌బుక్ మా దృష్టిలో లేదు. ఈ బుక్‌ను బట్టి చివరి రోజుల్లో రాజేశ్వరరావు అవగాహన అలా ఉందని మాత్రమే తెలుసుకోగలం. ఎన్నేళ్లు గడిచినా తన సైద్ధాంతిక, రాజకీయ ప్రత్యర్థిని ఏమరుపాటున కూడా విరుద్ధ భావజాలశక్తులు మరిచిపోబోవనేది మాత్రం రాజేశ్వరరావు సందర్భంలో సుస్పష్టమైంది. ఆ క్రమంలోనే విప్లవ శిబిరంపైనా, ప్రత్యేకించి విరసంపైనా కుతూహలం కొద్దీ దాడికి దుగ్గరాజు ప్రయత్నించారు. అయితే, కనీసం తన వాదనను కూడా చెప్పుకోలేక కిందా మీద అయి.. చివరకు గందరగోళంగానే తన వ్యాసం ముగించారు.

● అరసవిల్లి కృష్ణ, అధ్యక్షుడు
రివేరా, కార్యదర్శి
విప్లవ రచయితల సంఘం


తరాల మార్పుతోనే జాతికి నవోదయం

దేశ రాజకీయాలలో మార్పులు ఎలా సాధ్యమవుతాయి? తరాల మార్పుతోనే జాతి ప్రస్థానంలో మేలు మలుపులు సంభవిస్తాయని అసంఖ్యాకులు సునిశ్చితంగా విశ్వసిస్తున్నారు. మరి అటువంటి మార్పుల ఆగమన సూచనలు ఏమైనా కనిపిస్తున్నాయా? దేశ పాలనా వ్యవహారాలను నిర్దేశిస్తున్న నాయకత్వంలో తరం మార్పును మనం చూడగలమా? 1960వ దశకం తొలినాళ్లలో దేశ నాయకత్వంలో ఒక కొత్త తరం రానున్నదని చాలా మంది భావించారు. ఆ భావనతోనే 'నెహ్రూ తరువాత ఎవరు?' అనే విషయమై మథనపడ్డారు. దేశానికి కొత్త నాయకత్వం ప్రభవించనున్నదన్న ఆశ, ప్రభవించాలన్న ఆకాంక్షలే ఆ మథనంలో అంతర్లీనంగా ఉన్నాయి. 'కామరాజ్ ప్రణాళిక' (1963) అటువంటి ఆశాభావానికి ఆలంబన అయింది. ఎస్‌కె పాటిల్, అతుల్య ఘోష్, నిజలింగప్ప, నీలం సంజీవరెడ్డి మొదలైన పాత కాంగ్రెస్ యోధుల నిష్క్రమణతో దేశ నాయకత్వంలో తరం మార్పు సంభవిస్తుందనే నిండు నమ్మకం ప్రజల్లో నెలకొన్నది. అయితే ఆ నమ్మకం వమ్ముకావడానికి ఎంతో కాలం పట్టలేదు. 'మరలి వచ్చిన ఎర్ర గులాబీ'గా కీర్తిహారతి నందుకున్న నెహ్రూ తనయ ఇందిరాగాంధీ పార్టీలోనూ ప్రభుత్వంలోనూ తన నాయకత్వాన్ని పటిష్ఠం చేసుకుని అధిష్ఠానవర్గ సంస్కృతిని కొనసాగించారు. ఈ యువ నాయకురాలు దేశానికి కొత్త ప్రజాస్వామిక నాయకత్వ వెలుగులను ఇవ్వలేకపోయారు.

దేశ పాలనా వ్యవహారాలు, ఎన్నికల రాజకీయాలలో ధోరణులను నేను చాలా కాలంగా విశ్లేషిస్తూ వస్తున్నాను. 1964లో జవహర్‌లాల్ నెహ్రూ కీర్తిశేషుడు అయిన నాటి నుంచి ప్రస్తుత దశకం దాకా దేశ నాయకత్వంలో తరాల మార్పుకు మంచి అవకాశాలు మూడుసార్లు తప్పిపోయాయని నా విశ్లేషణల్లో అవగతమయింది. ఐదేళ్ల వ్యవధిలో తరం మార్పు జరగడమనేది అసంభవం. అయితే ఒక

> చట్టసభలలో 'ప్రాతినిధ్య స్వభావాన్ని' మెరుగుపరిచేందుకు తక్షణమే తగు చర్యలు చేపట్టాలి. తరం మార్పును సాధించే విధంగా ఆ చర్యలు ఉండి తీరాలి. తొలుత శాసనసభలు, పార్లమెంటులో యువజనుల, మహిళల ప్రాతినిధ్యాన్ని మరింతగా పెంపొందించాలి. అవినీతి ఆరోపణల నెదుర్కొంటున్నవారికి ఎన్నికలలో పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వకూడదు. 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి ఈ ప్రక్షాళన ప్రక్రియ అమలు కాకపోతే స్వాతంత్ర్య శతాబ్ది నాటికి దేశ రాజకీయ నాయకత్వంలో తరాల మార్పు సంభవించదు.

దశాబ్ద కాలంలో అటువంటి మార్పుకు కనీసం సూచనలు తప్పక కనిపిస్తాయి. 1967 నుంచి 1987 మధ్య కాలంలో తరం మార్పుకు మొదటి మంచి అవకాశం తప్పిపోయింది. ప్రస్తావిత రెండు దశాబ్దాల కాలంలో కనీసం మూడుసార్లు తరం మారనున్నదనే సూచనలు మెరిశాయి. యువజనులు ముఖ్యంగా విద్యార్థినీ విద్యార్థులు మున్నెన్నడూ లేని విధంగా దేశ వ్యవహారాలలో తమ ఉనికిని బలంగా చాటారు. 1967లోనే 29 ఏళ్ల యువకుడు ఒకరు ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. ఎటువంటి రాజకీయ కుటుంబ నేపథ్యం లేకపోగా మైనారిటీ మత వర్గానికి చెందిన ఆ యువకుడు మొత్తం మూడుసార్లు ముఖ్యమంత్రి అయ్యారు. పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి ఎమ్.ఓ.హెచ్. ఫరూఖ్ (1937–2012) గురించి నేను ప్రస్తావిస్తున్నాను. 1970వ దశకం తొలినాళ్లలో గుజరాత్ విద్యార్థులు ప్రభుత్వ వ్యవస్థలో అవినీతి వల్ల తమకు జరుగుతున్న అన్యాయాలపై తిరుగుబాటు చేశారు. నవ నిర్మాణ్ సమితిగా సంఘటితమయ్యారు. ఆ విద్యార్థి ఉద్యమం బిహార్‌కు వ్యాపించింది. ఆ రాష్ట్రంలో అది లోక్ నాయక్ జయప్రకాశ్ నారాయణ్ సంపూర్ణ విప్లవం ఉద్యమానికి భూమిక అయింది. ఈ ఉద్యమం నుంచి ప్రభవించిన పలువురు యువ నేతలు ఆ తరువాత దేశ ప్రధాన స్రవంతి రాజకీయాలలో అంతర్భాగమయ్యారు. 1977లో జాతీయ స్థాయిలో నాయకత్వం మార్పుకు అవకాశం వచ్చినప్పుడు ఆ యువ నాయకులలో ఏ ఒక్కరికీ అధికార అందలాలు దక్కలేదు. ఎనిమిది దశాబ్దాలకు పైగా వయసున్న ఒక వృద్ధనేత ప్రధానమంత్రి అయ్యారు. అయితే పట్టుమని రెండున్నర సంవత్సరాలు కూడా ఆయన ఆ పదవిలో కొనసాగలేకపోయారు. 1985లో ఈశాన్య భారతదేశంలో ఒక విద్యార్థి నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారు. అదృష్టవశాత్తునో లేదా యాదృచ్ఛికంగానో ఆయనకు ఆ పదవి లభించలేదు. ఒక చరిత్రాత్మక విద్యార్థి ఉద్యమం కారణంగానే ఆ యువ నేతకు ఆ ఉన్నతి లభించింది. ఇదే కాలంలో, ఆ తరువాత ఎంతో మంది యువ నేతలకు స్ఫూర్తిగా వెలుగొందిన ఒక యువ నాయకురాలు దేశంలో ప్రప్రథమంగా అత్యంత చిన్న వయసులో రాష్ట్ర కేబినెట్ మంత్రి అయ్యారు. 25 సంవత్సరాల వయసులోనే మంత్రి అయిన సుష్మాస్వరాజ్ గురించి నేను ప్రస్తావిస్తున్నాను. అప్పట్లో ఆమె పార్టీకి లోక్‌సభలో కేవలం ఇద్దరు సభ్యులు మాత్రమే ఉండేవారు. యువతరాన్ని తమ పార్టీ వైపు ఆకర్షించడంలో ఆ యువ నాయకురాలు విశేషంగా కృషి చేశారు. ఈ సందర్భాలు అన్నీ దేశ నాయకత్వంలో తరం మార్పుకు దోహదం చేసి ఉండాల్సింది. కానీ అలా జరగలేదు. దేశానికి అవసరమైన తరం మార్పుకు మంచి అవకాశాలు వ్యర్థమైపోయాయి. 1992–2004 సంవత్సరాల మధ్య కాలంలో కూడా తరాల మార్పుకు మరో అవకాశం తప్పిపోయింది. కేంద్రంలో అనిశ్చితి నెలకొని వున్న కాలమది. ఆ కాలంలో దీక్షాదక్షతలు ఉన్న ఒక యువ



ముఖ్యమంత్రి రెండుసార్లు ప్రధానమంత్రి పదవికి యోగ్యులైన నేతలను ఎంపిక చేయడంలో కీలక పాత్ర వహించారు. అయితే ఆ యువ ముఖ్యమంత్రి జాతీయ స్థాయిలో కీలక స్థానానికి రాలేకపోయారు. అలా జరిగి ఉన్నట్టయితే తరాల మార్పుకు అది ఆరంభమయి ఉండేది. తరాల మార్పునకు దోహదం చేయగల శక్తి సామర్థ్యాలు ఉన్న ఒక వ్యక్తి ఇప్పుడు దేశ పాలనకు సారథ్యం వహిస్తున్నారు. మార్పు కోసం ప్రజలు, స్థానిక సమాజాల నుంచి ఉద్యమం అనేది ఏదీ లేకుండా తరం మార్పుకు ఆస్కారమున్న అరుదైన అవకాశం ఇది. ఆ శక్తిమంతమైన వ్యక్తి సంకల్పాలు, నిర్ణయాలు ఎటువంటి మౌలిక మార్పులకు దారితీస్తాయో పార్లమెంటుకు కొత్త భవన నిర్మాణం, దేశ రాజధాని రూపురేఖల నవీకరణే తిరుగులేని నిదర్శనాలు.

దేశ నాయకత్వం తరం మార్పులో ఉందని ఎప్పుడు చెప్పగలుగుతాము? ఈ పరివర్తన ప్రక్రియకు నాలుగు అంశాలు దోహదం చేస్తాయి. అత్యున్నత పదవులలో ఉన్న వారి వయసు, విద్యార్హతలు దేశ పాలనా ప్రాథమ్యాలు, అభివృద్ధి అజెండాను నిర్ణయించడంలో కీలక పాత్ర వహిస్తాయి. అలాగే వారి కుటుంబ నేపథ్యం, జట్టు స్ఫూర్తి అనేవి కూడా తరం మార్పు ప్రక్రియను విశేషంగా ప్రభావితం చేస్తాయి. కొత్తతరం ప్రజాప్రతినిధులు, నాయకులు ఉమ్మడి చైతన్యంతో కలిసికట్టుగా దేశ సమస్యల పరిష్కారానికి కృషి చేయవలసి ఉన్నది.

ఓటుహక్కుకు అర్హత పొందే వయసును 21 నుంచి 18 సంవత్సరాలకు తగ్గించినప్పుడు చట్టసభలలో యువజనులకు మరింత ప్రాతినిధ్యం తప్పక పెరుగుతుందని అందరూ భావించారు. అయితే మూడు దశాబ్దాలు గడిచిపోయి, ఆరు సార్వత్రిక ఎన్నికల అనంతరం కూడా ఆ మెరుగుదల పెద్దగా కనిపించడం లేదు. ప్రజాప్రతినిధుల, మంత్రుల విద్యార్హతల స్థాయి కూడా అసంతృప్తికి తావిచ్చేవిగానే ఉన్నాయి. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల కేబినెట్ మంత్రులలో 15 నుంచి 48 శాతం వారి విద్యార్హతలు ఉన్నత పాఠశాల స్థాయికి మించి లేవు. 'జెన్ జెడ్' ఉద్యమం కారణంగా నేపాల్ గత నెలలో ఓటుహక్కు వయసును 18 నుంచి 16 సంవత్సరాలకు తగ్గించింది.

ప్రజాప్రతినిధులు, మంత్రులలో చాలా మంది ఆస్తిపరులు, రాజకీయ కుటుంబ నేపథ్యాల నుంచి వచ్చినవారే కావడం గమనార్హం. డబ్బు, పలుకుబడితోనే వారు పదవులు పొందగలుగుతున్నారు. మూడు దశాబ్దాల క్రితం పంచాయతీరాజ్ వ్యవస్థల్లో మహిళలకు తప్పనిసరిగా మరింత ప్రాతినిధ్యం కల్పిస్తూ రాజ్యాంగ సవరణ జరిగింది. అయినప్పటికీ చట్టసభలలో మహిళా ప్రాతినిధ్యం ఏమంతగా పెరగనే లేదు. 75 సంవత్సరాల వయసు పైబడినా ప్రజా జీవితం నుంచి స్వచ్ఛందంగా వైదొలుగుతున్న నాయకులు సైతం చాలా అరుదుగా మాత్రమే ఉన్నారు. ఈ సందర్భంగా నానాజీ దేశ్‌ముఖ్‌ను ప్రత్యేకంగా ప్రస్తావించాలి. మూడు దశాబ్దాల క్రితం ఆయన అన్ని పదవులనూ త్యజించి రాజకీయ జీవితం నుంచి సన్యాసాశ్రమంలోకి వెళ్లారు. సాంఘిక సేవా కార్యక్రమాలకే పూర్తిగా అంకితమయ్యారు.

చట్టసభలలో 'ప్రాతినిధ్య స్వభావాన్ని' మెరుగుపరిచేందుకు తక్షణమే తగు చర్యలు చేపట్టవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. తరం మార్పును సాధించే విధంగా ఆ చర్యలు ఉండి తీరాలి. తొలుత శాసనసభలు, పార్లమెంటులో యువజనుల, మహిళల ప్రాతినిధ్యాన్ని మరింతగా పెంపొందించేందుకు సంకల్పించాలి. అవినీతి ఆరోపణల నెదుర్కొంటున్నవారికి ఎన్నికలలో పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వబోమని అన్ని రాజకీయ పార్టీల నాయకులు బహిరంగంగా ప్రకటించి ఆ మాటకు నిబద్ధమై ఉండాలి. మన చట్టసభలలో క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నవారు వందల సంఖ్యలో ఉన్నారన్నది పచ్చి నిజం. కోర్టు కేసుల నెదుర్కొంటున్నవారు ఎన్నికలలో మరోసారి పోటీ చేయకుండా ఆంక్షలు విధించాలి. 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి ఈ ప్రక్షాళన ప్రక్రియ పూర్తిస్థాయిలో అమలు కావాలి. అలా జరగని పక్షంలో స్వాతంత్ర్య శతాబ్ది (2047) నాటికి దేశ రాజకీయ నాయకత్వంలో తరం మార్పు సంభవించడం జరగదు. అది ఎప్పటికీ సాకారమవ్వని స్వప్నంగానే మిగిలిపోతుంది.

■ నాగులాపల్లి భాస్కరరావు
సీఎంఎస్ అధినేత, సామాజిక విధాన పరిశోధకుడు

సర్వనామం



స్థలం మారొచ్చు, కాలం మారొచ్చు
ఆఖరికి మనమంతా మలిగిపోనూ వచ్చు
కానీ, కన్నీటి గమ్యమెప్పుడూ పిడికిలే
ఎందుకంటే
మీరెప్పుడూ సర్వనామమే

ముక్కలేనిదే ముద్ద దిగనివాడూ,
బొజ్జనింపుకుని బ్రేవ్‌మని త్రేన్చేవాడూ
నవ్వు గురించి నాలుగు విధాలా వాపోతాడు

బ్రాండెడ్ బట్టల్లేకపోతే బయటకిరానివాడూ
కారు లేకుండా కాలు కదపనివాడూ
విరామంలోనో, విరాళాలతోనో
విదేశీ పర్యటనలు చేసేవాడూ
ఏసీల్లో పడుకుని వెచ్చని కలలుకనే
ఎర్రవన్నె మేధావులు
గతితర్కం గమకాలు ఆలపిస్తారు

వాళ్లందంతా ఫస్ట్రేషనని తెలియదూ?
ప్రజాకోర్టులో కాసింత ఆత్మసాక్షిని ప్రసాదిద్దాం.

మీరు భౌతికమైనా, మీరిచ్చిన స్ఫూర్తి అభౌతికం
అది అలీనంకాని అడవులకు
కొత్త వసంతాలను స్వాగతిస్తూనే వుంటుంది
మనుగడ వున్నంతవరకూ
మనుషులు ఎదురుపడుతూనే వుంటారు
ఒకరికొకరు సర్వనామాలై.
భూమి గుండ్రంగా వున్నప్పుడు
చరిత్ర బల్లపరుపుగా ఎలా వుంటుంది?

– దేశరాజు



అయిపోయింది

అయిపోయింది మిత్రమా
అడవిని కడిగి
కళ్ళాపు జల్లేశారు...
రండి రండి
ముగ్గేసి పెగ్గేసుకుందాం...
ఎన్ని యుద్ధాలు
ఎన్ని త్యాగాలు
ఎన్ని ఆశలు, ఎన్ని ఆశయాలు
ఎన్ని వ్యూహాలు, ఎన్ని ఆత్మార్పణలు
ఎంత యువత
ఎన్ని వెలిగి మలిగిన దీపాలు...
చిందు వేయటానికి
చీకటి బాగుందనుకునే వారికి
వెన్నెల ఎందుకు? వేకువ ఎందుకు?
చివరికి ఆయుధానికి
అడవి సాగిలపడింది
వెక్కిరిస్తున్న కాగితపు ముల్లెల ముందు
పట్టపగలు
ఆలోచన ఆత్మహత్య చేసుకుంది

– శైలకుమార్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

ఆధునిక ముసుగుల్లో కులం!



■ యోగేంద్ర యాదవ్

> సీజేఐ గవాయ్ రాజ్యాంగ వ్యవస్థలో అత్యున్నత స్థానాన్ని ఆక్రమించినా, సామాజిక వ్యవస్థలో ఆయన స్థానం మారలేదని బూటు దాడి ఘటన గుర్తుచేస్తోంది. పూరన్ కుమార్ చివరి లేఖ అతని ఒంటరితనం, అణచివేతల సత్యాన్ని చెబుతోంది. కేవలం ధిక్కారం, భిన్నస్వరం అయినందువల్లనే అతడు ఈ ఒంటరితనం ఎదుర్కొన్నాడా లేక అందులో సామాజిక వెలి కూడా ఉందా? 'కులరహిత అధికారస్వామ్యం ఒక మిథ్య' అని పూరన్ ఆత్మహత్య సంఘటన మరోమారు నిరూపిస్తోంది.



ఇటీవలి మూడు సంఘటనలు నాకు పాతికేళ్ళ క్రితం విన్న 'గుడ్‌చనా' (పల్లీబెల్లం) కథనాన్ని గుర్తుచేశాయి. నాకు పరిచయం ఉన్న ఒక ఉత్సాహవంతుడైన దళిత విద్యార్థి పోటీ పరీక్షలో ఉత్తీర్ణుడై అధికారిగా చేరాడు. అతని వివాహం తర్వాత కొంతకాలానికి అతన్ని నేను కలుసుకున్నాను. అతని భార్య సాపేక్షంగా ఉన్నత కుటుంబం నుంచి వచ్చిన అమ్మాయి. 'ఎస్సీ' ట్యాగ్ వదిలేసి అధికారుల సాధారణ సమాజంలో కలిసిపోవాలని ఆమె ఆసక్తి చూపింది. అతనూ బహుశా అలాగే అనుకొని ఉండవచ్చు. నేను అతని మారిన స్వభావంపై వ్యాఖ్యానించే ముందే, అతను సిగ్గుపడుతూ "అడ్జస్ట్‌మెంట్ చేసుకున్నాను సార్" అన్నాడు. ఈ మాట పైకి సాధారణంగా కనిపించినా – ఇది సర్దుబాటు, అనుసరణ, లొంగిపోవడం వరకు దేనినైనా కవర్ చేస్తుంది.

రెండేళ్ళ తరువాత అతని ఇంటికి మళ్ళీ వెళ్ళాను. డ్రాయింగ్ రూమ్‌లో అంబేడ్కర్ చిత్రపటం చూసి ఆశ్చర్యపోయాను. నా కళ్లలోని ప్రశ్నను గమనించి, నేను అడగకముందే అతను ఆ పల్లీచెక్క కథ చెప్పాడు. వారి మొదటి బిడ్డ నడవడం మొదలుపెట్టిన రోజు అధికారుల కాలనీలోనివారితో అతనూ, అతని భార్యా తమ సంతోషాన్ని పంచుకున్నారు. వారి ఆచారం ప్రకారం ఆ తీపిపదార్థాన్ని పంచారు. సాయంత్రం నడకకు వెళ్లినప్పుడు, ఒకరిద్దరు పొరుగువారు వీరు ఇచ్చిన 'గుడ్‌చనా'ను బయట చెత్తకుప్ప మీద పడేసినట్టు గమనించారు. ఎవరూ ఏమీ అనలేదు, ఏ కుల దూషణా లేదు. అయినా, ఒక్క క్షణంలో ఈ దంపతులకు సామాజిక సత్యం తెలిసిపోయింది. వదిలించుకోవాలనుకున్నా ఆ ట్యాగ్ వారిని వదలదు. కాబట్టి, వారు దాన్ని మళ్ళీ ఆలింగనం చేసుకున్నారు. ఈ ఘటన మూడు విషయాలు స్పష్టం చేస్తున్నది. మొదటిది, కులం మన గతం మాత్రమే కాదు; అది మన ప్రస్తుత జీవిత వాస్తవికత. అంతేకాదు, భవిష్యత్తులో కూడా భాగమయ్యేది. రెండవది, ఇది గ్రామీణ లేదా 'వెనుకబడిన' ప్రాంతాలకు మాత్రమే పరిమితం కాదు; ఆధునిక సమాజంలో కులం కొత్త ముసుగులు ధరిస్తోంది. కుల ఆధారిత వివక్ష, అణచివేత అనేక పొరల్లో చుట్టబడి వస్తున్నది. మూడవది, కులం అంటి పెట్టుకొని ఉంటుంది, దాని ప్రభావాలను తొలగించడం అంత సులభం కాదు. కుల అసమానతలను ఎదుర్కోవడానికి విద్య, ఉద్యోగాలు అవసరమే కానీ, అవి మాత్రమే సరిపోవు.

ఈ మూడు పాఠాలూ ఇటీవలి మూడు ఘటనల తర్వాత నాకు మళ్లీ గుర్తొచ్చాయి. రాయ్‌బరేలీలో హరిఓమ్ వాల్మీకి హత్య, చండీగఢ్‌లో ఐపీఎస్ అధికారి వై. పూరన్ కుమార్ ఆత్మహత్య, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్. గవాయ్ మీద బూటు విసిరే ప్రయత్నం. ఈ మూడూ భిన్నమైన సంఘటనలు, ఈ ముగ్గురు వ్యక్తులూ చాలా భిన్నస్థాయిల్లో ఉన్నవారు... వారందరూ దళితులు అనేది తప్ప. అయితే, బాధితులు దళితులు అనే వాస్తవం ఒక్కటే ఈ మూడు వేర్వేరు ఘట్టాలను 'కుల ఆధారిత అణచివేత' కేటగిరీలోకి తేలేదు. హరిఓమ్‌ను దళితుడు అని కాక, దొంగగా అతడిని అనుమానించిన గుంపునకు సరిగ్గా సమాధానాలు చెప్పలేకపోయాడు కాబట్టి చంపేశారు. గవాయ్ మీద దాడి చేసినవాడు కూడా ఎదుటివారి కులాన్ని ప్రస్తావించలేదు, కానీ హిందూత్వానికి అవమానం అని అన్నాడు. అధికారవర్గం గుసగుసల ప్రకారం, ఐపీఎస్ అధికారి పూరన్‌కుమార్ అతను తన ఆత్మహత్య లేఖలో పేర్కొన్న కుల వివక్ష కంటే, వృత్తిగత, అంతర్గత పోటీకి ఎక్కువగా బలైపోయాడు. ఇదీ, ప్రధాన, ప్రాబల్య ఆలోచనాధోరణి మనల్ని నమ్మమని చెబుతున్నది.

ఈ మోసపు పొరను తొలగించాలంటే మనం ఒక కాల్పనిక ప్రశ్న వేయాలి. ఈ వ్యక్తులు దళితులు కాకపోతే వారు అదే గతిని పొందేవారా? తనను దొంగ అని అనుమానించిన గుంపు మధ్యలో హరిఓమ్ నిలబడి, నేను ఠాకూర్‌ని అని అరిచాడనుకుందాం. అవమానం, దెబ్బలనుంచి అతను తప్పించుకోలేకపోవచ్చు కానీ, ఏకంగా చంపేస్తారా? ఎవరూ రక్షించడానికి ముందుకురాని స్థితి ఉంటుందా? అతని శరీరం మరుసటి రోజు పోలీసులు వచ్చేవరకూ రోడ్డుమీద పడివుంటుందా? పోలీసులు అంత ఆలస్యంగా చర్య తీసుకుంటారా? హరిఓమ్‌కు ఈ దుర్గతి పట్టడానికి అతడు ఓ దొంగ అన్న అనుమానం కాదు, అతడు వాల్మీకి కాబట్టి.

చీఫ్ జస్టిస్ గవాయ్ సంఘటనను తీసుకోండి. జడ్జి సామాజిక నేపథ్యం ఏదైనప్పటికీ, ఒక పిచ్చివాడు ఏ కోర్టులోనైనా ఇలాంటి పనిచేయవచ్చునన్నది వాస్తవం. కానీ, మానసికస్థితి సరిగా ఉన్న ఒక లాయర్ సీజేఐ కోర్టులో ఇలా చేస్తాడా? సీజేఐ స్థాయిని తగ్గించే ఇతరత్రా ప్రాతిపదికలేమీ లేకపోతే ఈ ఘటన జరుగుతుందా? సదరు లాయర్ చెబుతున్న 'సనాతనానికి అవమానం' కేవలం మత సంప్రదాయానికి మాత్రమేనా, లేదా కుల హిందూ ఆధిపత్యం ఉపసందేశం కూడా అందులో ఉందా? మరోవిధంగా చెప్పుకోవాలంటే, సదరు న్యాయవాది ఎదుటివ్యక్తి మాటలకు మాత్రమే ప్రతిస్పందించాడా, లేదా ఎవరు అన్న దానిని బట్టి కూడా ప్రతిస్పందించాడా? ఈ 'కులవాద ద్వేషం ఉపరితల ప్రదర్శన' మన కాలంలో సాధారణమైపోయింది.

ఈ సంఘటన డి.వై. చంద్రచూడ్ కోర్టులో జరిగి, దాడి చేసినవాడు ముస్లిం అయితే మొత్తం దేశం ఇప్పటిలాగానే నిశ్శబ్దంగా ఉంటుందా? హోమ్, జాతీయ భద్రతా వ్యవస్థలు ఇలాగే ప్రతిస్పందిస్తాయా? టీవీ చానెల్స్ రోజుల తరబడి దానిపై విందు చేసుకోవూ? దాడి చేసినవాడు వరుస ఇంటర్వ్యూలతో సులువుగా తప్పించుకోగలడా? సోషల్ మీడియాలో అతన్ని సపోర్ట్ చేసే క్యాంపెయిన్లు ఊహించగలమా, ఈ ఘటనలో జరిగినట్టుగా..?. గవాయ్ రాజ్యాంగ వ్యవస్థలో అత్యున్నతస్థానాన్ని ఆక్రమించినా, సామాజిక వ్యవస్థలో ఆయన స్థానం మారలేదని ఈ ఘటన గుర్తుచేస్తోంది. పూరన్ కుమార్ దళితుడు కాకపోతే ఏమవుతుంది? అధికారుల మధ్య పోటీ, తమకు గిట్టని గొంతుకల అణచివేత ఆ వ్యవస్థలో అరుదైనదేమీ కాదు. కానీ కుమార్ చివరి లేఖ అతని ఒంటరితనం, పై అధికారుల వరుస అణచివేతల సత్యాన్ని చెబుతోంది. కేవలం ధిక్కారం, భిన్నస్వరం అయినందువల్లనే అతడు ఈ ఒంటరితనం ఎదుర్కొన్నాడా లేక అందులో సామాజిక వెలి కూడా ఉందా? తన సామాజికవర్గానికే చెందిన అధికారుల నెట్‌వర్క్ చుట్టూ ఉండివుంటే అతను ఇదే పరిస్థితి ఎదుర్కొనేవాడా? ఈ ఘటనపై విస్తృత ఆందోళన, మీడియా కవరేజ్ జరిగింది. ఐఎఎస్, ఐపీఎస్ అసోసియేషన్ల నుంచి కాస్తంత ఆలస్యంగానే అయినా మద్దతు కూడా ఉంది. కానీ, ఈ ఘటనలో కులం కోణంపై అంగీకారం, చర్చ లేవు. 'కులరహిత అధికారస్వామ్యం ఒక మిథ్య' అని ఈ సంఘటన మరోమారు నిరూపిస్తోంది. నేను చెప్పిన 'పల్లీ బెల్లం' ఘటన సదరు యువ అధికారి ఇంట్లో బాబాసాహెబ్ చిత్రపటం పునఃస్థాపనకు దారితీసింది. మరి, ఈ మూడు ఘటనలు కులనిర్మూలన కోసం బాబాసాహెబ్ సంకల్పాన్ని తిరిగి అందుకొనేలా చేస్తాయా?

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)



క్రీడా సంరంభం

సందడిగా మొదలైన అండర్ - 23 జాతీయ అథ్లెటిక్స్ పోటీలు

- జేఎన్ స్టేడియంలో హోరాహోరీగా తలపడుతున్న అథ్లెట్లు
- ఆకట్టుకున్న తొలి రోజు ఈవెంట్లు
- పోటీల్లో 900 మందికిపైగా క్రీడాకారులు
- మొత్తం 21 ఈవెంట్లలో పోటీలు
- అబ్బురపరుస్తున్న క్రీడాకారుల ప్రతిభ
- స్టేడియంలోనే 20 కి.మీ. రేస్‌వాక్

7



వంద మీటర్ల పరుగు పందెంలో అథ్లెట్స్



పోల్‌వాల్ట్‌లో పాల్గొన్న అథ్లెట్



లాంగ్ జంప్‌లో పాల్గొన్న అథ్లెట్

నగరంలో క్రీడా సందడి మొదలైంది. జాతీయ స్థాయి ఓపెన్ అండర్-23 అథ్లెటిక్స్ పోటీలు గురువారం హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి 937 మంది జాతీయ, అంతర్జాతీయ స్థాయి అథ్లెట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు తెలంగాణ రాష్ట్రం నుంచి 17 మంది అథ్లెట్లు పాలుపంచుకుంటున్నారు. మొత్తం 21 ఈవెంట్లలో మూడు రోజుల పాటు పోటీలను నిర్వహిస్తున్నారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. జీడబ్ల్యూఎంసీ మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ స్నేహ శబరీష్ పాల్గొన్నారు. జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలు హనమకొండలో జరగడం ఇది రెండో సారి. జేఎన్ స్టేడియంలో రూ.8కోట్లతో సింథటిక్ ట్రాక్ నిర్మాణం జరిగిన తర్వాత మొదటి సారిగా ఈ పోటీలు జరుగుతున్నాయి. పోటీల నిర్వహణకు సకల ఏర్పాట్లు చేశారు. తొలి రోజు 10 వేల మీటర్ల పరుగులో లతిక తల్వార్ (రాజస్థాన్) స్వర్ణం, ఆర్తి పావురా (మహారాష్ట్ర) రజతం, ముస్రా గౌరీ (మధ్యప్రదేశ్) కాంస్యం సాధించారు. పురుషుల్లో రిజ్వాన్ (ఇండియన్ యూనివర్సిటీ) స్వర్ణం, సచిన్ యాదవ్ (ఉత్తర్ ప్రదేశ్) రజతం, శివాజీ కసూర (కర్నాటక) కాంస్యం సాధించారు.

- ఆంధ్రజ్యోతి, హనుమకొండ/వరంగల్ స్పోర్ట్స్



10 వేల మీటర్ల పరుగుపందెంలో విజేతలుగా నిలిచిన అథ్లెట్లకు మెడల్స్ ప్రదానం చేస్తున్న ఎంపీ, కలెక్టర్, మేయర్, నిర్వాహకులు

హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహణకు కృషి

- అదే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యం
- అథ్లెటిక్స్ పోటీల ప్రారంభోత్సవంలో ఎంపీ కడియం కావ్య

7

ఎయిర్ పోర్టుకు మరో రూ.90 కోట్లు

గతంలో రూ.205 కోట్లు విడుదల

మామునూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నగర శివార్లలో నిర్మించతలపెట్టిన మామునూరు విమానాశ్రయానికి రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.90 కోట్లు మంజూరు చేసింది. ఈ క్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామునూరు ఎయిర్ పోర్టు విస్తరణ, టెర్మినల్ బిల్డింగ్, సెక్యూరిటీ ఫెన్సింగ్ వంటి కీలక పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందని తెలిపారు. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న వరంగల్ ప్రజల చిరకాల స్వప్నం మామునూరు విమానాశ్రయం త్వరలోనే పూర్తి స్థాయి కార్యకలాపాలు ప్రారంభించబోతుందని ఎంపీ కావ్య స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవతో మామునూరు ఎయిర్ పోర్టుకు మరో అడుగు ముందుకు పడిందని పేర్కొన్నారు. ఇప్పటికే రూ.205 కోట్లు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మరో రూ.90 కోట్లు విడుదల చేయడం హర్షణీయమని ఎంపీ తెలిపారు. త్వరలో వరంగల్ వాసుల కల నెరవేరబోతుందని, గొప్ప చారిత్రక ప్రాధాన్యం కలిగిన వరంగల్ నగర అభివృద్ధిలో ఇది ఒక మైలు రాయి అని చెప్పారు.



కార్యకర్తలు మెచ్చినోళ్లకే పగ్గాలు

- ఏఐసీసీ పరిశీలకుడు నవ్‌జ్యోతి పట్నాయక్
- అటు కొండా, ఇటు బస్వరాజు వేర్వేరుగా సమావేశాలు

6



రచ్చ రచ్చ..

అధికార పార్టీలో మళ్లీ 'కొండా' కలకలం

- వరుస సంఘటనలతో రాజకీయాల్లో సంచలనం
- మేడారం టెండర్లలో మంత్రి పొంగులేటితో బయటపడ్డ విభేదాలు
- వరంగల్‌కు వచ్చిన సీఎంకు స్వాగతం పలికేందుకు రాని మంత్రి
- దేవాదాయశాఖ నుంచి ఆర్అండ్‌బీకి మేడారం పనులను మళ్లించిన ప్రభుత్వం
- కొండా ప్రైవేటు ఓఎస్డీ సుమంత్ తొలగింపు.. బెదిరింపు కేసులో అరెస్టుకు యత్నం
- రాజకీయాల్లో కాకరేపిన సుస్మిత తీవ్ర వ్యాఖ్యలు
- రంగంలోకి దిగిన అధిష్ఠానం.. కొండా దంపతులతో చర్చలు

▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

రాజకీయాల్లో మంత్రి కొండా సురేఖ మళ్లీ హాట్ టాపిక్‌గా మారారు. ఫైర్‌బ్రాండ్ లీడర్లుగా పేరున్న కొండా దంపతులు.. వరుసగా వివాదాల్లో చిక్కుకుంటున్నారు. వారి ప్రైవేటు ఓఎస్డీ సుమంత్ తొలగింపు ఎపిసోడ్‌లో మంత్రి సురేఖ, ఆమె కూతురు సుస్మితాపటేల్ వ్యవహారశైలి చర్చనీయాంశంగా మారింది. సుమంత్‌ను అరెస్ట్ చేసేందుకు వచ్చిన పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో పాటు మంత్రులపై సుస్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో కలకలం రేపుతున్నాయి. అలాగే మంత్రి సురేఖ.. మేడారం టెండర్లలో మంత్రి పొంగులేటి పెత్తనం ఏమిటని ప్రశ్నించటం.. వరంగల్‌కు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు రాకపోవటం రాజకీయాల్లో కలకలం రేపింది. సురేఖ తీరుపై గుర్రుగా ఉన్న ప్రభుత్వ పెద్దలు తమదైన రీతిలో 'చర్యలు' తీసుకుంటున్నట్టు కనిపిస్తోంది. మంత్రి సురేఖ ఓఎస్డీ సుమంత్‌ను తొలగించటంతో పాటు మేడారంలో దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న రూ.101 కోట్ల పనులను ఆర్అండ్‌బీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేయడం ఒకరకమైన ఝలక్‌గానే భావిస్తున్నారు.

వివాదాల కొండా...

కాంగ్రెస్ ప్రభుత్వంలో బీసీ మహిళగా కొండా సురేఖను సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్‌లోకి తీసుకున్నారు. అయితే మొదటి నుంచి సురేఖకు అప్రాధాన్య శాఖలు ఇచ్చారని భావించారు. సీఎం రేవంత్‌రెడ్డికి సన్నిహితంగా ఉండటంతో మంత్రివర్గ విస్తరణలో కొత్తశాఖలు ఇస్తారని భావించారు. ఈ క్రమంలో పలు సందర్భాల్లో మంత్రి సురేఖ పలువురిపై చేసిన కామెంట్లు వివాదాస్పదంగా మారాయి. సినీహీరో అక్కినేని నాగార్జున కుటుంబంపై చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపాయి. ఈ మేరకు ఆమె కోర్టులో కేసును ఎదుర్కొంటున్నారు.

మరోవైపు వరంగల్ జిల్లాలో సైతం సొంత పార్టీ ఎమ్మెల్యేల నుంచి వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా సురేఖ భర్త, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి... ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్‌రెడ్డిలపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. వారిపై ఉమ్మడి వరంగల్‌కు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీతో పలువురు నేతలు అధిష్ఠానానికి ఫిర్యాదులు చేయటం వరకు వెళ్లింది. భద్రకాళి బోనం విషయంలోనూ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే (మిగతా 7లో..)

సర్కారు ఝలక్

మంత్రి కొండా సురేఖకు ప్రభుత్వం వరుసగా ఝలక్‌లు ఇచ్చింది. మంత్రి పొంగులేటితో వివాదానికి కారణమైన మేడారం పనులను దేవాదాయశాఖ నుంచి తప్పించి బుధవారం రాత్రి ఆర్అండ్‌బీ శాఖకు అప్పగించారు. ఈ మేరకు సీఎస్ రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. మేడారం గద్దెల ఆధునీకరణ, ప్రాకారం విస్తరణ, రోడ్ల నిర్మాణం కోసం దేవాదాయశాఖకు అప్పగించిన రూ.101కోట్ల పనులు నిర్వహించేందుకు దేవాదాయశాఖ వద్ద సాంకేతికత లేనందున ఆర్అండ్‌బీ అప్పగిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే మంత్రి సురేఖ ఓఎస్డీగా పని చేస్తున్న సుమంత్‌ను మంగళవారం రాత్రి అకస్మాత్తుగా ప్రభుత్వం తొలగించింది. పర్యావరణ శాఖలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా ఉన్న సుమంత్‌ను తొలగించి సురేఖకు ప్రభుత్వం ఝలక్ ఇచ్చింది. ఈ సంఘటన నుంచి తేరుకోకముందే బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని మంత్రి సురేఖ నివాసం వద్ద మఫ్టీ పోలీసులు సుమంత్‌ను అరెస్ట్ చేసేందుకు రావడం రాజకీయంగా తీవ్ర కలకలం రేగింది. సురేఖ తన కారులో సుమంత్‌ను బయటకు తీసుకెళ్లటం, సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు మరింత అగ్గిరాజేస్తున్నాయి. రెడ్డి వర్గం నేతలు తమను అణగదొక్కాలని చూస్తున్నారని సుస్మిత ఆరోపించారు.

వేగవంతంగా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులు

అధికారులకు కలెక్టర్ సత్యశారద ఆదేశం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పాత సెంట్రల్ జైలు స్థలంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. గురువారం ఆమె సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులను పరిశీలించి సంబంధిత అధికారులతో సమీక్షించారు. సివిల్, ఎలక్ట్రికల్ పనుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రతి అంతస్తులోని నిర్మాణ స్థితిగతులను తెలుసుకొని వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే వైద్య పరికరాల అమరికను, మంచినీటి సౌకర్యం, రోడ్ల నిర్మాణం తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ శాఖాధిపతులు వారి శాఖలకు కేటాయించిన స్థలాల్లో మార్పులు, ఇతర అవసరాల గురించి చర్చించారు. ప్రతి దశలో పనుల పురోగతిని తనిఖీ చేస్తూ అవసరమైన మౌలిక వసతులను సమకూర్చేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఎంజీఎం హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్, కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యారాణి, ఆర్ఎంవోలు, వివిధ విభాగాల అధిపతులు, ఆర్అండ్‌బీ ఇంజనీర్లు, ఎల్అండ్‌టీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నావదినలపై కత్తితో దాడి

- తీవ్రగాయాలతో వదిన మృతి, అన్నకు గాయాలు
- స్థల వివాదంలో ఘర్షణ
- కొండాపురంలో ఘటన

7



రేపు బీసీ బంద్

- బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్లో చేర్చే వరకు ఉద్యమిస్తాం
- బంద్ సక్సెస్‌కు అందరూ సహకరించాలి
- ఉమ్మడి జిల్లా బీసీ జేఏసీ చైర్మన్ వేణుగోపాల్



విలేకరులతో మాట్లాడుతున్న బీసీ జేఏసీ నాయకులు

బాలసముద్రం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18న నిర్వహించనున్న బీసీ బంద్‌కు వరంగల్ ఉమ్మడి జిల్లాలోని విద్యాసంస్థలు, వాణిజ్య సంస్థలు, పెట్రోల్ బంకులు, సినిమా హాల్స్, హోటళ్లు, బస్సులు, ఆటోలు ,షాపింగ్ మాల్స్ తదితర సంస్థలు స్వచ్ఛందంగా బంద్‌లో భాగస్వాములు కావాలని బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో బీసీ జేఏసీ నాయకులు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ విద్యాసంస్థలు అగ్రవర్ణాల గుప్పిట్లో ఉన్నాయని వారు బంద్‌ను విఫలం చేయాలని కుట్రపన్నుతున్నారని బంద్‌కు సహకరించకపోతే ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. ఓబీసీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ మాట్లాడుతూ.. బీసీలకు రిజర్వేషన్లు కాపాడుకోలేని ప్రభుత్వం.. అసలు కులగణన ఎందుకు చేసిందని ప్రశ్నించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ బీసీ రిజర్వేషన్లకు ప్రాధాన్యత ఇవ్వక పోవడం ఆ పార్టీ వైఖరిని తెలియజేస్తుందని అన్నారు. రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ.. రిజర్వేషన్ల కోసం చేసే పోరాటాలను రాజ్యాధికార పోరాటాలను మిళితం చేసి సరికొత్త ఉద్యమాలను నిర్మించాల్సిన అవసరం బీసీ సమాజం గుర్తించాలని అన్నారు. ఈ సమావేశంలో జడ్పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు, బీసీ జేఏసీ నాయకులు దొడ్డపల్లి రఘుపతి, దాడి మల్లయ్య యాదవ్, బొనగాని యాదగిరిగౌడ్, వైద్యం రాజగోపాల్, తమ్మెల శోభారాణి, గడ్డం భాస్కర్, సంగాని మల్లేశ్వర్, ఆకారపుమోహన్, వల్లెపు సమ్మయ్య, బచ్చు ఆనందం, ఆడెపు రవీందర్, చిర్ర రాజుగౌడ్, తాళ్లపెల్లి సురేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మేడారంలో ముమ్మరంగా అభివృద్ధి పనులు



దేవస్థానం ప్రాంగణంలో జరుగుతున్న పనులు

తాడ్వాయి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో మాస్టర్ ప్లాన్‌లో భాగంగా అభివృద్ధి పనులు ముమ్మరం అయ్యాయి. గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెల స్థలాల మార్పు పనులు గురువారం ప్రారంభమయ్యాయి. బేస్‌మెంట్ నిర్మాణ పనులు మొదలయ్యాయి. అదేవిధంగా దేవస్థానం పరిసరాల్లో ప్రాకారం, విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. 90 రోజుల్లో పనులు పూర్తి చేయాలని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో ఊపందుకున్నాయి.

నూతన ఓటర్లకు గుర్తింపు కార్డులు
తపాల శాఖ ద్వారా అందించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి సుదర్శన్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నూతన ఓటర్లకు గుర్తింపు కార్డులను తపాలా శాఖ ద్వారా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, సహాయ ఎన్నికల అధికారులు, తహసీల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఓటర్లుగా నమోదు అయిన ప్రతి ఒక్కరికి తపాలా శాఖ ద్వారా ఓటరు గుర్తింపు కార్డులను పంపిణీ చేయాలని తెలిపారు. ఓటరు జాబితాలో 100 సంవత్సరాల వయస్సు కలిగిన ఓటర్లను గుర్తించి వారి వయస్సును తగిన ఆధారాలతో సమర్పించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలని, ఫారం 6, 7, 8 దరఖాస్తులను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ సత్యశారద, డీఆర్‌వో విజయలక్ష్మి, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కాలేజీలో ఎంబీఏ, ఎంసీఏ స్పాట్ కౌన్సెలింగ్



మైక్రోసాఫ్ట్ సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతి

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో 17 నుంచి 21 వరకు ఎంబీఏ, ఎంసీఏ స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐసెట్ అర్హత సాధించిన, సాధించని విద్యార్థులు నిర్ణీత తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కళాశాలలో నిర్వహించే స్పాట్‌కు హాజరు కావాలని ఆమె కోరారు.

ఆర్ట్స్ కాలేజీ విద్యార్థులకు మైక్రోసాఫ్ట్ సర్టిఫికెట్లు

మైక్రోసాఫ్ట్ ఈఏపై నిర్వహించిన నాలుగు మాడ్యూల్స్‌లో ట్రైనింగ్ పొందిన 17 మంది విద్యార్థులకు మైక్రోసాఫ్ట్ ఏఐ సర్టిఫికెట్లు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులను ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.

వికసిత్ భారత్ యూత్
పార్లమెంట్ పోస్టర్ ఆవిష్కరణ

కేయూ క్యాంపస్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2026 భారత్ పోర్టల్ పోస్టర్‌ను గురువారం కేయూపరిపాలన భవనంలో వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఆవిష్కరించారు. వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2026 హనుకొండ జిల్లా నిర్వహణకు కేయూ కోఎడ్ ఇంజనీరింగ్ కళాశాలను ఎంపికచేశారు. వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్‌లో పాల్గొనే ఆసక్తి కల్గిన విద్యార్థులు భారత్ పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. దీనికి సంబంధించిన ఎంఓయూ పత్రాలను వీసీ, రిజిస్ట్రార్‌లతోపాటు నెహ్రూ యువకేంద్రం అధికారులు అన్వేశ్, ప్రిన్సిపాల్ రమణలు సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయ అధికారి ప్రొఫెసర్ ఈసం నారాయణ, పీవోలు డి. శైలజ, ఎం.సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు మెచ్చినోళ్లే డీసీసీ అధ్యక్షులు

- ఏఐసీసీ పరిశీలకుడు నవ్‌జ్యోతి పట్నాయక్ ● వరంగల్‌లో కొండా ఆధ్వర్యంలో తూర్పు కాంగ్రెస్ సమావేశం
- హనుమకొండలో సారయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణుల సమావేశం ● నగరంలో అబ్జర్వర్లు ఉండగానే వేరు కుంపట్లు

వరంగల్ సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలు మెచ్చినోళ్లే జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ) అధ్యక్షులుగా ఎన్నికవుతారని ఏఐసీసీ పరిశీలకుడు నవ్‌జ్యోతి పట్నాయక్ అన్నారు. గురువారం వరంగల్ బస్ స్టేషన్ సమీపంలోని ఎంకె నాయుడు కన్వెన్షన్‌లో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు ఆధ్వర్యంలో వరంగల్ తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏఐసీసీ పరిశీలకులు నవ్‌జ్యోతి పట్నాయక్, అబ్జర్వర్లు మక్సూద్, అనిల్, భాస్కర్, రేణుక హాజరయ్యారు.

ఈ సందర్భంగా కొండా మురళీధర్‌రావు కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ.. పార్టీని బలోపేతం చేయడానికి కింది స్థాయి నాయకత్వాన్ని ప్రోత్సహించేందుకు ఏఐసీసీ, రాహుల్‌గాంధీ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఏఐసీసీకి పట్నాయక్ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా డీసీసీ అధ్యక్షుడి నియామకం జరుగుతుందన్నారు. మంత్రి కొండా సురేఖ ఈ కార్యక్రమానికి రావాల్సి ఉన్నప్పటికీ హైదరాబాద్‌లో సమావేశం ఉన్నందున రాలేకపోయారని వివరించారు.

ఏఐసీసీ పరిశీలకుడు నవ్‌జ్యోతి పట్నాయక్ మాట్లాడుతూ.. సంఘటన్ శ్రీజన్ అభియాన్ అనే ప్రత్యేక కార్యక్రమానికి రాహుల్‌గాంధీ శ్రీకారం చుట్టారని అన్నారు. కింది స్థాయి కార్యకర్తలు, నాయకులు మెచ్చినోళ్లే డీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికవుతారని, అందుకోసమే అందరి అభిప్రాయాలను తీసుకుని రిపోర్టు రాసి ఏఐసీసీకి అందజేయడం తన బాధ్యత ఆయన అన్నారు.

అనంతరం నియోజకవర్గంలోని 24 డివిజన్లకు సంబంధించిన కార్యకర్తలు, ముఖ్య నాయకులు పట్నాయక్‌ను కలిసి డీసీసీ అధ్యక్షుడు ఎవరు కావాలో ఆయనకు చెప్పుకున్నారు. ఇందులో నవీన్‌రాజ్, మీసాల ప్రకాష్, ఆయూబ్, పోశాల పద్మ తదితరుల పేర్లు ఎక్కువగా ప్రస్తావించినట్లు తెలిసింది. ఈ సమావేశంలో కార్పొరేటర్లు, వివిధ చైర్మన్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హనుమకొండ డీసీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న నవ్‌జ్యోతి పట్నాయక్

ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఆధ్వర్యంలో..

కార్పొరేటర్ గుండేటి నరేందర్ అధ్యక్షతన ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఆధ్వర్యంలో గురువారం హనుమకొండలోని డీసీసీ భవన్‌లో కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఏఐసీసీ పరిశీలకుడు నవ్‌జ్యోతి పట్నాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, అబ్జర్వర్లు మక్సూద్, అనిల్, భాస్కర్, రేణుక, డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుల నియామకానికి అందరి అభిప్రాయాలను తీసుకున్నారు. అందరు ఎర్రబెల్లి స్వర్ణ డీసీసీ అధ్యక్షురాలు కావాలని కోరారు. సమావేశంలో కార్పొరేటర్లు, అనుబంధ సంఘాల నాయకులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వరంగల్‌లో జరిగిన కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు నవ్‌జ్యోతి పట్నాయక్

తూర్పు కాంగ్రెస్‌లో వేరు కుంపట్లు

వరంగల్ తూర్పు నియోజకవర్గంలో గురువారం కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం ఎంకె నాయుడు కన్వెన్షన్‌లో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు ఆధ్వర్యంలో జరిగింది. దీనికి ఏఐసీసీ పరిశీలకుడు నవ్‌జ్యోతి పట్నాయక్, ఇతర అబ్జర్వర్లు హాజరయ్యారు. మరోపక్క హనుమకొండలో వరంగల్ జిల్లా డీసీసీ భవన్‌లో కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ అధ్యక్షతన ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఆధ్వర్యంలో వరంగల్ తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణుల సమావేశం నిర్వహించారు. ఏఐసీసీ పరిశీలకుడు నవ్‌జ్యోతి పట్నాయక్, ఇతర అబ్జర్వర్లు హాజరయ్యారు. కాగా, ఒకపక్క పరిశీలకుడు నగరంలో ఉండగానే వేరు కుంపట్లు పెట్టి కార్యకర్తలను, నాయకులను పరేషాన్ చేయడంపై నాయకులు ఆందోళన చెందుతున్నారు.

సింథటిక్ ట్రాక్‌లో అందరినీ అనుమతించండి

డీఎస్‌ఏకు కలెక్టర్ స్నేహశబరీష్ ఆదేశం

హనుమకొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలోని సింథటిక్ ట్రాక్‌లోకి వాకర్స్‌కు కూడా అనుమతివ్వాల్సిందిగా కలెక్టర్ స్నేహ శబరీష్ జిల్లా క్రీడాప్రాధికారిక సంస్థ అధికారి (డీఎస్ఏ) గుగులోతు అశోక్‌ను ఆదేశించారు. ఐదో జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొన్న అనంతరం కలెక్టర్ తిరిగి వెళుతుండగా స్టేడియం ప్రధాన గేట్ వద్ద 'ఔటర్స్ నాట్ అలోడ్' అని రాసి ఉన్న బోర్డును చూసి ఆగిపోయారు. డీఎస్ఏను ఇదేమిటి? అంటూ ప్రశ్నించారు. సింథటిక్ ట్రాక్‌ను ఏర్పాటు చేసింది ప్రజాధనంతోనే కదా.. అలాంటప్పుడు అందరికీ అందుబాటులో ఉంచకుండా కొందరికి మాత్రమే ఎందుకు పరిమితం చేయడం. అందరూ వినియోగించుకునేలా చూడాలి గానీ ఇలా ఆంక్షలు ఎందుకు అని ప్రశ్నించారు. సింథటిక్ ట్రాక్‌పై ప్రతీ రోజు ప్రాక్టీస్ చేసే అథ్లెటిక్స్‌కు అడ్డంకిగా ఉంటుందని, ఇతరులను అనుమతించడం లేదన్నారు. అందరికీ అవకాశం ఇవ్వండి అంటూ ఆదేశించారు.

అథ్లెటిక్స్ కోసమే..

వాస్తవానికి సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేసింది ప్రధానంగా అథ్లెటిక్స్ ప్రతీరోజు ప్రాక్టీస్ చేయడం కోసమే. అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన ఈ ట్రాక్‌పై ప్రాక్టీస్ చేయడం వల్ల రేస్‌లో టైమింగ్స్ మెరుగుపడుతుంది. జాతీయ, అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో మిగతా క్రీడాకారులతో సమానంగా పోటీపడే సామర్థ్యం పెరుగుతుంది. ఇందులోకి ఇతరులను కూడా అనుమతించడం వల్ల ట్రాక్‌పై రద్దీ పెరుగుతుంది. అథ్లెటిక్స్ ఏకాగ్రతతో ప్రాక్టీస్ చేయడం కుదరదు. ప్రతీరోజు ఈ ట్రాక్‌పై 150 మందికిపైగా స్పోర్ట్స్ హాస్టల్ పిల్లలతో పాటు వంద మందికిపైగా ఔత్సాహిక అథ్లెట్లు ప్రాక్టీస్ చేస్తున్నారు. వారితోనే ట్రాక్ నిండిపోతోంది. ఇక ఇతరులకు కూడా అనుమతిచ్చినట్లయితే ట్రాక్‌పై మరింత ఒత్తడి పెరుగుతుంది. రద్దీ ఏర్పడుతుంది. అథ్లెట్స్ ఏకాగ్రతతో ప్రాక్టీసు చేసుకునే వీలుండదు. రద్దీవల్ల ట్రాక్‌పై పరు గెత్తుతున్నప్పుడు ఒకరికొకరు ఢీకొనే అవకాశం ఉంది. పైగా అథ్లెట్స్ ప్రాక్టీస్ సందర్భంగా స్పైక్స్ (మొలలు) ఉన్న ప్రత్యేక షూస్ వాడతారు. అవితగిలితే గాయాలయ్యే జరిగే అవకాశం ఉంది. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని సింథటిక్ ట్రాక్‌లోకి ఇతరులను అనుమతించడం లేదు అని తెలుస్తోంది.

20న దత్తక్షేత్రంలో దీపావళి వేడుకలు

వరంగల్ కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతున్న ములుగురోడ్‌లోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో ఈ నెల 20న దీపావళి వేడుకలు నిర్వహిస్తున్నట్లు దత్త జ్ఞానబోధ సభ ట్రస్టు సభ్యులు వైవీ వామన్‌రావు తెలిపారు. 20న అమావాస్య సందర్భంగా దత్తక్షేత్రంలోని శ్రీఅనఘా మహాలక్ష్మి అమ్మవారికి ఉదయం విశేష అభిషేకం, సాయంత్రం విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు కొనసాగుతాయని తెలిపారు. దీపావళి పర్వదినం సందర్భంగా మహాలక్ష్మి అమ్మవారికి ధనలక్ష్మి పూజలు నిర్వహిస్తామని చెప్పారు.

కెనాల్ భూమి ఆక్రమణపై అధికారులు చర్యలు తీసుకోవాలి

హనుమకొండ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం లక్ష్మీపురం గ్రామ శివారులో ఎస్ఆర్ఎస్‌పీ కెనాల్ భూమిని అదే గ్రామానికి చెందిన లింగారెడ్డి అక్రమంగా ఆక్రమించి బాటను కబ్జా చేశారని గురువారం హనుమకొండ చింతగట్టులోని ఇరిగేషన్ శాఖ అధికారి రైతులు ఫిర్యాదు చేశారు. గ్రామ ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ప్రభుత్వ భూమిని రక్షించి రైతులకు కెనాల్ బాట అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ అధికారికి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో లక్ష్మీపురం గ్రామానికి చెందిన రైతులు వేల్పుల కొమురయ్య, అలుగునూరి వీరమల్లు, వేల్పుల రవి ఉన్నారు.

రైతులు సబ్సిడీ పరికరాలను వినియోగించుకోవాలి

హనుమకొండ వ్యవసాయ శాఖ అధికారి రవీందర్ సింగ్

హనుమకొండ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎస్ఎంఏఎం-2025 స్కీం సబ్సిడీ పరికరాలను రైతులకు అందిస్తుందని హనుమకొండ జిల్లా వ్యవసాయశాఖ అధికారి రవీందర్ సింగ్ గురువారం తెలిపారు. హనుమకొండ జిల్లాలోని కాజీపేట, హసన్‌పర్తి, ఐనవోలు, ధర్మసాగర్, వేలేరు, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్, పరకాల, నడికూడ, ఆత్మకూరు, దామెర, శాయంపేట మండలాలలోని రైతులకు వ్యవసాయ పరికరాలను కేటాయించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు. కేటాయించిన మండలాలలో మండల వ్యవసాయ అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా బ్యాటరీ, ఫుట్, మాన్యువల్లి ఆపరేటెడ్ స్ప్రేయర్స్ 1886, పవర్ నాప్సాక్ స్ప్రేయర్, పవర్ ఆపరేటెడ్ స్ప్రేయర్ 387, రోటోవేటర్ 96, సీడ్‌కం ఫర్టిలైజర్ డ్రిల్ 18, డిస్క్‌హారో , కల్టివేటర్ ఎం.బీ. ప్లవు, కేజ్‌విల్స్ అండ్ రోట్రో పడ్లర్ 131, బండ్ ఫార్మర్(నాన్ పీ.టీవో)9, పవర్ వీడర్ 17, బ్రష్ కట్టర్స్ 25, పవర్ టిల్లర్స్17, స్ట్రా బేలర్స్ 19 జిల్లాకు కేటాయించినట్లు తెలిపారు. పూర్తి వివరాలకు ఆయా మండలాలలోని వ్యవసాయ శాఖ అధికారులను కలిసి దరఖాస్తు చేసుకోవాలని రైతులను కోరారు.

నేడు ఎన్పీడీసీఎల్ ఎస్ఈల ఫోన్ఇన్

రాంనగర్, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలపై శుక్రవారం ఫోన్ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వరంగల్, హనుమకొండ ఎస్ఈలు కె.గౌతంరెడ్డి, పి.మధుసూదన్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ సర్కిల్ పరిధిలోని వినియోగదారులు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫోన్ నెంబర్ 8712484818లో సమస్యలు చెప్పి పరిష్కరించుకోవచ్చని, హనుమకొండ సర్కిల్‌లోని వినియోగదారులు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 8712484506 నెంబర్‌కు ఫోన్‌చేసి సమస్య చెప్పుకుంటే పరిష్కరిస్తామని ఎస్ఈ మధుసూదన్ తెలిపారు.

కేసు రాజీ చేసుకుంటేనే డ్యూటీ ఇస్తారట..

- ఆర్టీసీ అధికారుల తీరుపై ఓ మహిళా కండక్టర్ ఆరోపణ
- సెల్ఫీ వీడియోలో పలు ఆరోపణలు

హనుమకొండ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలోని కొందరు అధికారులపై పెట్టిన కేసును విరమించుకుంటేనే తనను విధుల్లోకి తీసుకుంటామని అధికారులు చెబుతున్నారని ఓ మహిళ కండక్టర్ గురువారం తన సెల్ఫీ వీడియోలో గోడు వెళ్లబోసుకుంది. తన తప్పులేకుండానే అకారణంగా ఆర్టీసీ అధికారులు విధుల నుంచి తొలగించారని కండక్టర్ అంజనీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, హనుమకొండ డిపోలో పని చేస్తున్న అంజనిదేవి.. గత ఫిబ్రవరి నెలలో మహాలక్ష్మి పథకంలో మహిళకు ఆధార్‌కార్డుతో టికెట్ ఇవ్వలేదని ఆర్టీసీ టీటీ అధికారులు ఆమెపై చర్యలు తీసుకున్నారు. అదే సమయంలో ఆమెపై టీటీ అధికారులు అసభ్యకరంగా ప్రవర్తించారని పోలీసులకు అంజనిదేవి ఫిర్యాదు చేశారు. కాగా, ఈ విషయంలో అంజనిదేవిని విచారణ అనంతరం ఆర్టీసీ అధికారులు తొలగించారు.

అయితే టీటీ అధికారులపై పెట్టిన కేసు కోర్టు పరిధిలో ఉంది. తొమ్మిది నెలల తర్వాత డ్యూటీ కోసం ఆర్ఎం కార్యాలయానికి గురువారం అంజనీదేవి వెళ్లినట్లు తెలిపారు. టీటీ అధికారులపై పెట్టిన కేసును వాపస్ తీసుకొని రాజీపడితే డ్యూటీ ఇస్తామని ఆర్ఎం కార్యాలయంలో ఓ అధికారి చెప్పాడని అంజనిదేవి ఆర్ఎం కార్యాలయంలోనే సెల్ఫీవీడియోలో వెల్లడించారు.

ఆర్టీసీ అధికారులు కావాలని తనకు డ్యూటీ ఇవ్వడం లేదని ఆరోపించారు. అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ విషయమై వరంగల్ ఆర్ఎం. డి.విజయభానును ఫోన్‌లో సంప్రదించగా ఆమెతో కేసు విషయంపై రాజీపడాలని చెప్పలేదని అన్నారు. ఈ విషయంలో వారికి సంబంధించిన కేసు కోర్టు పరిధిలో ఉందని, కోర్టులో తేలాక తగిన చర్యలు ఉంటాయని ఆర్ఎం తెలిపారు.

శ్రీనివాస్ పరిశోధన పత్రం రాష్ట్ర స్థాయికి ఎంపిక

ఐనవోలు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు చిదురాల శ్రీనివాస్ సమర్పించిన పరిశోధన పత్రం రాష్ట్ర స్థాయిలో ఎంపికైంది. తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయుల కోసం రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎస్సీఆర్టీ) ఆధ్వర్యంలో 'సెకండరీ స్కూల్ విద్యార్థుల చదువులపై కౌన్సెలింగ్ ప్రభావం' (ఇంపాక్ట్ ఆఫ్ కౌన్సిలింగ్ సెకండరీ స్కూల్ స్టూడెంట్స్ ఆన్ దేర్ అకాడమిక్ పర్‌ఫార్మెన్స్) అనే అంశంపై రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ అంశంపై రాష్ట్ర వ్యాప్తంగా 180 మంది పరిశోధన పత్రాలు సమర్పించగా అందులో 30 మంది ఎంపికైయ్యాయి. శ్రీనివాస్ తన గురువు రవికాంత్‌రావు మార్గదర్శకత్వంలో సమర్పించిన పరిశోధన పత్రం ఎంపికైంది. ఈనెల 15న హైదరాబాద్ గోదావరి ఆడిటోరియంలో జరిగిన జ్యూరీ సమక్షంలో తన ప్రదర్శనను విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్సీఆర్టీ డైరక్టర్ జి. రమేష్, ఓయూ సైకాలజీ విభాగ అచార్యుడు రమాదేవి, బీఈడీ కళాశాల ప్రొఫెసర్ స్వాతిలు న్యాయ నిర్దేతలుగా వ్యవహరించారు. శ్రీనివాస్ పరిశోధన ప్రతం ఎంపిక కావడం పట్ల డైరక్టర్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.



శ్రీనివాస్ ఎస్సీఆర్టీ డైరక్టర్ చేతుల మీదుగా అందజేస్తున్న పరిశోధన ప్రతం



దరఖాస్తులు స్వీకరిస్తున్న అబ్కారీ అధికారులు

వరంగల్ అర్బన్, రూరల్‌లో 823 దరఖాస్తులు

వరంగల్ క్రైం, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): నూతన వైన్‌షాపుల కోసం వరంగల్ అర్బన్ (హనుమకొండ), వరంగల్ రూరల్ (వరంగల్) జిల్లాలో 823 దరఖాస్తులు వచ్చినట్లు ఆయా జిల్లాల సూపరింటెండెంట్స్ చంద్రశేఖర్, అరుణ్‌కుమార్ తెలిపారు. వరంగల్ అర్బన్‌లో 540 దరఖాస్తులు రాగా, రూరల్‌లో 283 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.

వర్సిటీ పీజీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

కేయూ క్యాంపస్ అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ పీజీ కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామోజు నరసింహచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఐసెట్-2025 కన్వీనర్ మార్గదర్శకాలకు అనుగుణంగా 2025-26 ఏడాదికి అడ్మిషన్లు కల్పిస్తామని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కల్గిన అభ్యర్థులు అక్టోబరు 17 నుంచి 21 వరకు కళాశాలకు ఒరిజినల్ ధృవపత్రాలను తీసుకునివచ్చి అడ్మిషన్లు పొందాలని కోరారు. మిగిలిన సీట్ల వివరాలు కళాశాలలో అందుబాటులో ఉంచామని, అలాగే వెబ్‌సైట్ http://tgicet.nic.in/లోనూ ఉన్నాయని పేర్కొన్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటీ వరుణ్‌రెడ్డి

రాంనగర్, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు ఎలాంటి ఆటంకాలు ఎదురైనా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి సకాలంలో విద్యుత్‌ను సరఫరా చేస్తామని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటీ వరుణ్ రెడ్డి అన్నారు. వ్యవసాయ సర్వీసుల రిలీజ్‌ల విషయంలో 2023 నుంచి ఇప్పటి వరకు పోల్చుకుంటే 12 శాతం పెరిగిందన్నారు. వచ్చే మూడు నెలల్లో అధికంగా మంజూరు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. పోల్‌లు, లైన్ లేని ఏరియాల్లో నెలరోజుల్లో సర్వీస్ రిలీజ్ చేస్తున్నామని, ఓఆర్‌సీ చెల్లించకపోతే రెండునెలల్లో రిలీజ్ చేస్తున్నామన్నారు. ప్రతీ నెల వ్యవసాయ సర్వీసులపై కమర్షియల్ విభాగం, 16 సర్కిళ్ల అధికారులతో సమీక్ష నిర్వహిస్తామన్నారు.

స్టోర్‌లో కావాల్సిన మెటీరియల్‌ను ముందుస్తుగానే అందుబాటుల్లో ఉంచుతామని, రైతులు అనవరంగా ఆందోళన చెంది బయట కొనుగోలు చేయొద్దన్నారు. ఎటువంటి ఇబ్బందులు ఉన్నా.. 1912 నెంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల పెంచడానికి కొత్త ఎస్పీయం షెడ్‌లను ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి వంగిన పోల్స్, లూజ్ లైన్‌లను సరిచేస్తామన్నారు. ఇప్పటి వరకు 4,419 లూజ్ లైన్‌లు, 1,757 వంగిన పోల్స్ 3,140 మధ్య స్తంభాలను ఏర్పాటు చేశామన్నారు. ఓవర్‌లోడ్ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచి ఈ ఏడాది ఎన్పీడీసీఎల్‌లో 5448 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. రైతుల పట్ల నిబద్ధతతో పనిచేస్తూ అధిక ప్రాధాన్యం ఇస్తామని సీఎండీ వెల్లడించారు.

తెలుగు ప్రజల కోసం ప్రత్యేక పర్యాటక రైలు

వడ్డెపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): భారతీయ రైల్వే అనుబంధ సంస్థ ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో తెలుగు ప్రజల కోసం ప్రత్యేక పర్యాటక రైలు (భారత్ గౌరవ్ రైలు)ను అందుబాటులోకి తెచ్చినట్లు ఐఆర్‌సీటీసీ సౌత్ సెంట్రల్ జోన్ అసిస్టెంట్ మేనేజర్ వీవీ వెంకటేష్ తెలిపారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ రైలు యాత్ర ఈ నెల 26 నుంచి నవంబరు 4 వరకు ఉంటుందని పేర్కొన్నారు. యాత్రలో భాగంగా ద్వారకాదీష్ మందిరం, నాగేశ్వర జ్యోతిర్లింగ మందిరం, బేట్ ద్వారక, సోమనాథ్ జ్యోతిర్లింగ మందిరం, సబర్మతి ఆశ్రమం సందర్శన, సూర్య దేవాలయం, రాణికి వావ్, స్టాచ్యూ ఆఫ్ యూనిటీ (సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం) సందర్శించవచ్చని తెలిపారు. వివరాలకు ఫోన్ నంబర్లు: 97013 60701 / 98810 30711లలో సంప్రదించాలని కోరారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు సతీష్, నరేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మాజీ జవాన్‌కు షోకాజు నోటీసులు

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బీఈడీ కళాశాల ఎదురుగా అక్రమంగా నడుపుతున్న కొబ్బరిబోండాల షాపు యజమానికి జరిమానా వేయడానికి వెళ్లిన జీడబ్ల్యూఎంసీ జవాన్లపై విశ్రాంత జవాన్ ఎ.ధర్మరాజు దురుసుగా ప్రవర్తించి, దుర్భాషలాడిందుకు కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ షోకాజు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 13న కొబ్బరిబోండాల షాపు వద్దకు వెళ్లి వాకబు చేసిన జవాన్లు క్రాంతి, నవనీతపై ధర్మరాజు దుర్భాషలాడినట్టు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన కమిషనర్.. గురువారం షోకాజు నోటీసులు జారీ చేశారు. ఈ ఘటనపై ధర్మరాజు మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని, లేదంటే ఆయనకు వచ్చే పింఛన్‌లో 3 శాతం తగ్గించేందుకు హైదరాబాద్ ఉన్నతాధికారులకు రిపోర్టు పంపిస్తామని తెలిపారు. దీనిపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కమిషనర్ గుర్తు చేశారు.

హోరాహోరీగా జాతీయ అథ్లెటిక్స్ పోటీలు

హనుమకొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఐదో జాతీయ ఓపెన్ అండర్ - 23 అథ్లెటిక్స్ పోటీలు హనుమకొండ జేఎన్ స్టేడియంలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వరంగల్ ఎంపీ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పది వేల మీటర్ల పరుగు పందెంలో విజేతలైన ముగ్గురు క్రీడాకారిణులకు ఎంపీ కావ్య బంగారం, వెండి, కాంస్య పతకాలను ప్రదానం చేశారు. లతిక తల్వార్ (రాజస్థాన్) గోల్డ్, ఆర్తీ పావురా (మహారాష్ట్ర) సిల్వర్, ముష్రా గౌరీ (మధ్యప్రదేశ్) బ్రాంజ్ మెడల్ సాధించారు. పురుషుల్లో రిజ్వాన్ (ఇండియన్ యూనివర్సిటీ గోల్డ్, సచిన్ యాదవ్ (ఉత్తర్‌ప్రదేశ్) సిల్వర్, శివాజీ కసూర (కర్నాటక) బ్రాంజ్ మెడల్ సాధించారు. జాతీయ స్థాయి ఓపెన్ అథ్లెటిక్ పోటీలకు దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి విచ్చేసిన మహిళ, పురుష క్రీడాకారులతో జేఎన్ఎస్ స్టేడియం సందడిగా మారింది. వివిధ ఈవెంట్లలో అథ్లెట్లు పోటీ పడ్డ తీరు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నది. సింథటిక్ ట్రాక్‌పై రేస్‌వాక్‌లో అథ్లెట్లు బుల్లెట్లలా దూసుకుపోయారు.

ఉదయం నుంచే..

పోటీలు ఉదయం 6గంటల నుంచే ప్రారంభమయ్యాయి. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి 937 మంది జాతీయ, అంతర్జాతీయ స్థాయి అథ్లెట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు అకాడమీలు, నేవీ, ఆర్మీ తదితర సర్వీస్ రంగాలకు నుంచి సైతం అథ్లెట్లు పోటీ పడుతున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి 17 మంది అథ్లెట్లు పాలుపంచుకుంటున్నారు. రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు స్టాన్లీ జోన్, నేషనల్ చీఫ్ కోచ్ రాధాక్రిష్ణ, మరో 20 మంది ఇండియన్ టీమ్ కోచ్‌లు, ఒక విదేశీ కోచ్ ఈ పోటీలను పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ వరద రాజేశ్వర్ రావు, కార్యదర్శి సారంగపాణి, డీవైఎస్‌వో అశోక్ కుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ అథ్లెటిక్స్ పోటీల విజయవంతానికి 135 మంది టెక్నికల్ అఫీషియల్స్, కోచ్‌లు సహకారం అందిస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే పోటీలు ఉదయం 6 గంటల నుంచి 10.30 గంటల వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30గంటట వరకు ఒక సెషన్ చొప్పున జరుగుతాయి. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎఎఫ్ఐ) నిబంధనల ప్రకారం జరుగుతున్న ఈ పోటీలను తిలకించేందుకు స్టేడియం నలువైపులా ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు.

జేఎన్ఎస్‌లో ఘనంగా ప్రారంభం
- ఆకట్టుకున్న తొలి రోజు ఈవెంట్లు
- పోటీల్లో పాల్గొంటున్న 900 మందికి పైగా క్రీడాకారులు
- సందడిగా మారిన జేఎన్ఎస్ స్టేడియం

తొలి రోజు విజేతలు
- మెన్స్ 10వేల మీటర్ల పరుగుపందెం: రిజ్వాన్ ప్రథమ స్థానం (ఇండియన్ యూనివర్సిటీ), సచిన్‌యాదవ్ ద్వితీయ స్థానం (ఉత్తరపదేశ్), శివాజి తృతీయ స్థానం (కర్ణాటక).
- ఉమెన్స్ 10వేల మీటర్ల పరుగు పందెం: లతికా తల్వార్ ప్రథమ (రాజస్థాన్), ఆర్తీపవర ద్వితీయ(మహారాష్ట్ర), బుష్రగౌరి తృతీయ స్థానం(మధ్యప్రదేశ్) విజేతలుగా నిలిచారు.
- ఉమెన్స్ షాట్‌పుట్: సిమ్రాన్‌జిత్‌కౌర్ ప్రథమ(ఢిల్లీ), జహల్ ద్వితీయ, (ఉత్తరప్రదేశ్), పూజకుమారి తృతీయ(ఎన్‌సీఓఈ పట్యాల).
- ఉమెన్స్ డిస్కస్‌త్రో: నికితకుమారి ప్రథమ (ఎన్‌సీఓఈ పట్యాల), కిరణ్ ద్వితీయ (రాజస్థాన్), అకిలరాజు తృతీయ (కేరళ).
- మెన్స్ హ్యామర్‌త్రో: దినేష్ ఎస్.ప్రథమ (తమిళనాడు), పవన్ ద్వితీయ (రాజస్థాన్), రాబిన్‌యాదవ్ తృతీయ (ఉత్తరప్రదేశ్).
- ఉమెన్స్ హైజంప్: సీమాకుమారి ప్రథమ (ఉత్తరప్రదేశ్), సారిక్ కుమావట్ ద్వితీయ (రాజస్థాన్), రింపాల్‌కౌర్ తృతీయ (పంజాబ్).
- ఉమెన్స్ లాంగ్ జంప్: ఎం.డి. ముబాసీం ప్రథమ (అంజూబాబీ), ఎంఎస్. సించన ద్వితీయ (కర్ణాటక), వీఎం. అభిరామి తృతీయ (కేరళ).
- మెన్స్ 100మీటర్ల పరుగు పందెం: అరుత్యం జయరామ్ ప్రథమ (ఒడిశా), కుమార్ ద్వితీయ (జార్ఖండ్), రాట్ మెల్గె తృతీయ (మహారాష్ట్ర).

ఈవెంట్లు

మొత్తం 21 ఈవెంట్లలో జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తున్నారు. పోటీల తొలిరోజు అయిన గురువారం స్త్రీ, పురుషులకు 10వేల మీటర్ల పరుగు, 100, 400, 1500 మీటరు పరుగు, డిస్కస్ త్రో (2.000 కేజీ), డిస్కస్ త్రో (1000 కేజీ) 100 మీటర్ల పరుగు, షాట్‌పుట్ (4.000కేజీ) లాంగ్ జంప్, హైజంప్, హామర్‌త్రో (7.260కేజీ), పోల్ వాల్ట్, షాట్ పుట్-7.260కేజీ (సెక్టార్-1), షాట్ పుట్ (సెక్టార్-2) ఈవెంట్లలో పోటీలు జరిగాయి. 300మందికిపైగా అథ్లెట్లు పోటీ పడ్డారు. కాగా, ఈ పోటీలు హనమకొండలో జరగడం ఇది రెండోసారి. జేఎన్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ నిర్మాణం జరిగిన తర్వాత మొదటిసారిగా ఈ పోటీలు జరుగుతున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో రూ.8కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సింథటిక్ ట్రాక్ జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడా పోటీల నిర్వహణకు అనువుగా ఉండడంతో ఇక్కడ నిర్వహించడానికి జాతీయ అథ్లెటిక్స్ ఫెడరేషన్ అనుమతిచ్చింది.

బస, వసతి లేక..

పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులకు బస, వసతి కల్పించకపోవడంతో వారు కొంత ఇబ్బంది పడ్డారు. పోటీల పర్యవేక్షణకు వచ్చిన టెక్నికల్ ఆఫీషియల్స్, కోచ్‌లకు మాత్రమే నిర్వాహకులు బస, భోజన వసతి కల్పించారు. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏఎఫ్ఐ) నిబంధల ప్రకారం పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన వివిధ రాష్ట్రాలకు చెందిన అథ్లెటిక్స్‌కు మాత్రమే ఈ సౌకర్యం కల్పించలేదు. దీంతో వారంతా బయట హటళ్లు, లాడ్జీలలోనే చేస్తున్నారు. భోజనం కూడా బయటనే చేయాల్సివస్తోంది. దీనితో జేఎన్ఎస్ స్టేడియం చుట్టుపక్కల ఉన్న హోటళ్లు, లాడ్జీలు క్రీడాకారులతో నిండిపోయాయి.

జేఎన్ఎస్‌లోనే 20 కి.మీ. రేస్‌వాక్

రెండో రోజు పోటీల్లో భాగంగా శుక్రవారం స్త్రీ, పురుషులకు 20 కి.మీ. రేస్‌వాక్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ ఈవెంట్ జేఎన్ఎస్‌లోనే నిర్వహించాలని నిర్ణయించారు. అంతకుముందు ఈ లాంగ్ రేస్‌వాక్‌ను బయట నిర్వహించాలనుకున్నారు. ఇందుకు అనువైన రోడ్డు మార్గం కోసం అన్వేషించారు. అంతకు ముందు వరంగల్ నిట్‌లో నిర్వహించారు. కానీ అందులో ప్రస్తుతం రోడ్డు ఈఈవెంట్ నిర్వహణకు అనువుగా లేకపోవడతో బయట పలు ప్రాంతాలను పరిశీలించారు. భద్రకాళి బండ్, తదితర ప్రాంతాలను చూశారు. అవి కూడా అనువుగా లేకపోవడంతో చివరకు స్టేడియంలోనే నిర్వహించాలనే నిర్ణయానికి వచ్చారు. ఉదయం 6 గంటలకు ఈ ఈవెంట్ ప్రారంభమవుతుంది.

నేడు (శుక్రవారం) జరిగే ఈవెంట్లు

1500 మీటర్ల పరుగు, 119 మీటర్ల హర్డిల్స్ (1.067 మీటర్లు), ట్రిపుల్ జంప్ (13.00 మీటర్లు), డిస్కస్ త్రో (2.000 కేజీ), 100 మీటర్ల (0.83 మీటర్లు), 200 మీటర్ల రేస్, జావెలిన్ త్రో, 200 మీటర్ల పరుగు, పోల్‌వాల్ట్, హై జంప్, షార్ట్‌పుట్ (4.000 కేజీ), 400 మీటర్ల పరుగు, 800 మీటర్ల పరుగు, 1500 మీటర్ల పరుగు, 5000 మీటర్ల పరుగు, హామ్మర్ త్రో, 400 మీటర్ల హర్డిల్స్ ఈవెంట్లలో ఈ పోటీలు జరుగుతాయి.


పది వేల మీటర్ల పరుగు పందెంలో పాల్గొన్న అథ్లెట్లు


వంద మీటర్ల పరుగు పందెంలో క్రీడాకారిణులు





షాట్‌పుట్ విసురుతున్న అథ్లెట్లు




హై, లాంగ్ జంప్ చేస్తున్న అథ్లెట్లు

ఒలింపిక్స్‌లో పతకమే నా లక్ష్యం

10 వేల మీటర్ల రేస్‌వాక్ స్వర్ణ విజేత లతిక్ తల్వార్

హనుమకొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): 'ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించడమే నా లక్ష్యం.. ఆ దిశగా నా పరుగు కొనసాగుతుంది..' అంటున్నారు లతిక్ తల్వార్. గురువారం హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో ప్రారంభమైన ఐదో జాతీయ స్థాయి అండర్ -23 అథ్లెటిక్స్ పోటీల్లో మొదటి నిర్వహించిన 10,000 మీటర్ల రేస్‌వాక్‌లో లతిక్ స్వర్ణ పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. 10,000 మీటర్ల రేస్‌లో స్వర్ణ పతకం గెలుచుకోవడం ఇదే మొదటి సారి అన్నారు. ఇంతకుముందు 5000 మీటర్ల రేస్‌వాక్‌లో స్వర్ణం గెలుచుకున్నానని చెప్పారు. రాజస్థాన్ రాష్ట్రంలోని తల్వార్ ఆమె స్వగ్రామం. వీరిది వ్యవసాయ కుటుంబం. క్రీడల పట్ల మక్కువ ఎక్కువ. పాఠశాలలో నిర్వహించే పరుగు పందాల్లో లతిక్ ఎప్పుడూ విజేతే. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఇచ్చిన ప్రోత్సాహంతో అథ్లెటిక్‌గా అంచెలంచెలుగా రాణిస్తున్నారు. ఒలింపిక్స్‌లో భారత దేశం తరుపున పాల్గొని స్వర్ణం గెలుచుకోవం తన అంతిమ లక్ష్యమని, ఆ దిశగా మరింత శ్రమిస్తానని అన్నారు.


లతిక్ తల్వార్

రెండు కొత్త రికార్డులు

100 మీటర్ల రేస్, డిస్కస్ త్రోలో సాక్షి, నిఖిత్ కుమారి ప్రతిభ

హనుమకొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఐదో జాతీయ అథ్లెటిక్స్ ఓపెన్ అండర్ -23 పోటీల్లో అథ్లెట్లు హోరాహోరీగా తలపడుతున్నారు. కొత్త రికార్డులను సృష్టిస్తున్నారు. గురువారం తొలి రోజు జరిగిన 100 మీటర్స్, డిస్కస్‌త్రో ఈవెంట్లలో రెండు కొత్త రికార్డులు నమోదయ్యాయి.

100 మీటర్ల రేస్‌లో 2022లో జరిగిన నేషనల్స్‌లో ధనశ్రీ (బిలాస్‌పూర్) మీట్ రికార్డు 11.63 సెకండ్లు కాగా, గురువారం జరిగిన సెమిఫైనల్స్‌లో ఈవెంట్‌లో సాక్షి (రిలయన్స్) 11.62 సెకండ్లలో (ఒక సెకండ్ తేడాతో) పూర్తి చేసి కొత్త రికార్డు నెలకొల్పారు.

డిస్కస్‌త్రోలో 2024లో సన్యాయాదవ్ (హరియాణా) మీట్ రికార్డు 50.59 మీటర్స్ కాగా, గురువారం జేఎన్ఎస్‌లో జరిగిన నేషనల్స్‌లో పంజాబ్ ఎన్‌సీవోపీకి చెందిన నిఖిత్‌కుమారి 50.73 మీటర్లు (0.14 మీటర్లు ఎక్కువ దూరం) విసిరి పాత రికార్డునే బ్రేక్ చేసింది.

హైదరాబాద్‌లో ఒలింపిక్స్

- అదే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యం
- గెలుపోటములను క్రీడా స్ఫూర్తితో తీసుకోవాలి
- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- అట్టహాసంగా జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ వేదికగా ఒలింపిక్స్ క్రీడా పోటీలు నిర్వహించడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ పర్యవేక్షణలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో 5వ జాతీయస్థాయి ఓపెన్ అండర్-23 మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ఎంపీ కావ్య ముఖ్య అతిథిగా హాజరై క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విజన్ కలిగిన సీఎం రేవంత్‌రెడ్డికి క్రీడల పట్ల ఉన్న ఆసక్తితో రాష్ట్రంలో ఖేలో ఇండియా ద్వారా రానున్న మూడు, నాలుగు ఏళ్లలో హైదరాబాద్‌లో ఒలంపిక్స్ క్రీడా పోటీలు నిర్వహించడానికి కార్యాచరణ రూపొందించబోతున్నారన్నారు. సీఎం ఆదేశాలతో రాష్ట్రానికి చెందిన ఎంపీలు ఒలింపిక్స్ ప్రతినిధి పీటీ ఉషను కలిసి ఒలింపిక్స్ క్రీడా పోటీల నిర్వహణపై చర్చించామన్నారు. హైదరాబాద్ తర్వాత అభివృద్ధిలో ద్వితీయ స్థానంలో నిలుస్తున్న హనుమకొండలో అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియం, స్పోర్ట్స్ పాఠశాల ఏర్పాటుకు కసరత్తు పూర్తికావచ్చిందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సమానంగా తీసుకోవాలని సూచించారు.

హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. హనుమకొండ నగరంలో జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించడం ఎంతో సంతోషకరమన్నారు. దేశం నలు మూలల నుంచి వచ్చిన క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం తరుపు, అథ్లెటిక్స్ అసోసియేషన్ తరుపున ఏర్పాట్లను చేసామన్నారు. మేయర్ సుధారాణి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. జేఎన్ఎస్ అభివృద్ధి కోసం జీడబ్ల్యూఎంసీ నుంచి సుమారు రూ.2కోట్ల మేర నిధులు మంజూరు చేసామన్నారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి మాట్లాడుతూ.. జాతీయస్థాయి అండర్-23 మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ పోటీల్లో దేశంలోని నలుమూలల, రెండు తెలుగు రాష్ట్రాలతో సహా 937 మంది అథ్లెట్లు, 135 మంది టెక్నికల్ అఫీషియల్స్, కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారన్నారు. మూడు రోజుల పాటు క్రీడా పోటీలు పండుగ వాతవరణంలో క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వహిస్తామన్నారు. 10వేల మీటర్ల పరుగుపందెం, డిస్కస్‌త్రో, 100 మీటర్ల పరుగుపందెం, షాట్‌పుట్, లాంగ్‌జంప్, హైజంప్, 400 మీటర్ల పరుగుపందెం, హ్యామర్‌త్రో, పోల్‌వాల్ట్, 1500 మీటర్ల పరుగుపందెంలో తొలిరోజు క్రీడా పోటీలు నిర్వహించామన్నారు.

ఈ సందర్భంగా తొలి రోజు నిర్వహించిన 10వేల మీటర్ల పరుగు పందెంలో విజయం సాధించిన అథ్లెట్లకు అతిథుల చేతుల మీదుగా మెడల్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ ఎర్రబెల్లి వరద రాజేశ్వర్, రాష్ట్ర అధ్యక్షుడు స్టాన్లీజోన్, హనుమకొండ డీవైఎస్‌వో అశోక్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్, సీఐ పుల్యాల కిషన్, అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు పగడాల వెంకటేశ్వర్‌రెడ్డి, పి.రమేష్‌రెడ్డి, రమణ, ఊర యుగేందర్‌రెడ్డి, రామప్ప పోలీస్ అకాడమీ చైర్మన్ ఐలి చంద్రమోహన్‌గౌడ్, డీఎస్‌ఏ కోచ్ శ్రీమాన్, వివిధ జిల్లాలకు చెందిన అసోసియేషన్ సభ్యులు, మేనేజర్లు, టెక్నికల్ అఫీషియల్స్ తదితరులు పాల్గొన్నారు.


జాతీయస్థాయి క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ కావ్య

రచ్చ రచ్చ...

(5వ పేజీ తరువాయి)

నాయిని రాజేందర్‌రెడ్డితో విభేదాలు, పరకాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డితో విభేదాలతో గత ఏడాది దసరా మరుసటి రోజు గీసుగొండ పోలీస్‌స్టేషన్ ఎదుట మంత్రి సురేఖ ధర్నా, తదితర సంఘటనలు వివాదాస్పదంగా మారాయి.

మంత్రి పొంగులేటితో విభేదాలు

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో మేడారం టెండర్ల విషయంలో తలెత్తిన విభేదాలు పార్టీలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. మేడారం గద్దెల పునరుద్ధరణ, ప్రాకారం విస్తరణ పనుల కోసం ప్రభుత్వం రూ.101కోట్ల నిధులు కేటాయించింది. ఈ పనులను దేవాదాయశాఖకు కేటాయించారు. అయితే తన శాఖ నిధులతో చేపట్టే పనుల్లో మంత్రి పొంగులేటి పెత్తనం ఏమిటని, తనకు తెలియకుండా ఆయన సొంత కంపెనీలకు టెండర్లు ఇప్పించుకుంటున్నారని సురేఖ అగ్రహంతో సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. మరుసటి రోజు సోమవారం మేడారంలో మంత్రి సీతక్కతో కలిసి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జాతరపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు సురేఖకు ఆహ్వానం లేకపోవటంతో దూరంగా ఉన్నారు. దేవాదాయశాఖ మంత్రికి తెలియకుండా జాతరపై సమీక్ష నిర్వహించటంపై విమర్శలు వెల్లువెత్తాయి.

ఈ వివాదం సోషల్ మీడియాలో వైరల్ కావటంతో పాటు అధిష్ఠానం వరకు వెళ్లింది. ఈ క్రమంలోనే బుధవారం మధ్యాహ్నం 2గంటలకు సీఎం వరంగల్ పర్యటనకు వచ్చారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తల్లి కాంతమ్మ దశదిన కర్మలో సీఎం పాల్గొన్నారు. దొంతితో కొండా దంపతులకు రెండు దశాబ్దాలకు పైగా రాజకీయ వైరం ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాకు వచ్చినప్పుడు ప్రొటోకాల్ ప్రకారం హెలిప్యాడ్ వద్ద మంత్రి సురేఖ స్వాగతం పలికి ఉండాల్సిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. సురేఖ సీఎం పర్యటనకు దూరంగా ఉండటంతో రాజకీయంగా మరింత దుమారం రేగుతోంది.

వివాదం సద్దుమణిగేనా..?

మంత్రి కొండా సురేఖ ఎపిసోడ్ ఉమ్మడి వరంగల్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. అయితే సురేఖ భర్త మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. రేవంత్‌రెడ్డి తమకు మరో వైఎస్ఆర్ వంటి వారని, రేవంత్‌రెడ్డిని సీఎం చేసేందుకు తాను, సురేఖ కష్టపడ్డామని పేర్కొన్నారు. మరోవైపు మంత్రి సురేఖతో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తదితరులు చర్చించారు. మీనాక్షి నటరాజన్ ఫోన్‌లో సురేఖతో మాట్లాడి.. ఎలాంటి మీడియా సమావేశాలు పెట్టవద్దని సూచించారని సమాచారం. మొత్తానికి అధిష్ఠానం కూడా సురేఖతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి, పొంగులేటితో చర్చించినట్లుగా ప్రచారం జరుగుతోంది. 42శాతం బీసీ రిజర్వేషన్ల కోసం పోరాడుతున్న నేపథ్యంలో బీసీ మహిళ మంత్రితో వివాదం కాంగ్రెస్ పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని అధిష్ఠానం భావిస్తున్నట్లుగా తెలిసింది.

అన్నావదినలపై కత్తితో దాడి

- తీవ్రగాయాలతో వదిన మృతి, అన్నకు గాయాలు
- స్థల వివాదంలో ఘర్షణ
- నల్లబెల్లి మండలం కొండాపురంలో ఘటన

నల్లబెల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థలం విషయంలో చెలరేగిన గొడవ కత్తిపోట్లకు దారి తీసింది. ఇంటి స్థలాన్ని పంచమని తల్లితో గొడవ పడ్డ వ్యక్తిని తమ్ముడు కత్తితో దాడిచేశాడు. అడ్డువచ్చిన వదినను కూడా పొడవడంతో ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. అన్న తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.

వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం కొండాపురం గ్రామానికి చెందిన మేరుగుత్తి సమ్మక్క - మల్లయ్య దంపతులకు ఇద్దరు కుమారులు రమేష్, సురేష్ ఉన్నారు. యేడాది కిందట పెద్ద కుమారుడు రమేష్‌కు గీసుగొండ మండలం మచ్చాపురానికి చెందిన స్వరూప(35)తో వివాహమైంది. చిన్నకుమారుడు సురేష్‌కు వివాహం కాలేదు. అయితే ఇంతకుముందే పెద్ద కుమారుడు రమేష్‌కు వివాహం కాగా భార్య చనిపోయింది. ఆయనకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. అలాగే స్వరూపకు కూడా ఇదివరకే వివాహం కాగా, ఇద్ద రు కుమారులు ఉన్నా రు. వీరిద్దరు తల్లిదండ్రుల ఇంటి పక్కనే రేకుల షెడ్డులో నివసిస్తున్నారు. కాగా, రమేష్ - స్వరూప దంపతులు.. వారి సమీప బంధువు చనిపోవడంతో అంత్యక్రియలకు వెళ్లి బుధవారం రాత్రి ఇంటికి చేరుకున్నారు. ఇదే క్రమంలో తల్లి సమ్మక్క ఇంటి వద్దే ఎదురుగా కనబడడంతో రమేష్ వాగ్వాదానికి దిగాడు. ఇంటి స్థలాన్ని ఇంకా ఎప్పుడు పంచుతావని ఘర్షణకు దిగాడు. అదే సమయంలోనే రమేష్ తమ్ముడు సురేష్ ఇంటికి వచ్చాడు. గొడవ పెద్దగా కావడంతో తీవ్రమైన కోపంతో తాను ఇదివరకే ఇచ్చిన రూ.10వేలు ఇవ్వకుండా, పైగా ఇంటి స్థలాన్ని పంచమని గొడవ చేస్తావా..? అంటూ కోప్పడ్డాడు. ఆపై పక్కనే ఉన్న పందులను కోసే కత్తితో అన్న సురేష్ వీపుపై, పొట్టలో రమేష్ పొడిచాడు. ఇది గమనించిన స్వరూప అడ్డుకునేందుకు రాగా, ఆమెను కూడా ఛాతి భాగంలో కత్తితో పొడిచాడు. తీవ్ర గాయాల పాలైన దంపతులను వెంటనే కుటుంబసభ్యులు, స్థానికులు 108లో నర్సంపేటలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే స్వరూప చికిత్స పొందుతూ రాత్రే మృతి చెందగా, రమేష్ ప్రస్తుతం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతురాలి కుమారుడు శివకుమార్ ఫిర్యాదు మేరకు మేరుగుత్తి సురేష్‌పై కేసును నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై గోవర్ధన్ వెల్లడించారు.


స్వరూప (ఫైల్)


ఎంజీఎంలో చికిత్స పొందుతున్న రమేష్

ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్, వ్యాస రచన పోటీలు : సీపీ

వరంగల్ క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఔత్సాహిక ఫొటోగ్రాఫర్‌లకు ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్, విద్యార్థులకు వ్యాసరచనలో పోటీలు నిర్వహిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. ఫొటోగ్రఫీ పోటీల్లో భాగంగా పోలీసుల త్యాగం తెలిసేలా, వారి ప్రతిభను గుర్తించే ఇటీవల తీసిన 3 ఫొటోలు, షార్ట్ ఫిల్మ్‌లో భాగంగా 3 నిమిషాలు వీడియోను ఈ నెల 25వ తేదీలోపు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పీఆర్‌వోకు అందజేయాలన్నారు. అదేవిధంగా వ్యాసరచనలో పోటీల్లో పాల్గొనేందుకు 6వ తరగతి నుంచి పీజీ వరకు చదివే విద్యార్థులు అర్హులని, 'డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర', విద్యార్థులు డ్రగ్స్ నుంచి ఎలా దూరంగా ఉండాలి' అనే అంశంపై 500 పదాలకు మించకుండా వ్యాసం రాసి ఆన్‌లైన్‌లో వ్యాసం ఫొటో కానీ, పీడీఎఫ్ ఫార్మాట్‌లోనైనా పంపించాలన్నారు. మిగతా వివరాలకు 87126 85050 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

బిల్లు చెల్లింపులో వ్యవసాయ శాఖ నిర్లక్ష్యం

- జనగామ డీఏవో కార్యాలయ సామగ్రి జప్తుకు కోర్టు ఆదేశం

జనగామ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏళ్లుగా బిల్లులు ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వ్యవసాయ శాఖ కార్యాలయ ఫర్నిచర్ జప్తుకు కోర్టు ఆదేశించింది. జనగామకు చెందిన దీప్తి ఇంజనీరింగ్, వెల్డింగ్ వర్క్స్ యజమాని కత్తుల రాజిరెడ్డి ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రైతులకు అందించిన రాయితీ పనిముట్ల తయారీ కాంట్రాక్టును దక్కించుకున్నాడు. 2014-15 ఏడాది నుంచి కల్టివేటర్లు, ప్లవ్‌లు, రొటోవేటర్లు, ఇతర పనిముట్లు తయారీ చేసి జిల్లా వ్యవసాయ శాఖకు అందిస్తున్నాడు. దీనికి సంబంధించి వ్యవసాయ శాఖతో ఒప్పందం జరిగింది. కాగా, పనిముట్ల తయారీకి గాను 2016-17 ఏడాదికి సంబంధించిన బిల్లు రూ.5.25 లక్షలు వ్యవసాయ శాఖ చెల్లించాల్సి ఉంది. అప్పట్లో కేంద్ర సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల శాఖ పరిధిలోని 'సమాధాన్' ద్వారా ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి ఉమ్మడి జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు స్పందించి వ్యవసాయ అధికారులతో మాట్లాడి బిల్లుల చెల్లింపునకు హామీ ఇచ్చారు. అయినా వ్యవసాయ శాఖ బిల్లులు ఇవ్వలేదు. దీంతో రాజిరెడ్డి జనగామ కోర్టును ఆశ్రయించారు. దీంతో స్పందించిన కోర్టు బిల్లు రూ. 5.25 లక్షలు, మూడింతల వడ్డీ రూ.13,19,428 కలిపి మొత్తంగా రూ. 18,44,928 ఇవ్వాలని ఆగస్టు 5న జిల్లా వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించింది. అయినా బిల్లు ఇవ్వకపోవడంతో జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలోని సామగ్రిని జప్తు చేసుకునేలా అటాచ్‌మెంట్ వారెంట్‌ను జారీ చేసింది. కాగా, కోర్టు అటాచ్‌మెంట్ వారెంట్‌తో, కోర్టు ఫీల్డ్ అసిస్టెంట్ ఫూల్‌చంద్‌తో కలిసి సామగ్రిని జప్తు చేసుకునేందుకు బాధితుడు రాజిరెడ్డి కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ కార్యాలయానికి గురువారం వచ్చారు. కాగా, జిల్లా వ్యవసాయాధికారి అంబికాసోని, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్ బాధితుడితో మాట్లాడారు. మూడు నెలల్లో బిల్లు మంజూరు చేయిస్తామని హామీ ఇవ్వడంతో బాధితుడు కత్తుల రాజిరెడ్డి అంగీకరించారు. ఈ విషయమై జిల్లా వ్యవసాయాధికారి అంబికాసోనిని వివరణ కోరగా.. తాను జిల్లాకు కొత్త కావడంతో పెండింగ్ బిల్లు విషయం తన దృష్టిలో లేదని చెప్పారు. బిల్లు చెల్లింపునకు మూడు నెలల గడువు కోరామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం నగరంలోని నక్కలగుట్ట, న్యూశాయంపేట సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. గోకుల్ నగర్, తిరుమలబార్ జంక్షన్, సుమంగళి ఫంక్షన్ హాల్ ఏరియా, అశోక కాలనీ, బీర కుంట ఏరియాలో ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు, ప్రకాశ్‌రెడ్డిపేట, పోలీస్ కాలనీ, పోస్టల్‌కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, విద్యుత్ నగర్‌లో ఏరియాలో ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

వరంగల్ క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ 20మందిని గురువారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్ రూ.23,800 జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపి పట్టుబడ్డ 12మందిని కోర్టులో హాజరు పరచగా రూ.8,400 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

బీసీ జేఏసీ బంద్‌కు సంపూర్ణ మద్దతు

ప్రకటించిన వివిధ పార్టీలు, సంఘాల నాయకులు

రాంనగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్‌ల కోసం ఈ నెల 18న బీసీ జేఏసీ నిర్వహించే రాష్ట్ర వ్యాప్త బంద్‌కు హనుమకొండ బీజేపీ పార్టీ పక్షాన సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి తెలిపారు. బీసీ జేఏసీ బంద్‌కు బీజేపీ పార్టీ సంఘీభావం ఇవ్వాలని గురువారం ఉమ్మడి వరంగల్ బీసీ జేఏసీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ ఆధ్వర్యంలో హంటర్‌రోడ్డులోని బీజేపీ పార్టీ కార్యాలయంలో బీజేపీ నాయకులను కలిసి విన్నవించారు. ఈ మేరకు స్పందించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ వర్కింగ్ చైర్మన్ రఘుపతి, వైస్ చైర్మన్లు దాడి మల్లయ్య, బొనగాని యాదగిరి, వైద్యం రాజ్‌గోపాల్, తుమ్మల శోభారాణి, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, నాయకులు నానునాయక్, వలభోజు శ్రీనివాస్, అరణ్యరెడ్డి, మల్లికార్జున్, జగదీశ్వర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


కేయూలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ నేతలు, ప్రజా సంఘాల బాధ్యులు

● **కేయూ క్యాంపస్:** ఈనెల 18న బీసీ జేఏసీ చేపట్టనున్న తెలంగాణ బంద్‌కు ఏబీవీఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ ప్రకటించారు. గురువారం కేయూలో బంద్‌కు సంఘీభావం ప్రకటించారు. అలాగే బీసీ జేఏసీ నిర్వహించే బంద్‌కు బహుజనులందరూ భాగస్వాములు కావాలని బీఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్ పిలుపునిచ్చారు. గురువారం కేయూలో నిర్వహించిన బీఎస్ఎఫ్ సమావేశంలో మనోహర్ మాట్లాడారు. కాగా, 18న నిర్వహించే బీసీ జేఏసీ బంద్‌కు మద్దతుగా గురువారం కేయూ ఎస్డీఎల్‌సీఈ వద్ద జాతీయ బీసీ సంక్షేమ సంఘం విద్యార్థి విభాగం నేతృత్వంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులి శ్రీనివాస్, బుట్టి శ్యాంయాదవ్‌లు మాట్లాడారు.

● **వడ్డెపల్లి :** ఈ నెల 18న బీసీ ఐక్య సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ ఫర్ జస్టిస్‌ను జయప్రదం చేయాలని బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు పిలుపు నిచ్చారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు బీసీ ఐక్య సంఘర్షణ సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి ఎదునూరి రాజమొగిలి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బుట్టి శ్యామ్ యాదవ్ మాట్లాడారు. కాగా, ఈ నెల 18న బీసీ ఐక్య సంఘాల ఆధ్వర్యంలో చేపట్టినబంద్‌కు సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నట్లు జై భీం జిల్లా అధ్యక్షుడు తాళ్లపెల్లి విజయ్ తెలిపారు. గురువారం హనుమకొండ వడ్డెపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాగా, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కాకుండా అగ్రవర్ణాలు మోసం చేస్తున్నారని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోజు భిక్షపతి దుయ్యబట్టారు. గురువారం హనుమకొండ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లో నిర్వహించిన విశ్వబ్రాహ్మణ, విశ్వ కర్మ ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 18న బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే బంద్‌కు సంపూర్ణ మద్దతును తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.


బీజేపీ జిల్లా కార్యాలయంలో బంద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

● **వరంగల్ మెడికల్:** బీసీలు సంఘటితంగా 42 శాతం రిజర్వేషన్లు సాధించాలని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కూరపాటి రమేశ్ అన్నారు. గురువారం హనుమకొండ ఏషియన్ మాల్ ప్రాంతంలో జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కూరపాటి రమేశ్ మాట్లాడుతూ.. బీసీలు, 90 శాతం ఉన్న సబ్బండ వర్గాల రాష్ట్ర నాయకత్వాలు అందరూ ఐక్యంగా ఏర్పడి 42 శాతం రిజర్వేషన్ కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ డాక్టర్ చందా మల్లయ్య మాట్లాడుతూ.. రాజ్యాధికారం లేకపోతే బీసీలు ఎప్పటికీ అభివృద్ధిలోకి రారనేది గుర్తించాలని కోరారు.


గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న ఎంపీ కావ్య, అధికారులు

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

వరంగల్ ఎంపీ కడియం కావ్య

బాలసముద్రం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మహిళలు, కిశోర బాలికలు, చిన్నపిల్లలు పోషకాహారం తీసుకుంటేనే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించగలమని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. గురువారం హనుమకొండలోని సర్క్యూట్ గెస్ట్‌హౌస్ సమీపంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోషణ మాసం ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతీ ఒక్కరు స్థానికంగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తీసుకున్నప్పుడే సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని అన్నారు.

కలెక్టర్ స్నేహశబరీష్ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, పిల్లల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలుచేస్తున్న అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్టు అరుణ్ జ్యోతి మాట్లాడుతూ.. సమాజంలో 50 శాతం మంది మహిళలు స్థూలకాయంతో బాధపడుతున్నారన్నారు. తీసుకున్న ఆహారం ఖర్చయ్యేందుకు శారీరక శ్రమ ఉండాలన్నారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సీమంతాలు, చిన్నపిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జయంతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ.అప్పయ్య, డీఆర్‌డీవో మేన శ్రీను, డీపీఎం భానుప్రకాష్, సూపర్‌వైజర్లు, పోషణ అభియాన్ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు


కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

వడ్డెపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు అన్నారు. గురువారం హనుమకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హనుమకొండ 56వ డివిజన్‌కు చెందిన పలువురికి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో 56వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంకా హరిబాబు, డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు రుద్రోజు మణీంద్రనాథ్, చింత రమేష్ గౌడ్, కందుకూరి పూర్ణచందర్, దూలం సదానందం గౌడ్, బూర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'నా ఆలోచనలు' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేటీఆర్, టి. రాజయ్య, సుమన్ తదితరులు

కేయూ క్యాంపస్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్వీ కేయూ నేత పిన్నింటి విజయ్‌కుమార్ రాసిన వ్యాస సంపుటి 'నా ఆలోచనలు' పుస్తకాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, నాయకులు తాటికొండ రాజయ్య, బాల్క సుమన్, ఏనుగుల రాకేశ్‌రెడ్డి, పల్లారాజేశ్వర్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్రలు ఆవిష్కరించారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కేటీఆర్‌తోపాటు ఇతర బీఆర్ఎస్ నేతలు మాట్లాడారు. సామాజిక స్పృహ, తెలంగాణపై మమకారంతో మంచి వ్యాసాల సంపుటిని రాశారని కొనియాడారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంపై నమ్మకంతో మంచి పుస్తకం రాయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శేరి సుభాష్‌రెడ్డి, తంగబాలు, జెట్టి రాజేందర్, రాజేశ్‌నాయక్, ప్రశాంత్, అభిషేక్, నితిన్, రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఇంజనీరింగ్ కళాశాల కేర్ టేకర్‌గా శ్రీనివాస్

కేయూ క్యాంపస్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కేయూ మహిళ ఇంజనీరింగ్ కళాశాల కేర్‌టేకర్‌గా శాగంటి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈమేరకు గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు, సూపరింటెండెంట్ బి.వీరునాయక్ ఉత్తర్వులు అందజేశారు. శ్రీనివాస్ నియామకంపై బోధనేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనలు పాటించాలి

కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ కలెక్టరేట్, 16 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలోని ప్రైవేటు క్లినిక్‌లు, ఆస్పత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం నియమాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్, రిజిస్టరింగ్ అథారిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఐఎంఏ, తానా, గైనకాలజిస్ట్ అసోసియేషన్, డెంటల్, ఆయుర్వేదిక్, హోమియో, యునాని, ఫిజియోథెరపీ అసోసియేషన్ ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ప్రభుత్వ నియమనిబంధనల మేరకు క్లినిక్‌లు, ఆస్పత్రుల ఏర్పాటు, నిర్వహణ, అనుమతులు, ఫీజుల పట్టిక, ఫైర్ సేఫ్టీ, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు.

ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగార్జున రెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ విజయ్‌చందర్ రెడ్డి, గైనకాలజిస్టుల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ రాధిక, ఐడీఏ అధ్యక్షుడు డాక్టర్ ప్రీతం రెడ్డి, ఆయుర్వేదిక్ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ రవీందర్, హోమియో అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ సుధాకర్ రావు, ఫిజియోథెరపీ అసోసియేషన్ ప్రతినిధి సురేష్ కుమార్, స్టాటిస్టికల్ అధికారి ప్రసన్నకుమార్, డెమో అశోక్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్

'అక్షయ పాత్ర'ను రద్దు చేయాలి

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనంలో అక్షయ పాత్రను రద్దు చేసి ఇంతకు ముందు ఉన్న విధంగా మధ్యాహ్నభోజన కార్మికులకే ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి గురువారం హనుమకొండలోని వరంగల్ డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ.. 25 ఏళ్లుగా మధ్యాహ్న భోజన కార్మికులు సమర్థవంతంగా నిర్వహించినప్పటికీ చెప్పాపెట్టకుండా అక్షయ పాత్రకు కట్టబెట్టడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం కార్మికుల పొట్టలుకొట్టకుండా అక్షయ పాత్రను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రజిని, రజియా సుల్తానా, జకియా సుల్తాన, ఇందిర, ఉమ, మల్లికాంబ, సుమతి తదితరులు పాల్గొన్నారు.

ట్రస్మా ప్రధాన కార్యదర్శికి సన్మానం

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రైవేట్ పాఠశాలల మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్(ట్రస్మా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నడిపెల్లి వెంకటేశ్వర్‌రావును గురువారం పలువురు కలిసి శాలువాలు కప్పి సన్మానించి అభినందించారు. రాష్ట్ర ట్రస్మా గౌరవ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, వరంగల్ జిల్లా ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్స్ నాయకులు, నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకులు డాక్టర్ జేఎస్. పరంజ్యోతి, అంకతి వీరస్వామి, బిల్ల రవి, శ్యాం, కొండేటి శ్రీధర్, ప్రసాద్, శరత్, జిల్లా వెలమ సంఘం నాయకులు పిన్నింటి బాలచందర్‌రావు, తక్కళ్లపల్లి శ్యాంసుందర్‌రావు, తక్కళ్లపెల్లి రవీందర్‌రావు, కాకులమర్రి ప్రవీణ్‌కుమార్, పల్లెపాటి విద్యాసాగర్‌రావు, సిద్దూరి స్వామిరావు, చెన్నమనేని జయశ్రీ, గుజ్జ గోపాల్‌రావు, జలగం రంజిత్‌రావు, ఎన్నమనేని శ్రీనివాస్‌రావు తదతర నాయకులు వెంకటేశ్వర్‌రావును అభినందించారు.


వెంకటేశ్వర్‌రావును సన్మానిస్తున్న పరంజ్యోతి, ఇతర నాయకులు


వాల్మీకి ఆలయంలో పూజలు చేస్తున్న రాఘవరెడ్డి

వాల్మీకి మహర్షి ఉపదేశాలు ఆచరణీయం

రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ రాఘవరెడ్డి

మడికొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మడికొండలో వాల్మీకి జయంతోత్సవ వేడుకల్లో భాగంగా వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో గురువారం రథోత్సవ వేడుకను వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ.. వాల్మీకి మహర్షి ఆయన జీవితంలో సాధించిన మార్పును రామాయణాన్ని రచించడం ద్వారా ప్రజలకు సదాచారం, ధర్మబద్ధమైన జీవన విధానాన్ని అందించారన్నారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు బోగి శ్రీనివాస్, బోగి లింగమూర్తి, నిగ్గుల సతీష్, పేర్ల సురేష్, కుర్ల మోహన్, కంచనపల్లి వెంకటయ్య, బోగి లింగయ్య, బోగి కుమారస్వామి, కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొట్ల రాజుయాదవ్, వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ నార్లగిరి కుమారస్వామి, కాంగ్రెస్ నాయకులు వస్కుల శంకర్, బిల్ల రవిందర్, వస్కుల శ్రీను, బైరి కొమురయ్య, పల్లపు అర్జున్, పెనుకుల వినయ్, జిట్ట చంటి తదితరులు పాల్గొన్నారు.

చెరువు కబ్జాపై ఐబీ అధికారుల స్పందన

» జేసీబీ సీజ్ » ఇద్దరిపై కేసు నమోదు

హసన్‌పర్తి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తూర్పు చెరువును కబ్జా నుంచి కాపాడాలని కోరుతూ దేవన్నపేట గ్రామస్థులు ఈ నెల 11న ఆక్రమణ స్థలాన్ని పరిశీలించి ఆందోళన చేశారు. గ్రామస్థుల ఆవేదన మేరకు ఈ నెల 12న ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'తూర్పు చెరువును కబ్జా నుంచి కాపాడాలి' అనే కథనం ప్రచురితమైంది. దీంతో చింతగట్టు ఇరిగేషన్ డిపార్టుమెంట్ అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చింతగట్టు ఇరిగేషన్ డిపార్టుమెంట్ ఏఈఈ నాగవెల్లి శ్రీనివాస్ దేవన్నపేట రెవెన్యూ శివారు తూర్పు చెరువు కబ్జా స్థలాన్ని గురువారం పరిశీలించారు. చెరువు మత్తడిని ధ్వంసం చేసి నీటి స్థాయిని తగ్గించి జేసీబీతో చదును చేసి చెరువు శిఖం భూమిని ఆక్రమించి భూదందా చేస్తున్నట్లు గుర్తించారు. చెరువు మత్తడి 2 ఫీట్ల వెడల్పుతో సుమారుగా 40 మీటర్ల పొడవు, 2 ఫీట్ల ఎత్తు వరకు ఉన్న చెరువు మత్తడిని పూర్తిగా ధ్వంసం చేసి సుమారు రూ.2 లక్షల ప్రభుత్వ ఆస్తి నష్టం జరిగినట్లు గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నష్టానికి కారణమైన దేవన్నపేటకు చెందిన సందెల చిరంజీవి, పోలెపాక అశోక్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చింతగట్టు ఏఈ ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి జేసీబీని సీజ్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వట్టె చేరాలు తెలిపారు.

సీపీఆర్‌పై అవగాహన

వరంగల్ మెడికల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్)పై గురువారం ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నర్సింగ్, పారా మెడికల్ విద్యార్థులకు సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కేఎంసీ ప్రిన్సిపాల్ ఎస్ సంధ్య మాట్లాడుతూ.. సీపీఆర్ వారోత్సవాల సందర్భంగా అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సీపీఆర్ చేయడం వల్ల గుండె ఆగిపోయిన వ్యక్తులను బతికించే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మురళి, నోడల్ ఆఫీసర్, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్, నర్సింగ్, పారా మెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నేడు కాకతీయ యూనివర్సిటీలో..

కేయూ క్యాంపస్ (ఆంధ్రజ్యోతి): కేయూ ఆరోగ్య కేంద్రం నేతృత్వంలో అక్టోబరు 17న శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు కార్డియో పల్మనరీ రేససియేషన్ (సీపీఆర్)పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆరోగ్య కేంద్రం మెంబర్ ఇన్‌చార్జి ప్రసాద్ గురువారం తెలిపారు. దీనికి కేయూ వీసీ ప్రొఫెసర్‌కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలతో పాటు ప్రముఖ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ రామక శ్రీనివాస్ హాజరై సీపీఆర్‌పై ప్రయోగపూర్వకంగా అవగాహన కల్పిస్తారని వివరించారు. బోధన, బోధనేతర సిబ్బందితోపాటు స్కాలర్లు, విద్యార్థులు, రిటైర్డు ఉద్యోగులు హాజరుకావాలని కోరారు.

నిజాయితీగా విధులు నిర్వర్తిస్తేనే గుర్తింపు

» సీపీ సన్‌ప్రీత్ సింగ్
» హసన్‌పర్తి పీఎస్ తనిఖీ

హసన్‌పర్తి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నిజాయితీగా విధులు నిర్వహిస్తేనే ప్రజల్లో పోలీసులకు గౌరవ మర్యాదలతో పాటు గుర్తింపు లభిస్తుందని పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. సీపీకి కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ చేరాలు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సీపీ పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలించి స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఎలాంటి ఫిర్యాదులు అధికంగా నమోదవుతున్నాయని, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. రౌడీషీటర్లు, అనుమానిత వ్యక్తుల వివరాలతో పాటు స్టేషన్ అధికారులు, సిబ్బంది నిర్వహిస్తున్న విధులపై సీపీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ పోలీసు అధికారులనుద్దేశించి మాట్లాడుతూ.. సమస్యలతో వచ్చిన బాధితుల వివరాలను నిదానంగా విని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా వారి వెంట ఎస్సైలు దేవేందర్, శీలం రవి, సుజిత్‌రెడ్డి, సిద్ధయ్య ఉన్నారు.


పోలీస్ రోల్ కాల్‌ను పరిశీలిస్తున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

నిబంధనలు పాటిస్తేనే అనుమతులు

● కమిషనర్ చహత్ బాజ్‌పాయి
● నిర్మాణ భవనాల పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ నిబంధనలు పాటిస్తేనే అనుమతులు జారీ చేస్తామని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి స్పష్టం చేశారు. నూతన భవనాల నిర్మాణాలకు అనుమతులు మంజూరు, బడా భవన నిర్మాణాలకు అక్యుపెన్సీ సర్టిఫికెట్ల జారీ కోసం గురువారం నగర పరిధిలోని ఎక్సైజ్ కాలనీ, శ్రీనివాస కాలనీ, బ్యాంక్ కాలనీ, సాయి గణేష్ కాలనీ, చింతగట్టు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో కమిషనర్ పర్యటించి నమోదు చేసిన వివరాలు, కొలతలు వేసి పరిశీలించారు. ఈ సందర్భంగా జీడబ్ల్యూఎంసీ కమిషనర్ మాట్లాడుతూ.. భవన నిర్మాణాల అనుమతుల కోసం దరఖాస్తు చేసిన నేపథ్యంలో సూచించిన ధృవపత్రాలు నమోదు చేసి నిబంధనలు పాటిస్తే చట్టంకు లోబడి అనుమతులు, ఆక్యుపెన్సీ మంజూరు చేస్తామని, నిబంధనలు ఉల్లంఘించే వారికి అనుమతులు ఇవ్వడం జరగదన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఏసీపీలు యెర్షాద్, రజిత తదితరులు పాల్గొన్నారు.


భవనాన్ని పరిశీలిస్తున్న బల్దియా కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

కన్‌స్ట్రక్షన్ డెమాలిషన్ ప్లాంట్

కన్‌స్ట్రక్షన్ డెమాలిషన్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కమిషనర్ ఫర్ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) టి.కె.శ్రీదేవి అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీఎంఏ నగరంలో చేపట్టనున్న బయో మైనింగ్‌తో పాటు కన్‌స్ట్రక్షన్ డెమాలిషన్ ప్లాంట్ ఏర్పాటు పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ.. ఇప్పటికే ఆర్ఎఫ్‌సీ పిలిచామని, టెండర్ ప్రక్రియ పూర్తి చేసి ఏర్పాటుకు వేగవంతంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ సత్యనారాయణ, సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజారెడ్డి, ఈఈ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఎంఎస్ఎన్ ఫార్మా అధినేత సత్యనారాయణరెడ్డికి పీయూ డాక్టరేట్‌ను ప్రదానం చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ; చిత్రంలో వీసీ జీఎన్ శ్రీనివాస్

ఎంఎస్ఎన్ ఫార్మా అధినేత సత్యనారాయణరెడ్డికి డాక్టరేట్ ప్రదానం

- వర్సిటీలు ఆధునిక దేవాలయాలు
- పాలమూరు వర్సిటీ నాలుగో స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్, చాన్సలర్ జిష్ణుదేవ్ వర్మ

మహబూబ్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): విద్య.. ఉద్యోగం సాధించడం కోసమే కాదని, వ్యక్తిత్వం, విలువలు, సంస్కృతి పరిరక్షణ, సేవా భావం పెంపుదల అన్నీ కూడా విద్యతోనే సాధ్యమవుతాయని రాష్ట్ర గవర్నర్, పాలమూరు యూనివర్సిటీ చాన్సలర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ఆధునిక దేవాలయాలుగా ఉన్న యూనివర్సిటీలు యువతను దేశాభివృద్ధిలో మార్గదర్శకులుగా మార్చాలని సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాలమూరు యూనివర్సిటీ (పీయూ)లో గురువారం నిర్వహించిన వర్సిటీ నాలుగో స్నాతకోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ పారిశ్రామికవేత్త, ఎంఎస్ఎన్ లేబొరేటరీస్, గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డికి వర్సిటీ తొలి గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. అలాగే మరో 12 మందికి డాక్టరేట్ పట్టాలు, 83 మందికి బంగారు పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. స్నాతకోత్సవం అనేది పట్టాల పంపిణీ వేడుక మాత్రమే కాదని, ఇది విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల త్యాగాలను స్మరించుకునే సందర్భమని పేర్కొన్నారు. నేర్చుకున్న విద్యను వివిధ రంగాల్లో రాణించడానికే కాకుండా మానవత్వ విలువల పెంపునకు, తమ జ్ఞానాన్ని ఇతరులకు పంచడానికి కృషి చేయాలని సూచించారు. పాలమూరు వర్సిటీ దశాబ్ద కాలంలో ప్రశంసనీయ అభివృద్ధి సాధించిందని, పరిశోధనలు పెరిగి కొత్త ఆవిష్కరణలు రావాలని ఆయన ఆకాంక్షించారు.

టపాసుల దుకాణం అనుమతికి 10 వేలు డిమాండ్

- రూ.8 వేలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఫైర్ ఆఫీసర్

నల్లగొండ క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): టపాసుల దుకాణానికి అనుమతి ఇచ్చేందుకు లంచం తీసుకున్న స్టేషన్ ఫైర్ ఆఫీసర్ అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులకు చిక్కిన ఘటన గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఏసీబీ డీఎస్పీ జగదీష్‌చంద్ర వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా కేంద్రంలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో తాత్కాలిక టపాసుల దుకాణం ఏర్పాటుకు అనుమతి కోసం ఓ వ్యక్తి జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక కేంద్రంలో దరఖాస్తు చేసుకున్నారు. అనుమతి ఇచ్చేందుకు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఏమిరెడ్డి సత్యనారాయణరెడ్డి రూ.10 వేలు డిమాండ్ చేశారు. రూ.8 వేలు ఇస్తాననడంతో.. గురువారం సాయంత్రం ఎన్‌జీ కళాశాల ఆవరణలో తన ద్విచక్ర వాహనంలో ఆ మొత్తం పెట్టాలని సత్యనారాయణరెడ్డి సూచించారు. బాధితుడు ఈ విషయాన్ని ఏసీబీ అధికారులకు చెప్పారు. వారి సూచనల మేరకు ద్విచక్ర వాహనం ముందు భాగంలో రూ.8వేల నగదు ఉంచగా... సత్యనారాయణరెడ్డి వెళ్లి ఆ నగదు తీసుకుని పర్సులో పెట్టుకున్న సమయంలో ఏసీబీ సిబ్బంది ఆయనను అదుపులోకి తీసుకున్నారు. అగ్నిమాపక కార్యాలయానికి తీసుకెళ్లి ఫైల్స్ స్వాధీనం చేసుకుని తనిఖీలు చేశారు.

హైకోర్టులోనే తేల్చుకోండి

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోవాలని సూచించింది. అదే సమయంలో పాత రిజర్వేషన్ల ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది.

గత సుప్రీంకోర్టు తీర్పులకు అనుగుణంగానే..

స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతూ ప్రభుత్వం జారీ చేసిన జీవోపై హైకోర్టు స్టే విధించిన విషయం తెలిసిందే. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఎస్ఎల్పీ దాఖలు చేసింది. హైకోర్టు స్టేను ఎత్తివేయాలని కోరింది. ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపించారు. ఎన్నికలు నోటిఫై చేయడానికి ముందే రిజర్వేషన్లపై చట్టం ఎందుకు తీసుకురాలేదని ధర్మాసనం ప్రశ్నించింది. అసెంబ్లీ ఆమోదించి పంపిన బిల్లును గవర్నర్ పెండింగ్‌లో పెట్టారని సింఘ్వి వివరించారు. గవర్నర్ నిర్ణీతకాలంలో ఆమోదించకుంటే అనుమతి ఇచ్చినట్టే భావించాలన్న ఇటీవలి సుప్రీంకోర్టు తీర్పు మేరకు తెలంగాణ రిజర్వేషన్ల బిల్లుకు ఆమోద ముద్ర పడినట్టేనని భావించామని తెలిపారు. అయితే మొత్తం రిజర్వేషన్లు 50శాతం దాటకూడదని సుప్రీం మార్గదర్శకాలు ఉన్నాయి కదా అని ధర్మాసనం ప్రస్తావించగా.. కచ్చితమైన డాటా ఉంటే పరిమితి దాటవచ్చని కూడా సుప్రీంకోర్టు పేర్కొందని సింఘ్వి వివరించారు.



సుప్రీం ట్రిపుల్ టెస్ట్ మార్గదర్శకాలను సంతృప్తి పరిచామని.. ఇంటింటికీ వెళ్లి సామాజిక, ఆర్థిక సర్వే చేశామని తెలిపారు. 50శాతం పరిమితి అనేది మార్చలేనిది కాదని, సరైన, శాస్త్రీయమైన డాటా ఉంటే మార్చవచ్చని వాదించారు. వెనుకబడిన వర్గాలకు ప్రయోజనం చేకూర్చేందుకు ఎన్నికైన ప్రభుత్వం తీసుకున్న విధాన నిర్ణయంపై ఎలాంటి వాదనలు వినకుండా స్టే ఎలా విధిస్తారని, ఆ స్టే విధించడానికి హైకోర్టు ఎలాంటి కారణాలు కూడా చెప్పలేదని సుప్రీం ధర్మాసనానికి వివరించారు. మొత్తం రిజర్వేషన్లు 67శాతానికి పెంచే నిర్ణయాన్ని రాష్ట్రంలోని అన్ని పార్టీలు సమర్థించాయని, శాసనసభ కూడా ఆమోదించిందని తెలిపారు. మరోవైపు ప్రతివాది మధుసూదన్‌రెడ్డి తరఫున గోపాల్ శంకర్‌నారాయణ్ వాదనలు వినిపించారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50శాతం మించకూడదని గతంలో సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని గుర్తు చేశారు. పరిమితిపై మినహాయింపులు కేవలం ఎస్టీలకే వర్తిస్తాయని కృష్ణమూర్తి కేసులో రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసిందని వివరించారు. సుమారు 36 నిమిషాల పాటు వాదనలు విన్న సుప్రీంకోర్టు ధర్మాసనం.. తెలంగాణ ప్రభుత్వ పిటిషన్‌ను తోసిపుచ్చింది. సాధారణ ప్రాంతాల్లో రిజర్వేషన్లు 50శాతం పరిమితికి మించరాదని స్పష్టం చేసింది.

బీసీ రిజర్వేషన్‌కు కట్టుబడి ఉన్నాం

హైకోర్టులో బలమైన వాదనలు వినిపిస్తాం.. అఖిల పక్షాన్ని తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తెస్తాం

- 18న బీసీ జేఏసీ బంద్‌కు మద్దతు: మహేశ్‌గౌడ్
- టీపీసీసీ చీఫ్‌ను కలిసిన బీసీ జేఏసీ ప్రతినిధులు

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ/పంజాగుట్ట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అన్నది కాంగ్రెస్ పార్టీ వాగ్దానమని, దానికి కట్టుబడే ఉన్నామని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. హైకోర్టులో మరోసారి బలమైన వాదనలు వినిపిస్తామని, బీసీ రిజర్వేషన్ సాధిస్తామనే నమ్మకం తమకు ఉందని పేర్కొన్నారు. గాంధీభవన్‌లో గురువారం మహేశ్‌గౌడ్‌ను బీసీ సంఘాల జేఏసీ ప్రతినిధులు ఆర్ కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్‌గౌడ్, దాసు సురేష్, రాజారామ్‌యాదవ్ తదితరులు కలిశారు. ఈ నెల 18న తలపెట్టిన బంద్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ బీసీ సంఘాల జేఏసీ బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. బీసీ రిజర్వేషన్‌కు అసెంబ్లీలో మద్దతు ఇచ్చి, బయటకొచ్చి మోకాలొడ్డుతున్న వారికి కనువిప్పు కలగాలన్నారు. అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళతామని, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే కార్యక్రమాలు చేపడతామని, ఇందుకు సంబంధించిన కార్యచరణను త్వరలోనే ప్రకటిస్తామని చెప్పారు. బీసీ రిజర్వేషన్లను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని ప్రధాని మోదీని అడిగేందుకు బీజేపీ తెలంగాణ ఎంపీలు ఎందుకు జంకుతున్నారని ప్రశ్నించారు. కాగా, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌కుమార్ యాదవ్‌కు మద్దతు ఇవ్వాలని సీపీఎం నేతలను మహేశ్‌గౌడ్ కోరారు. ఈ అంశంపై 20న రాష్ట్ర కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని సీపీఎం నాయకులు వివరించినట్లు తెలిసింది.



గాంధీభవన్‌లో మహేశ్‌గౌడ్‌కు వినతి పత్రం ఇస్తున్న ఆర్.కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ సంఘాల నాయకులు

బంద్ సెగ ఢిల్లీకి తాకాలి: బీసీ నేతలు

18న చేపట్టనున్న రాష్ట్ర బంద్ సెగ ఢిల్లీకి తాకాలని బీసీ జేఏసీ చైర్మన్ ఆర్.కృష్ణయ్య, బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంఘాల నేతలతో కలిసి వారు మాట్లాడారు. 42 శాతం రిజర్వేషన్లు సాధించేవరకు పోరాటం ఆగదని, బీసీలంతా ఏకమై బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రిజర్వేషన్లను వ్యతిరేకించే వారిని రాజకీయ శత్రువులుగా ప్రకటిస్తామని అన్నారు. కాగా, బీసీలకు 42శాతం రిజర్వేషన్ దక్కాల్సిందేనని, ఇందుకోసం ఎక్కడి వరకైనా కొట్లాడుతానని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు తెలిపారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి అగ్రకులాలకు చెందిన వారైనా బీసీల అభ్యున్నతి కోసం పని చేస్తున్నారని కొనియాడారు. ఫతేమైదాన్ క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని మోదీకి బీసీలపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే 42శాతం రిజర్వేషన్ కల్పించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. 18న చేపట్టనున్న రాష్ట్ర బంద్‌కు హైదరాబాద్‌లోని వ్యాపారస్తులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కాగా, బీసీ రిజర్వేషన్ల విషయంలో సర్కారు తప్పటడుగులు వేస్తోందని, ఆ పార్టీ డ్రామాలు ఫలించలేదని బీఆర్ఎస్ నేతలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, వి.శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. 18న బీసీ జేఏసీ చేపట్టిన బంద్‌లో బీఆర్ఎస్ పాల్గొంటుందని, అదేవిధంగా తెలంగాణలోని ప్రతి బీసీ బిడ్డ బంద్‌ను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

బంద్‌కు మావోయిస్టు పార్టీ మద్దతు

ఏటూరునాగారం/రాంనగర్:బీసీ జేఏసీ తలపెట్టిన తెలంగాణ రాష్ట్ర బంద్‌నువిజయవంతం చేయాలని మావోయిస్టు పార్టీరాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ పిలుపునిచ్చారు.పార్లమెంట్‌లో చట్టం ద్వారా ఈ సమస్య పరిష్కారం లభిస్తుందని పేర్కొంటూ,అన్ని పార్టీలు, సంఘాలు, విద్యార్థులు, ప్రజాస్వామికవాదులు,మేధావులు ఏకమై బీజేపీ తీరును నిరసిస్తూ ప్రజాందోళన చేపట్టాలని కోరారు.బీసీ బంద్‌కు మద్దతు ప్రకటిస్తున్నట్లు టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ తెలిపారు.

శ్రీనగర్‌లో బండి సంజయ్ పర్యటన

- పోలీస్ జూడో క్లస్టర్ ముగింపు ఉత్సవాలకు హాజరు



హైదరాబాద్, శ్రీనగర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జమ్మూకశ్మీర్ రాజధాని శ్రీనగర్‌లో నిర్వహించిన ఆలిండియా పోలీస్ జూడో క్లస్టర్ ముగింపు ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గతంలో తెలంగాణలో పనిచేసి ప్రస్తుతం జమ్మూకశ్మీర్ డీజీపీగా కొనసాగుతున్న నళిన్ ప్రభాత్ సహా ఉన్నతాధికారులు శ్రీనగర్ ఎయిర్ పోర్టులో కేంద్ర మంత్రికి స్వాగతం పలికారు. అన్ని రాష్ట్రాల పోలీస్, కేంద్ర పారామిలటరీ సిబ్బంది పాల్గొన్న ఈ క్రీడల్లో అత్యుత్తమ కనబరిచిన క్రీడాకారులకు మంత్రి బహుమతులను ప్రదానం చేశారు. దేశవ్యాప్తంగా క్రీడా సంస్కృతిని ప్రతీస్థాయిలో విస్తరించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని బండి సంజయ్ తెలిపారు. ముఖ్యంగా పోలీసు, పారామిలిటరీ సిబ్బందిలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు "ఖేలో ఇండియా", "ఫిట్ ఇండియా మూవ్‌మెంట్" వంటి జాతీయ కార్యక్రమాలను నిర్వహిస్తోందని చెప్పారు.

రేవంత్ పాలనలో పెరిగిన వలసలు: హరీశ్‌రావు



హైదరాబాద్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రేవంత్‌రెడ్డి 22నెలల పాలనలో అనూహ్యంగా వలసలు పెరిగాయని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు ఆరోపించారు. గల్ఫ్‌లోని జోర్డాన్‌లో చిక్కుకుని స్వగ్రామాలకు తిరిగిరాలేక ఆవేదన చెందుతున్న 12మంది తెలంగాణ కార్మికులకు బీఆర్ఎస్ అండగా నిలిచిందన్నారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ద్వారా ప్రయత్నించి కార్మికులను రాష్ట్రానికి తీసుకువస్తున్నట్లు చెప్పారు. జోర్డాన్ బాధిత కార్మికుల ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా వారికోసం జరిపే చెల్లింపులతోపాటు స్వదేశానికి వచ్చేందుకయ్యే విమానటికెట్ల ఖర్చును కూడా తామే భరిస్తున్నట్లు హరీశ్‌రావు చెప్పారు. వారం రోజుల్లో నిజామాబాద్, నిర్మల్, కామారెడ్డి, జగిత్యాల, సిద్దిపేటకు చెందిన 12మంది గల్ఫ్ కార్మికులు తెలంగాణకు చేరుకునేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అన్నివర్గాల ప్రజలను మోసం చేసినట్లుగానే, గల్ఫ్ కార్మికులను కూడా కాంగ్రెస్ మోసం చేసిందని, అభయహస్తం మేనిఫెస్టోలో చెప్పిన గల్ఫ్ కార్మికులు, ఎన్నారైల సంక్షేమబోర్డుపై ఇప్పటికీ అతీగతీలేదని ఆరోపించారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న 'మన శంకర వరప్రసాద్ గారు' సెట్స్‌లో హైదరాబాద్‌కు చెందిన క్రికెటర్ తిలక్ వర్మకు ఘన సత్కారం జరిగింది. ఇటీవలె జరిగిన ఆసియా కప్ ఫైనల్లో పాకిస్థాన్‌పై అద్భుతంగా ఆడి భారత జట్టు విజయానికి దోహదపడిన తిలక్ వర్మను చిరంజీవి అభినందించి, సన్మానించారు. యూనిట్ సభ్యుల కరతాళ ధ్వనుల మధ్య తిలక్ వర్మకు శాలువా కప్పి, ఆ మ్యాచ్‌లోని ఓ ఫొటోని ఫ్రేమ్‌గా బహూకరించారు చిరంజీవి. ఈ కార్యక్రమంలో దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాతలు సాహు గారపాటి, సుస్మిత కొణిదెల పాల్గొన్నారు.

అసురాగమనం



సాయిదుర్గాతేజ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఎస్‌వైజీ (సంబరాల ఏటిగట్టు). రోహిత్ కేపీ దర్శకత్వంలో ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై కె. నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మిస్తున్నారు. సాయిదుర్గతేజ్ పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో 'ఎస్‌వైజీ' చిత్రం నుంచి 'అసుర ఆగమనం పేరుతో ప్రత్యేక వీడియోను మేకర్స్ విడుదల చేశారు. ఒక శక్తిమంతమైన యోధుడి పాత్రలో సాయిదుర్గా తేజ్ కనిపించారు. ఈ సందర్భంగా సాయిదుర్గాతేజ్ మాట్లాడుతూ 'నేను ఈ రోజు ఈ స్థాయిలో ఉండడానికి కారణమైన మా ముగ్గురు మావయ్యలు చిరంజీవిగారు, నాగబాబుగారు, పవన్‌కల్యాణ్ గారికి రుణపడి ఉంటాను. నా కెరీర్లో ఇది చాలా ముఖ్యమైన సినిమా. సర్వస్వం ధారపోశాను. మా నిర్మాతలు ఖర్చుకు వెనుకాడకుండా గ్రాండియర్‌గా నిర్మిస్తున్నారు. తప్పకుండా ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. కె. నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం సాయిదుర్గా తేజ్ అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారు. ఈ సినిమా చాలా పెద్ద హిట్టవ్వాలి అని కోరుకుంటున్నాను' అని చెప్పారు. 'సాయిదుర్గాతేజ్, నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి గారు దర్శకుడిగా నాపైన నమ్మకం ఉంచి భారీ చిత్రాన్ని తెరకెక్కించే అవకాశమిచ్చారు. అందరి సహకారంతో సినిమాను అద్భుతంగా తెరకెక్కిస్తున్నాం' అని రోహిత్ చెప్పారు.



అందరికీ నచ్చే 'డ్యూడ్'

- ప్రదీప్ రంగనాథన్

'హైదరాబాద్ నాకు మరో కుటుంబం. నా సినిమాలన్నీ గొప్పగా ఆదరించారు. మీ అభిమానానికి కృతజ్ఞతలు. 'లవ్ టుడే', 'డ్రాగన్' లానే 'డ్యూడ్' కూడా అందరికీ నచ్చుతుంది. డైరెక్టర్ కీర్తి చాలా మంచి సినిమా తీశారు. భవిష్యత్తులో అతను ఎంత పెద్ద డైరెక్టర్ అవుతారో సినిమా చూసిన తర్వాత మీరే చెప్తారు' అని అన్నారు కథానాయకుడు ప్రదీప్ రంగనాథన్. ఆయన ప్రధాన పాత్రలో కీర్తీశ్వరన్ తెరకెక్కించిన చిత్రం 'డ్యూడ్'. ప్రదీప్ సరసన మమిత బైజు కథానాయికగా నటించగా, శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. మైత్రీ మూవీ మేకర్స్ బేనర్‌పై నవీన్ యెర్నేని, వై.రవి శంకర్ నిర్మించారు. సినిమా నేడు విడుదలవుతోన్న సందర్భంగా చిత్ర బృందం ప్రీరిలీజ్ వేడుక నిర్వహించింది. చిత్ర దర్శకుడు కీర్తీశ్వరన్ మాట్లాడుతూ 'నేను స్క్రిప్ట్ రాసుకొని దర్శకుడు కావాలనుకున్న తర్వాత చెన్నై మొత్తం తిరిగాను. చివరకు జూబ్లీహిల్స్‌లో నా ప్రయాణం మొదలైంది. తెలుగు ప్రేక్షకుల గురించి ప్రదీప్ చాలా ఆలోచిస్తారు. ఈ సినిమాలో ఒక విభిన్నమైన మమితను చూస్తారు. దీపావళితోపాటు సెలబ్రేట్ చేసుకొనేలా ఈ చిత్రం ఉంటుంది' అని అన్నారు. 'సినిమా తప్పకుండా అందర్నీ అలరిస్తుంది' అని చిత్ర నిర్మాతలు నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ అన్నారు. కార్యక్రమంలో దర్శకులు హను రాఘవపూడి, బుచ్చిబాబు సాన, సాయి రాజేశ్, రాహుల్ సాంకృత్యన్, మహేశ్, శివ నిర్వాణ తదితరులు పాల్గొన్నారు.

కోర్టుకు రావాల్సిందే



ఫిల్మ్ నగర్‌లోని దక్కన్ కిచెన్ కూల్చివేత కేసుపై నాంపల్లి కోర్టులో గురువారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా హీరోలు దగ్గుబాటి వెంకటేశ్, రానా, నిర్మాత సురేశ్‌బాబు, అభిరామ్ నవంబరు 14న తప్పని సరిగా న్యాయస్థానానికి రావాలని కోర్టు ఆదేశించింది. పర్సనల్ బాండ్ సమర్పించేందుకు హాజరు కావాల్సిందేనని స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాలను ధిక్కరించి దక్కన్ హోటల్ కూల్చివేశారన్న ఆరోపణలతో వెంకటేశ్, రానా, సురేశ్‌బాబు, అభిరామ్‌పై గతంలో కేసు నమోదైన సంగతి తెలిసిందే.


అభిమానులు గర్వించే సినిమాలు చేస్తా

- కిరణ్ అబ్బవరం



'ఈ సినిమా చేయాలని అనుకున్నప్పుడే దీపావళికి విడుదల చేయాలని నిర్ణయించుకున్నాం. ఖచ్చితంగా కుటుంబ సభ్యులందరూ కలసి చూసే చిత్రం అవుతుందని నమ్మాం. మేము అనుకున్న దానికంటే సినిమా బాగా వచ్చింది. నన్నూ, మా చిత్రబృందాన్ని నమ్మండి. ఈ దీపావళి పండుగ 'కె.ర్యాంప్'తో మరింత సరదాగా ఉంటుంది. ఇకపై నా అభిమానులు గర్వపడేలా సినిమాలు చేస్తా' అని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన హీరోగా జైన్స్ నాని తెరకెక్కించిన చిత్రమిది. యుక్తి తరేజా కథానాయిక. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బేనర్లపై రాజేశ్ దండా, శివ బొమ్మక్ నిర్మించారు. ఈ నెల 18న విడుదలవుతోన్న సందర్భంగా గురువారం చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. జైన్స్ నాని మాట్లాడుతూ 'సినిమా క్లైమాక్స్‌లో ఒక చిన్న ట్విస్ట్ ఉంటుంది. మంచి సందేశం కూడా ఉంటుంది. అన్ని వాణిజ్య హంగులతో తెరకెక్కించాం. కిరణ్ అబ్బవరం పాత్రచిత్రణ సరికొత్తగా ఉంటుంది. ఇంతకు ముందెన్నడూ చేయని పాత్రను ఈ చిత్రంలో పోషించారు. ప్రచార చిత్రాలతోనే ప్రేక్షకుల్లో అంచనాలు ఏర్పడ్డాయి. సినిమా కూడా అదే స్థాయిలో ఉంటుంది' అని చెప్పారు. రాజేశ్ దండా మాట్లాడుతూ 'ఈ సినిమాను 47 రోజుల్లో పూర్తి చేశాం. కేరళలో ఆహ్లాదకరమైన వాతావరణంలో చిత్రీకరణ చేశాం. సెట్‌లో ప్రతి రోజూ నవ్వుకున్నాం. సెట్‌లో నవ్వించిన ఏ సినిమా కూడా సక్సెస్ విషయంలో గురి తప్పలేదు. 'కె- ర్యాంప్' కూడా మంచి విజయాన్ని అందుకుంటుంది' అని ఆకాంక్షించారు. సీనియర్ నటుడు వీకే నరేశ్ మాట్లాడుతూ 'ఈ సినిమా చూసిన తర్వాత అందరూ మహేశ్ బాబు, అల్లు అర్జున్, నాని తర్వాత కిరణ్ పేరే చెబుతారు. చేతన్ భరద్వాజ్ మంచి సంగీతం అందించారు. భవిష్యత్తులో జైన్స్ నాని పెద్ద దర్శకుడు అవుతాడు' అని అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకులు విజయ్ కనకమేడల, వీఐ ఆనంద్, రామ్ అబ్బరాజు, సుబ్బు, నటుడు సాయికుమార్, హీరోయిన్లు విమలా రామన్, కావ్యా జెత్మలానీ, సంగీత దర్శకుడు చేతన్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.


నవంబర్‌లో కొత్త షెడ్యూల్



బాలీవుడ్‌లో వరుస విజయాలతో జోరు చూపుతున్నారు కార్తీక్ ఆర్యన్. ఆయన కథానాయకుడిగా అనురాగ్ బసు దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. ముందు అనుకున్న ప్రకారం ఈ చిత్రం ఈ ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. అయితే చిత్రీకరణలో తీవ్ర జాప్యంతో విడుదల వాయిదా పడుతూ వస్తోంది. తాజాగా చిత్రబృందం ఓ అప్‌డేట్‌ను పంచుకుంది. 'ఈ సినిమా కోసం కార్తీక్ ఆర్యన్ ఇంకా 45 రోజుల పాటు చిత్రీకరణలో పాల్గొనాల్సి ఉంది. నవంబర్ తొలి వారంలో ముంబైలో చిత్రీకరణ ఆరంభిస్తాం. వేసవిలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని తెలిపింది.

ఇలాంటి విభిన్న చిత్రాలను ప్రోత్సహించాలి

-సాయి రాజేశ్



అజిత్ మోహన్, రాజు శివరాత్రి, మోనికా బుసం కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'గోపీ గాళ్ల గోవా ట్రిప్'. రోహిత్, క్యాంప్ శశి తెరకెక్కిస్తున్నారు. రాస్తా ఆర్ట్స్, ఔరా ఉలిస్ ఆర్ట్స్, అవ్వల్ నంబర్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దర్శకుడు సాయి రాజేశ్ మాట్లాడుతూ 'రోహిత్, శశి తీసే సినిమాలు చాలా బావుంటాయి. కొత్త తరహా కథాంశంతో వస్తున్న చిత్రమిది. తప్పకుండా అందరూ ప్రోత్సహించాలి' అని కోరారు. 'రోడ్ ట్రావెల్ నేపథ్యంలో సాగే చిత్రమిది' అని క్యాంప్ శశి తెలిపారు.

స్కై సొల్యూషన్స్ సీఈవోకు గ్లోబీ అవార్డు



అనిల్ బోయినపల్లి

హైదరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన అనిల్ బోయినపల్లి.. 2025 లీడర్‌షిప్ గ్లోబీ అవార్డుకు ఎంపిక య్యారు. ఐటీ రంగంలో సాధించిన విజయాలకు గాను గ్లోబీ సంస్థ ప్రతి ఏటా ఈ అవార్డును అందజేస్తుంది. అనిల్ స్థాపించిన స్కై సొల్యూషన్స్ సంస్థ అమెరికాలోని వర్జీనియా కేంద్రంగా వివిధ దేశాలకు విస్తరించింది. ఏఐ, సైబర్ సెక్యూరిటీ రంగంలో ఆ సంస్థ సీఈవోగా అనిల్ సాధించిన విజయాలకు గాను ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేశామని గ్లోబీ సంస్థ తెలిపింది.

లారీలు అమ్మి సీఎం ఫండ్‌కు రూ.2 కోట్లు ఇచ్చా

» ఎవరి దగ్గర రూపాయి తీసుకోలేదు: ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తన తొమ్మిది లారీలు అమ్మి ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.2 కోట్లు చెక్కు రూపంలో అందజేశానని, ఇందుకోసం తాను ఎవరి వద్ద రూపాయి కూడా వసూలు చేయలేదని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. గురువారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సంఘటన్ సృజన్ అభియాన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.2 కోట్ల విరాళం అందజేతపై స్థానిక వాట్సాప్ గ్రూపుల్లో వస్తున్న విమర్శలపై ఆయన ఉద్వేగంగా మాట్లాడారు. తన కుమారుడి వివాహం తర్వాత రిసెప్షన్ కోసం తన పేరిట, కుమారుడు, భార్య పేరున ఉన్న తొమ్మిది లారీలు విక్రయించగా రూ.1.85 కోట్లు వచ్చాయన్నారు. అదే సమయంలో యూరియా అందక రైతులు ఇబ్బందులు పడుతుండటంతో వారి సంక్షేమం కోసం వేడుకకు సిద్ధం చేసిన నగదును సీఎం రేవంత్‌రెడ్డికి చెక్కు రూపేణా అందజేశామని తెలిపారు. తాను అక్రమంగా సంపాదించానని వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం చేస్తున్నారని.. ఎవరి వద్ద వసూళ్లకు పాల్పడలేదని, ఈ విషయమై ఏ దేవుని ముందైనా ప్రమాణం చేయడానికి సిద్ధమన్నారు. ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వమ్ము చేయనని స్పష్టం చేశారు. తన కుటుంబ సభ్యుల పేరున గతంలో ఉన్న 162 వాహనాల్లో ఇప్పటికే 92 లారీలను విక్రయించానన్నారు. వ్యక్తిగత ప్రచారాలతో పార్టీపై విషం చిమ్మవద్దన్నారు. పార్టీ నిబంధనలకు వ్యతిరేకంగా పని చేసే వారెవరో తనకు తెలుసునని, అలాంటి వారికి తాను మద్దతు ఇవ్వబోనని లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు.

విద్యాసంస్థలను కొడంగల్ నుంచి తరలించొద్దు

» నిరసనగా కొడంగల్‌లో వ్యాపార సముదాయాల బంద్

» ర్యాలీ నిర్వహించిన జేఏసీ నాయకులు, స్థానికులు

కొడంగల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కొడంగల్‌కు మంజూరైన మెడికల్, వెటర్నరీ కళాశాలలు, ఇంటిగ్రేటెడ్ గురుకులాలను ఇతర ప్రాంతాలకు తరలింపునకు నిరసనగా గురువారం కొడంగల్ బంద్ నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ మండలంలోని అప్పాయిపల్లి శివారులో మెడికల్, వెటర్నరీ కళాశాలల ఏర్పాటు కోసం భూసేకరణతో పనులు ప్రారంభమయ్యాయి. అలాగే రాష్ట్రంలో మోడల్‌గా ఇంటిగ్రేటెడ్ గురుకులాల ఏర్పాటుకు పాత కొడంగల్‌లో భూ సేకరణ చేపట్టారు. అయితే, విద్యాసంస్థల నిర్మాణ పనులను 20 రోజుల క్రితం నిలిపి వేస్తూ కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలం లగచర్లకు తరలిస్తున్నారన్న ప్రచారం ప్రారంభమైంది. దీంతో విద్యాసంస్థలు కొడంగల్‌లోనే ఏర్పాటు చేసే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకోవాలని మొదటగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు 'కడా' ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి, హైదరాబాద్‌కు వెళ్లి సీఎం కార్యాలయంలో వినతి పత్రం అందించారు. తాజాగా కొడంగల్ అభివృద్ధి, పరిరక్షణ ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం కొడంగల్ బంద్ చేపట్టారు.

ఓటుకు నోటు కేసు నవంబర్ 3కు వాయిదా

న్యూఢిల్లీ, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): ఓటుకు నోటు కేసు విచారణను సుప్రీంకోర్టు మరోసారి వాయిదా వేసింది. అవినీతి నిరోధక చట్టం కింద కాకుండా ఎన్నికల చట్టాల నియమావళి ప్రకారం కేసు విచారణను చేపట్టాలని కోరుతూ 2021 జూలై 22న రేవంత్‌రెడ్డి, ఈ కేసులో తన పేరును తొలగించాలని కోరుతూ 2021 ఏప్రిల్ 13న సండ్ర వెంకటవీరయ్య సుప్రీంకోర్టులో వేర్వేరుగా స్పెషల్ లీవ్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ రెండు పిటిషన్లపై వరుసగా మంగళ, బుధవారాల్లో విచారణ జరిపిన జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌ల ధర్మాసనం.. గురువారం మళ్లీ విచారణకు రాగానే నవంబర్ 3న వాదనలు వింటామని చెబుతూ వాయిదా వేసింది.

రేవతి, తన్వి యాదవ్ కస్టడీ ఉత్తర్వులపై సుప్రీం స్టే

న్యూఢిల్లీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మహిళా జర్నలిస్టులు రేవతి, తన్వి యాదవ్‌లను కస్టడీలోకి తీసుకుని విచారించేందుకు అనుమతిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే విధించింది. సామాజిక మాధ్యమాల్లో సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వీడియోలు పోస్టు చేసిన వ్యవహారంలో వీరిద్దరిపై కేసు నమోదైంది. ఈ ఏడాది మార్చి 17న ట్రయల్ కోర్టు వీరిద్దరికీ బెయిల్ మంజూరు చేసింది. అయితే వారిద్దరి బెయిల్ రద్దు చేయకుండానే పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారించేందుకు హైకోర్టు అనుమతిచ్చింది. ఈ తీర్పును రేవతి, తన్వి యాదవ్‌లు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్‌పై గురువారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

హైదరాబాద్‌లో పోల్ మౌంటెడ్ ట్రాన్స్‌ఫార్మర్లు !

» భూమికి 10 అడుగుల ఎత్తులో ఏర్పాటు

» భద్రత, పరిశుభ్రత.. తక్కువ వ్యయం

» గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ఎస్పీడీసీఎల్ సీఎండీ



అంబర్‌పేట్ పోలీస్ లైన్స్‌లో ఏర్పాటు చేసిన పోల్ మౌంటెడ్ ట్రాన్స్‌ఫార్మర్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరంలో పోల్ మౌంటెడ్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ పచ్చజెండా ఊపారు. ఇకపై ట్రాన్స్‌ఫార్మర్లను ఇదే విధానంలో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలో విద్యుత్ పంపిణీ వ్యవస్థను ఆధునికీకరించడంలో భాగంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఇచ్చిన సూచనల మేరకు అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటులో మార్పులు చేశారు. గతంలో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉండేవి. ఈ పద్ధతిలో కాంక్రీట్ ఫౌండేషన్‌తో రోడ్డుకు దగ్గరగా ఏర్పాటు చేసే ట్రాన్స్ ఫార్మర్లతో పాదచారులకు, వాహనదారులకు ఇబ్బందికరంగా ఉండేది. అంతేకాకుండా ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు చేరి ప్రమాదకరంగా మారుతున్నాయి. దాంతో కొన్ని సందర్భాలలో షార్ట్‌సర్క్యూట్‌లు, లీకేజీలతో ప్రమాదాలు సైతం జరిగాయి. ఈ సమస్యలను పరిష్కరించడంలో భాగంగా కొత్తగా పోల్ మౌంటెడ్ పద్ధతిలో 10 అడుగుల ఎత్తులో ఇనుప స్తంభాలపై డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాదచారులకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందీ ఉండదు. అంతేకాకుండా చెత్త, ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు చేరవు. కాంక్రీట్ ఫౌండేషన్‌కు బదులుగా స్తంభాలపై ఏర్పాటు చేయడం వల్ల ఖర్చు కూడా తగ్గుతుంది. అంబర్‌పేట్ పోలీస్ లైన్స్‌లో ఏర్పాటు చేసిన నమూనాను గురువారం ముషారఫ్ ఫారూఖీ పరిశీలించి, కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్‌లను ఇదే విధంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ డా. నరసింహులు, చీఫ్ ఇంజనీర్ మెట్రో ప్రభాకర్, సూపరింటెండింగ్ ఇంజనీర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ గెలుపు.. దేశ కాంగ్రెస్ భవిష్యత్తును మారుస్తుంది



బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్న ఆదిలక్ష్మికి కండువా కప్పుతున్న మీనాక్షి నటరాజన్. చిత్రంలో మహేశ్ గౌడ్, వివేక్ తదితరులు

» కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్

» ఈ ఉప ఎన్నికతో బీఆర్ఎస్ శకం ముగిసినట్లే..: మహేశ్ గౌడ్

బంజారాహిల్స్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుపు దేశ కాంగ్రెస్ రాజకీయ భవిష్యత్తును మారుస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ వ్యాఖ్యానించారు. సోమాజిగూడ డివిజన్ బూత్‌స్థాయి కమిటీ సమావేశం శాలివాహననగర్ కమ్యూనిటీహాల్‌లో, రహ్మత్‌నగర్ డివిజన్ బూత్‌స్థాయి కమిటీ సమావేశం మెహబూబ్ ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించారు. ఆయా సమావేశాలకు మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు వివేక్ వెంకటస్వామి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరవ్వగా.. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్, స్థానిక నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీనాక్షి మాట్లాడుతూ.. ఈ ఉప ఎన్నికలో నవీన్‌యాదవ్ ఒక్కడే పోటీ చేయడం లేదని, కాంగ్రెస్ శ్రేణులంతా కూడా పోటీలోనే ఉన్నారన్నారు. కాంగ్రెస్ విజయానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉపఎన్నికతో బీఆర్ఎస్ శకం ముగుస్తుందని, ఈ సీటు కూడా కాంగ్రెస్ ఖాతాలో పడటం ఖాయమని చెప్పారు. ప్రజాభిప్రాయం మేరకు నవీన్‌యాదవ్‌కు టికెట్ ఇచ్చినట్లు తెలిపారు. కాంగ్రెస్ గెలిస్తే నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనంతరం అభివృద్ధిలో వేగం పెరిగిందని తుమ్మల అన్నారు. బీసీ రిజర్వేషన్ల ద్వారా సామాజిక న్యాయం చేయాలని ప్రభుత్వం భావిస్తే విపక్షాలు దాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని పొన్నం మండిపడ్డారు. కాగా, యూసుఫ్‌గూడ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకురాలు ఆదిలక్ష్మి మరికొంత మంది కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. వారికి మీనాక్షి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

ఆ ఓటర్ల పేర్లు ఏఎస్‌డీలోకి

చనిపోయిన, చిరునామా మారిన ఓట్లన్నీ ఆబ్‌సెంట్, షిఫ్ట్, డెత్ జాబితాలోకి..

ఫిర్యాదులపై క్షేత్రస్థాయి పరిశీలన

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు సంబంధించి నకిలీ ఓట్ల అంశంపై ఎన్నికల విభాగం దృష్టి సారించింది. ఒకే వ్యక్తికి రెండు, మూడు ఓట్లు ఉండడం, ఒకే ఇంటి నెంబరులో పదుల సంఖ్యలో ఓట్లు ఉండడం, నియోజకవర్గానికి సంబంధం లేని వారి పేర్లు జాబితాలో ఉండడంపై రాజకీయ పార్టీలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఈ అంశాలపై బీఆర్ఎస్ ఇప్పటికే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడమే కాకుండా న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. అయితే, ఆయా ఫిర్యాదులపై దృష్టి సారించిన జీహెచ్‌ఎంసీ ఎన్నికల విభాగం క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టింది. ఫిర్యాదుల్లో పేర్కొన్న ఓటర్ల చిరునామాలకు వెళ్లి బూత్ లెవల్ ఆఫీసర్లు, సిబ్బంది విచారణ చేస్తున్నారు. సదరు ఓటరు ఆ చిరునామాలో ఉంటున్నారా? ఓటరు జాబితాలో పేరు ఎప్పుడు నమోదు చేసుకున్నారు ? తదితర విషయాలను ఆరా తీస్తున్నారు. ఒకే వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ ఓట్లు ఉన్న వివరాలూ సేకరించారు. వేర్వేరు చిరునామాలతో కొందరి పేరిట రెండు, మూడు ఓట్లు నమోదైనట్టు గుర్తించారు. ఇలాంటి ఓటర్లను ఎస్ఏడీ(ఆబ్‌సెంట్ షిఫ్ట్ డెత్) కేటగిరీలోకి మారుస్తామని ఎన్నికల విభాగం అధికారులు వెల్లడించారు. దీంతో ఆయా వ్యక్తులు ఓటు వేసే అవకాశం ఉండదు. ఎవరైనా వ్యక్తికి నియోజకవర్గంలోని మూడు ప్రాంతాల్లో ఓటు హక్కు ఉన్నట్టు తేలితే.. ఆ వ్యక్తి ప్రస్తుతం ఉంటున్న చిరునామా ప్రకారం పేరు కొనసాగించి మిగిలిన రెండు చోట్ల దానిని ఏఎస్‌డీలోకి చేరుస్తారు. అదే, ఆ ఓటరు జాబితాలో పేర్కొన్న ఏ చిరునామాలోనూ లేనట్టు తేలితే మూడు ప్రాంతాల్లో ఓట్లు ఏఎస్‌డీలోకి వెళతాయి. మరణించిన వారి పేర్లనూ ఏఎస్‌డీలో చేరుస్తారు. సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతే ఏఎస్‌డీ జాబితాలో చేర్చడంపై నిర్ణయం తీసుకుంటారు. మొత్తం ఓటరు జాబితా పునఃపరిశీలన ప్రస్తుతం అసాధ్యం కాబట్టి తమకు అందిన ఫిర్యాదులపై మాత్రమే అధికారులు పరిశీలన చేపడుతున్నారు. కాగా, ఫిర్యాదులు వచ్చిన వాటిల్లో కొన్ని 2023 నుంచి జాబితాలో ఉన్న పేర్లకు సంబంధించినవేనని ఓ అధికారి తెలిపారు.

పెరిగిన ఓటర్లు 15 వేలు !

ఎన్నికల సంఘం సెప్టెంబరు 30న ప్రకటించిన తుది జాబితా ప్రకారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య 3.98 లక్షలకుపైగా ఉంది. ఈ నెల 11వ తేదీ వరకు కొత్త ఓటర్ల నమోదుకు దరఖాస్తులు స్వీకరించారు. వాటి పరిశీలన అనంతరం విడుదలయ్యే అనుబంధ జాబితాలో ఓటర్ల సంఖ్య మరో రెండు నుంచి మూడు వేలు పెరిగే అవకాశముంది. మొత్తంగా జూబ్లీహిల్స్‌లో ఓటర్ల సంఖ్య నాలుగు లక్షలు దాటనుంది. కాగా, తుది జాబితాలో 3,98,982 మంది ఓటర్లు ఉండగా.. 2023 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే దాదాపు 13వేల ఓట్లు పెరిగాయని ఎన్నికల విభాగం చెబుతోంది. లోక్‌సభ ఎన్నికలతో(3,87,056) పోలిస్తే ఆ సంఖ్య 11 వేలకు పైగా ఉంది. అనుబంధ జాబితా ప్రకటిస్తే ఈ సంఖ్య 15వేలకు చేరే అవకాశముంది.

జూబ్లీహిల్స్‌లో రకుల్, సమంత, తమన్నాకు ఓటు హక్కు!

» నెట్‌లో ముగ్గురి నటీమణుల ఓటర్ ఐడీలు వైరల్.. నకిలీవన్న అధికారులు



జూబ్లీహిల్స్ ఓటర్ల జాబితా వివాదాస్పదమవుతున్న నేపథ్యంలో ఈ అంశానికి సంబంధించి గురువారం కొత్త అంశం తెరపైకొచ్చింది. ప్రముఖ సినీనటులు రకుల్ ప్రీత్‌సింగ్, సమంత, తమన్నా పేరిట ఫొటోలతో కూడిన ఓటర్ ఐడీ సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమైంది. ముగ్గురి ఐడీల్లోనూ ఒకే ఇంటి చిరునామా (ఇంటి నంబర్ 8-2-120/110/4) ఉండటం గమనార్హం. ముగ్గురి ఐడీలతో కూడిన ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతుండటంతో జీహెచ్‌ఎంసీ ఎన్నికల విభాగం వివరాలను పరిశీలించింది. ముగ్గురు నటీమణుల పేర్లతో ఉన్నవి ఫేక్ ఓటర్ ఐడీలు అని తేల్చింది. కాగా నకిలీ ఓటర్ల జాబితా/ఐడీలను ప్రచారం చేయడాన్ని జిల్లా ఎన్నికల అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. నకిలీ ఓటర్ జాబితా ఎక్కడ తయారు చేశారు? తయారు చేసిందెవరు? అని తేల్చేందుకు చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఓ అధికారి తెలిపారు.

జూబ్లీహిల్స్ ఓటర్ల జాబితాలో అక్రమాలు.. పిటిషన్‌పై విచారణ ముగింపు

ఫిర్యాదును పరిశీలిస్తామని ఈసీ చెప్పినందున ప్రత్యేకంగా ఉత్తర్వులు అవసరం లేదన్న హైకోర్టు



హైదరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను హైకోర్టు ముగించింది. పిటిషనర్లు ఇచ్చిన ఫిర్యాదులను చట్టప్రకారం పరిశీలించి, పరిష్కరిస్తామని ఎన్నికల కమిషన్ చెబుతున్న నేపథ్యంలో ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేయాల్సిన అవసరం లేదని పేర్కొంది. నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. జూబ్లీహిల్స్ ఓటర్ల జాబితాలో బోగస్ ఓట్లు ఉన్నాయంటూ హైకోర్టులో మాగంటి సునీత, కేటీఆర్ గురువారం లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేయగా.. చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది దామ శేషాద్రినాయుడు వాదనలు వినిపిస్తూ.. 1942 మందికి అదే నియోజకవర్గంలో రెండు చోట్ల ఓట్లు ఉన్నాయని, ఇతర నియోజకవర్గాలకు చెందిన 12 వేల మందికి ఇక్కడ ఓట్లు ఉన్నాయని, తెలిపారు. ఈ తరహా అక్రమాలపై ఫిర్యాదు చేసినప్పటికీ ఎన్నికల అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ తరఫు సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయి వాదిస్తూ జూబ్లీహిల్స్ ఓటర్ల జాబితాను జూలైలోనే ప్రచురించి, అభ్యంతరాలు కోరామని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత అభ్యంతరాలు లేవనెత్తుతున్నారని పేర్కొన్నారు. అయినప్పటికీ పిటిషనర్ల ఫిర్యాదును చట్టబద్ధంగా పరిశీలించి పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత జోక్యం చేసుకోవడం సాధ్యం కాదని.. పిటిషనర్ల ఫిర్యాదును చట్టబద్ధంగా పరిశీలిస్తామని ఈసీ చెబుతున్న నేపథ్యంలో ఎలాంటి ఆదేశాలు అవసరం లేదని పేర్కొంటూ విచారణను ముగించింది.



దీపక్ రెడ్డికి బీఫాం అందజేసిన రాంచందర్‌రావు

హైదరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు గురువారం బీఫాం అందజేశారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ విజయం ఖాయమని అన్నారు. దోచుకునే పార్టీలకు జూబ్లీహిల్స్ ఓటర్లు గుణపాఠం చెప్పనున్నారని స్పష్టం చేశారు. 21న దీపక్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.

కాంగ్రెస్ డీఎన్ఏలోనే అవినీతి

» కొండా సురేఖ వివాదంపై సమగ్ర విచారణ చేపట్టాలి: రాంచందర్‌రావు

హైదరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ డీఎన్ఏలోనే అవినీతి ఉందని, ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అవినీతి రాజ్యమేలుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ధ్వజమెత్తారు. మంత్రి కొండా సురేఖ వివాదంలో ఆమె కుమార్తె చేసిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. సిమెంట్ కంపెనీల యాజమాన్యాలను మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్‌డీ సుమంత్ బెదిరించినట్టుగా ఆరోపణలున్నాయని, ఈ ఎపిసోడ్‌లో ఇతర మంత్రులు, ముఖ్యమంత్రి అనుచరుల పేర్లు వినిపడుతున్న నేపథ్యంలో ఆ పార్టీ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు తమ ఆస్తులు, బినామీల అక్రమాలపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరోవైపు.. పదేళ్ల పాటు అధికారంలో ఉండి దోచుకున్న సొమ్మును పంచుకునే క్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొట్లాడుకుంటున్నారని దుయ్యబట్టారు. దోచుకునే పార్టీలను, తుపాకీ పట్టుకుని బెదిరింపులకు పాల్పడే వారిని తిరస్కరించాలని జూబ్లీహిల్స్ ప్రజలను కోరారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్, గతంలో ఎంఐఎం నుంచి పోటీ చేశారని గుర్తు చేశారు. అంతకుముందు జూబ్లీహిల్స్ నియోజకవర్గ సమన్వయ సమావేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అధ్యక్షతన జరిగింది. పోలింగ్ బూత్‌స్థాయిలో సమన్వయం, ప్రచార కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. ప్రతి కార్యకర్త అంకిత భావంతో పనిచేయాలని రాంచందర్‌రావు సూచించారు. సమావేశంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎంపీ రఘునందన్‌రావు, సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సమావేశం తర్వాత రఘునందన్‌రావు మీడియాతో మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఒకరు కన్నీళ్లతో మరొకరు కర్రలతో ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కన్నీళ్లకు కరిగినా, కర్రలకు భయపడినా భాగ్యనగరం భవిష్యత్తు మూసీలో కలుస్తుందని స్పష్టం చేశారు.

ఒకేసారి 3 వ్యవసాయ కళాశాలలు!

» మంజూరు చేయడం చరిత్రలో మొదటిసారి

» ప్రతి కళాశాలకు 24కోట్ల చొప్పున నిధులు

» సీఎం, కేబినెట్ మంత్రులకు కృతజ్ఞతలు: తుమ్మల

» ఎర్త్ సైన్సెస్ వర్సిటీకి మన్మోహన్ సింగ్ పేరు ఖరారు



హైదరాబాద్/కొత్తగూడెం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విశ్వవిద్యాలయం స్థాపించినప్పటి నుంచి ఒకేసారి మూడు వ్యవసాయ కళాశాలలను మంజూరు చేయటం చరిత్రలో ఇదే మొదటిసారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కళాశాలల మంజూరుతో పాటు అవసరమైన నిధులు, సిబ్బంది నియామకంపై ఏకకాలంలో ఆమోదం తెలపటంపై తుమ్మల హర్షం వ్యక్తం చేశారు. ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో మరో మూడు కళాశాలలు చేరినట్లు తెలిపారు. ఇప్పటివరకు వ్యవసాయ కళాశాలలు లేని ఉమ్మడి నిజామాబాద్, నల్లగొండ పాటు వికారాబాద్ జిల్లాలో ఈ విద్యా సంవత్సరం నుంచే కొత్త కళాశాలలు ప్రారంభించేందుకు కేబినేట్ పచ్చజెండా ఊపినట్లు తుమ్మల వెల్లడించారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం మగ్దూంనగర్‌లో సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం అప్పాయిపల్లిలో జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న 65 ఎకరాల విస్తీర్ణంలో మరో వ్యవసాయ కళాశాలను స్థాపిస్తున్నట్లు తెలిపారు. మూడో కళాశాలను నిజామాబాద్ జిల్లాలో ఏర్పాటు చేస్తున్నట్లు తుమ్మల వెల్లడించారు. ప్రతి వ్యవసాయ కళాశాలకు సుమారు రూ.124 కోట్ల చొప్పున నిధులతోపాటు బోధన, బోధనేతర సిబ్బందిని మంజూరుచేస్తూ కేబినేట్ నిర్ణయం తీసుకున్నట్లు తుమ్మల వెల్లడించారు. కాగా, దేశంలోనే మొట్టమొదటిదైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఎర్త్‌సైన్సెస్ యూనివర్సిటీకి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పేరు ఖరారు చేస్తూ రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. సుమారు 300 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఈ వర్సిటీకి సంబంధించి ఇప్పటికే రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయగా.. తాజాగా మన్మోహన్ సింగ్ పేరును ఖరారు చేయడంపై ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్సిటీ ఏర్పాటుకు మొదలు నుంచి మంత్రి తుమ్మల కీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి జిల్లాకు విశ్వవిద్యాలయం దక్కడంతో తన కల సాకారమైందన్నారు. ప్రభుత్వ నిర్ణయం తెలంగాణ విద్యా రంగానికి కొత్త దిశను చూపుతుందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా విద్యార్థులకు మంచి విద్యావకాశాలు లభిస్తాయస్నాయన్నారు. ఈ విశ్వవిద్యాలయంలో జియోకెమిస్ట్రీ, జియోఫిజిక్స్, ప్లానెటరీ జియాలజీ, స్ట్రక్చరల్ జియాలజీ, పర్యావరణ భూగర్భశాస్త్రం వంటి కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. భూగర్భ వనరుల పరిశోధనకు, దేశ సుస్థిర అభివృద్ధికి ఇది ప్రధాన కేంద్రమవుతుందని నిపుణులు భావిస్తున్నారు.

సామలకు ప్రత్యేక మైక్రోబియం

మొక్కల వేర్ల వద్ద ఒకేరకమైన సూక్ష్మజీవులు

» పది పూర్వతరాల మొక్కల్లో హెచ్‌సీయూ పరిశోధన

» అంతర్జాతీయ అధ్యయనంలో భాగంగా పరిశీలన

» క్లిష్ట వాతావరణాన్ని తట్టుకుని, బాగా ఎదిగేలా పంటల అభివృద్ధికి వీలు

» జన్యు మార్పిడి అవసరం లేకుండానే మంచి దిగుబడి



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి జన్యుమార్పిడి అవసరం లేకుండానే సామల పంట దిగుబడి పెరిగేందుకు వీలుకల్పించే మైక్రోబియంను హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) శాస్త్రవేత్తలు గుర్తించారు. ప్రతి పంటకు ఒక ప్రత్యేకమైన కొన్ని రకాల ఫంగస్‌లు, బ్యాక్టీరియాలు, ఇతర సూక్ష్మజీవుల సమూహం (మైక్రోబియం), ప్రత్యేకమైన కీటకాలు ఉంటాయి. ఇవి ఆ పంట వేళ్ల వద్ద జీవిస్తూ.. నేల సారాన్ని ఆ మొక్కలు సమర్థవంతంగా పీల్చుకునేందుకు, క్లిష్ట పరిస్థితులను తట్టుకునేందుకు దోహదం చేస్తాయి. అలా స్పెయిన్, ఆస్ట్రేలియా, జర్మనీ, అమెరికా, భారత్ సహా 11 దేశాలకు చెందిన 25 బృందాలు ఆయా దేశాల్లోని ప్రస్తుత పంట రకాలు, వాటి పూర్వపు జాతుల మొక్కల వద్ద మైక్రోబియంను గుర్తించే ప్రాజెక్టును చేపట్టాయి. అందులో భాగంగా హెచ్‌సీయూ ప్రొఫెసర్ పొదిలి అప్పారావు నేతృత్వంలో ప్లాంట్ సైన్సెస్ విభాగానికి చెందిన డాక్టర్ దంతేశ్వరి, డాక్టర్ పీవీఎస్ఆర్ఎన్ శర్మల బృందం సామలపై పరిశోధన చేసి.. మైక్రోబియం వివరాలను గుర్తించింది. ఈ పరిశోధన వివరాలు ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ వర్సిటీకి చెందిన 'ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ మైక్రోబియల్ ఎకాలజీ (ఇస్మే)' కమ్యూనికేషన్స్ జర్నల్‌లో ప్రచురితం అయ్యాయి. కాగా, విజయనగరం, నల్లమల అడవులు, మైసూరు ఇలా రకరకాల నేలలు, వాతావరణ పరిస్థితుల్లో పెరిగిన పది పూర్వజాతుల సామల మొక్కలను పరిశీలించామని.. వాటి మైక్రోబియంపై ఆయా పరిస్థితులు ఎలాంటి ప్రభావం చూపుతున్నాయో గుర్తించామని ప్రొఫెసర్ పొదిలి అప్పారావు తెలిపారు. రైతులు సాగుచేసే సామల పంటలో ఆ సూక్ష్మజీవుల సమూహాన్ని అభివృద్ధి చేస్తే.. దిగుబడి పెరుగుతుందని, క్లిష్ట పరిస్థితులను తట్టుకోగలవని వివరించారు.

4 రోజుల్లో 46 మంది నామినేషన్లు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గ ఉప ఎన్నికలకు భారీ ఎత్తున నామినేషన్లు దాఖలవుతున్నాయి. గత నాలుగు రోజుల్లో 46 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. గురువారం 16 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. 21వ తేదీ వరకు నామినేషన్ల వేసేందుకు గడువు ఉంది. ఇప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత నామినేషన్ దాఖలు చేయగా.. శుక్రవారం కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ నామినేషన్ వేయనున్నారు. శుక్రవారం లేదా సోమవారం బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి నామినేషన్ వేసే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

మెక్సికో ఆర్థికాభివృద్ధి మండలి సలహాదారుగా కృష్ణమూర్తి



హైదరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మెక్సికో ఆర్థికాభివృద్ధి మండలి సలహాదారుగా ప్రముఖ తెలుగు ఐటీ నిపుణుడు కుమార్ కొడువయూర్ కృష్ణమూర్తి నియమితులయ్యారు. హైదరాబాద్‌కు చెందిన ఈయన అమెరికాలో స్థిరపడ్డారు. హెచ్‌పీ లాంటి ప్రముఖ అంతర్జాతీయ కంపెనీల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం అమెరికా కేంద్రంగా ఇన్నోవేషన్ అండ్ డిజిటల్ డెవలప్‌మెంట్ సంస్థకు ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఈయనకు మెక్సికో ప్రభుత్వం కీలక బాధ్యతలు అప్పగించింది. ప్రత్యేక డిజిటల్ టెక్నాలజిస్ట్‌గా, ఐటీ సలహాదారుగా నియమిస్తున్నట్టు మెక్సికో ఆర్థికాభివృద్ధి మండలి కార్యదర్శి లౌరా గొన్‌జాలెజ్ హర్నాండెజ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీ రంగంలో ఆయన అందిస్తున్న సేవలు తమ దేశాభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి

ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత

క్యాబినెట్ భేటీలో కీలక నిర్ణయం



క్యాబినెట్ భేటీ అనంతరం వివరాలు వెల్లడిస్తున్న మంత్రి పొంగులేటి. చిత్రంలో వాకిటి, బలరాం నాయక్

హైదరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికల్లో పోటీకి ఇద్దరు కంటే ఎక్కువ సంతానమున్నవారు అనర్హులన్న నిబంధనను ఎత్తివేసింది. గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో క్యాబినెట్ సమావేశం జరిగింది. గురువారం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో ప్రారంభమైన సమావేశం.. నాలుగు గంటలకుపైగా కొనసాగింది. అనంతరం మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ బలరాం నాయక్‌తో కలిసి రెవెన్యూ, సమాచార-పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాబినెట్ వివరాలను విలేకరులకు వెల్లడించారు. "ప్రస్తుతం ఇద్దరికి మించి పిల్లలున్నవారు స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులనే నిబంధన ఉంది. దీనిని మంత్రి వాకిటి శ్రీహరి మంత్రివర్గ భేటీలో ప్రస్తావించారు. ఈ అంశంపై మంత్రివర్గం పునరాలోచన చేసింది. రాష్ట్రంలో జనాభా నియంత్రణ కట్టుదిట్టంగా అమలవుతున్న తరుణంలో ఈ గరిష్ఠ పిల్లల నిబంధనను అమలు చేయాల్సిన అవసరం లేదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. పైగా పలు వర్గాల నుంచి సీఎం, మంత్రులకు విజ్ఞప్తులు వచ్చాయి. దీంతో, ఈ నిబంధనను ఎత్తివేయాలని క్యాబినెట్ నిర్ణయించింది" అని వివరించారు.

80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

రాష్ట్రంలో ఈ వానాకాలపు సీజన్‌కు సంబంధించి 80 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని సేకరించడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి పొంగులేటి వెల్లడించారు. రైతును రాజును చేయాలన్న ఉద్దేశంతో, ఎన్ని ఆర్థిక ఇబ్బందులు వచ్చినా రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని నిర్ణయించామన్నారు. "ఈ వానాకాలంలో మొత్తం 1.48 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుంది. దేశంలోనే ఇది రికార్డు స్థాయి ఉత్పత్తి. ఇందులో 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని పౌర సరఫరాల విభాగం అంచనా వేసింది. ఇందులో 50 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. మరో 15 లక్షల మెట్రిక్ టన్నులను కూడా సేకరించాలంటూ కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది" అని వివరించారు. ఇక, ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించాలని, వ్యవసాయ, రెవెన్యూ, పౌర సరఫరాలు, రవాణా శాఖల సమన్వయంతో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు ప్రక్రియను చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. ధాన్యానికి చెల్లించే మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు ఇచ్చే రూ.500 బోనస్ కూడా రైతుల ఖాతాల్లో వెంట వెంటనే జమ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయాలని, ప్రతి కొనుగోలు కేంద్రం పర్యవేక్షణ, సమన్వయానికి ఒక్కో అధికారికి ప్రత్యేక బాధ్యతలు అప్పగించాలని మంత్రివర్గం ఆదేశించిందని చెప్పారు.

మెట్రో రైలుపై అధికారుల కమిటీ

హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని మంత్రి పొంగులేటి వివరించారు. మెట్రో పార్ట్-2ఏ, పార్ట్-2బీ విస్తరణకు అడ్డంకిగా మారిన మొదటి దశను.. పీపీపీ మోడల్‌లో నిర్వహిస్తున్న ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకునే విషయమై చర్చించామని, దీని సాధ్యాసాధ్యాలపై లోతుగా అధ్యయనం చేసేందుకు ఉన్నత అధికారుల కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించామని చెప్పారు. సీఎస్ ఛైర్మన్‌గా ఏర్పాటు చేసే ఈ కమిటీలో ఆర్థిక, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శులు, న్యాయ శాఖ కార్యదర్శి, మెట్రో ఎండీ, పట్టణ రవాణా ప్రభుత్వ సలహాదారు సభ్యులుగా ఉంటారన్నారు. అధికారుల కమిటీ తన రిపోర్టును ఆర్థిక వనరుల సమీకరణ క్యాబినెట్ సబ్ కమిటీకి అందిస్తుందని, కమిటీ సిఫారసుల ఆధారంగా మెట్రోను ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకునే విషయంలో తుది నిర్ణయం తీసుకోవాలని మంత్రివర్గం తీర్మానించిందని చెప్పారు.

మంత్రివర్గ సమావేశంలో నిర్ణయాలు ఇవే!

- హుజూర్‌నగర్, కొడంగల్, నిజామాబాద్‌లలో 3 వ్యవసాయ కాలేజీలు.
- రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి డిసెంబరు 9 నాటికి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా డిసెంబరు 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ప్రజాపాలన- ప్రజా విజయోత్సవాలను నిర్వహించాలని నిర్ణయం.
- భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా జూలూరుపాడులోని ఏన్కూర్ మార్కెట్ యార్డ్‌కు పది ఎకరాల భూమిని కేటాయిస్తూ క్యాబినెట్ తీర్మానం.
- నల్సార్ న్యాయ విశ్వ విద్యాలయానికి మరో 7 ఎకరాల భూమి కేటాయింపు.
- నల్సార్ యూనివర్సిటీ అడ్మిషన్లలో ఇప్పుడు తెలంగాణ స్థానికులకు కేటాయించిన 25 శాతం సీట్ల కోటాను 50 శాతానికి పెంచాలని తీర్మానం.
- రాష్ట్రంలో హ్యామ్ మోడ్‌లో మొదటి దశలో రూ.10,547 కోట్లతో 5,566 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణ టెండర్లకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. జాతీయ రహదారులు, జిల్లా, మండల కేంద్రాలు, పర్యాటక ప్రాంతాలు, ఇతర రాష్ట్రాలతో అనుసంధానమయ్యే రహదారులకు సంబంధించి అభివృద్ధి, విస్తరణ పనులు చేపడతారు. కొన్నిటిని రెండు, మరికొన్నిటిని నాలుగు లేన్లుగా విస్తరిస్తారు. ఈ నిర్ణయంపై సంబంధిత శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రోడ్లు దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తాయంటూ ఈ అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి, సహచర మంత్రివర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్‌అండ్‌బీ సర్కిళ్ల వారీగా మొత్తం 32 ప్యాకేజీల్లో పనులు చేపడతామని, మొదటి దశలో 10 ప్యాకేజీ పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు. వారం రోజుల్లో టెండర్ ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. రాబోయే రెండున్నరేళ్లలో అన్ని రోడ్లు పూర్తి చేస్తామని చెప్పారు.
- ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట ఓఆర్ఆర్, ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీ ఫాం రోడ్ వరకు నిర్మించే ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి రక్షణ శాఖ భూములను వినియోగించుకుంటున్నందున.. ప్రత్యామ్నాయంగా 435.08 ఎకరాలను ఆ శాఖకు అప్పగిస్తూ క్యాబినెట్ తీర్మానం చేసింది.
- కృష్ణా-వికారాబాద్ బ్రాడ్ గేజ్ రైలు మార్గం నిర్మాణానికి సంబంధించి 845 హెక్టార్ల భూ సేకరణకు అయ్యే రూ.438 కోట్ల వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు అంగీకరించింది.
- మన్ననూర్-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి మొత్తం వ్యయంలో మూడో వంతు నిధులను రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు అంగీకరిస్తూ తీర్మానం.

పార్టీపరంగా 42 శాతం!

(మొదటిపేజీ తరువాయి)

రెండూ పాత రిజర్వేషన్‌తోనే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని సూచించిన నేపథ్యంలో.. ఆ ప్రకారమే ఎన్నికలకు వెళితే ఎలా ఉంటుందన్న చర్చ చోటు చేసుకుంది. స్థానిక ఎన్నికలు ఆలస్యం కావడం ద్వారా కేంద్రం నుంచి వచ్చే నిధులు పెండింగ్‌లో పడుతున్నాయని, స్థానిక పాలన కూడా కుంటుపడుతోందన్న చర్చ జరిగింది. న్యాయ పోరాటంలో ఫలితం తేలడానికి మరింత సమయం పట్టేందుకూ ఆస్కారం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో, పార్టీపరంగా స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వనున్నట్లు ప్రకటించి.. పాత రిజర్వేషన్ ప్రకారమే ఎన్నికలకు వెళ్లాలన్న అభిప్రాయం వ్యక్తమైంది. మెజారిటీ మంత్రులు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేయగా.. కొద్దిమంది మాత్రం బీసీలకు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు సాధించాకే స్థానిక ఎన్నికలకు వెళ్లాలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో.. కేసు వాదించిన సీనియర్ న్యాయవాదులు, ఇతర న్యాయ నిపుణులతో చర్చించి వారి సలహా మేరకు ముందుకు వెళ్లాలని క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం జరిగింది. ఆదివారం టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ భేటీ నిర్వహించి.. అందులో తుది నిర్ణయం తీసుకోవాలని తీర్మానించారు. అనంతరం, ఈనెల 23వ తేదీనే మరోసారి క్యాబినెట్ సమావేశం కానుంది. అందులో చర్చించి దీనిపై అధికారిక నిర్ణయాన్ని ప్రకటిస్తారు. ఇప్పటి వరకు జరిగిన పార్టీ కమిటీ సమావేశాలన్నింటిలోనూ పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చి స్థానిక ఎన్నికలు త్వరితగతిన నిర్వహించాలని మెజార్టీ నేతలు అభిప్రాయపడిన నేపథ్యంలో.. ఆదివారం జరగనున్న పీఏసీ భేటీలో నిర్ణయం లాంఛనమేనని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

బీసీ కోటాపై 'సుప్రీం' నుంచి వివరాలు అందాక నిర్ణయం: పొంగులేటి

బీసీ రిజర్వేషన్ల పెంపు జీవోపై హైకోర్టు స్టే ఇవ్వడంతో రాష్ట్ర ప్రభుత్వమే సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్‌ను వేసిందని, అయితే.. దానిని సుప్రీం కోర్టు కొట్టివేసిందని, కానీ.. పూర్తి వివరాలు ప్రభుత్వానికి ఇంకా అందలేదని, కోర్టు నుంచి పూర్తి వివరాలు అందిన తర్వాత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని గురువారం క్యాబినెట్ సమావేశం ముగిసిన తర్వాత మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. కోర్టు కామెంట్లు చూసిన తర్వాత, న్యాయపరంగా, మిగతా సంఘాలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కాగా.. ఈనెల 23న మరోసారి క్యాబినెట్ సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించామన్నారు. అందులో బీసీ రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకుంటామన్నారు.



తెలంగాణ స్టేట్ కంప్లైంట్స్ అథారిటీ వెబ్‌సైట్ లోగోను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్. మంత్రి కోమటిరెడ్డి, సీఎస్, డీజీపీ

స్టేట్ పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ వెబ్‌సైట్, లోగోను ఆవిష్కరించిన సీఎం

హైదరాబాద్, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో తెలంగాణ స్టేట్ పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ (ఎస్‌పీసీఏ) వెబ్‌సైట్, లోగోను సీఎం రేవంత్‌రెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, హోంశాఖ స్పెషల్ సీఎస్ సీవీ ఆనంద్, సీజీజీ డీజీ రవిగుప్త, ఇంటలిజెన్స్ ఏడీజీ విజయ్‌కుమార్, ఎస్‌పీసీఏ ఛైర్మన్ రిటైర్డ్ జస్టిస్ శివశంకర్‌రావు, ఎస్‌పీసీఏ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మరో 2 బీఈఎస్ఎస్‌లు!

- మహేశ్వరం, చౌటుప్పల్‌లో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్‌లకు జెన్‌కో నిర్ణయం

హైదరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండు బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్‌లు(బీఈఎస్ఎస్‌లు) ఏర్పాటు చేయాలని జెన్‌కో నిర్ణయించింది. ఒక్కోటి గంటకు 750 మెగావాట్ల చొప్పున సామర్థ్యంతో మహేశ్వరం, చౌటుప్పల్‌లోని 440/220 కేవీ సబ్‌స్టేషన్ల వద్ద ఏర్పాటు చేయాలని జెన్‌కో ప్రతిపాదన. ఈ అంశంపై ఈ నెల 23న జరగనున్న మంత్రివర్గ సమావేశంలో చర్చించనున్నారు. క్యాబినెట్ అనుమతి లభిస్తే జెన్‌కో టెండర్లు పిలవనుంది. వీటికి రూ.3,300 కోట్లు వ్యయం అవుతుందని అంచనా. బీఈఎస్ఎస్‌లకు 40 శాతం వయబిలిటీ గ్యాప్ ఫండ్ (వీజీఎఫ్)ను కేంద్రం సమకూర్చనుంది. కాగా, ఇప్పటికే హైదరాబాద్ శివారులోని శంకర్‌పల్లిలో 250 మెగావాట్ల ప్లాంట్ ఏర్పాటుకు టెండర్ ప్రక్రియ పూర్తయింది. మూడుచోట్లా పూర్తయితే బీఈఎస్ఎస్‌ల విషయంలో దేశంలో తెలంగాణ అగ్రస్థానంలో నిలుస్తుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం సాయంత్రం 5:30 నుంచి రాత్రి 10 గంటల దాకా యూనిట్ కరెంట్ రూ.10 దాకా ఓపెన్ యాక్సెస్‌లో అమ్ముడుపోతుంది. భారీ డిమాండ్ ఉండటంతో ఆ సమయంలో కరెంట్ ఇవ్వడానికి డిస్కమ్‌లు ఓపెన్ యాక్సెస్‌పై ఆధారపడుతున్నాయి. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల దాకా సోలార్ విద్యుత్ ఉత్పాదనకు అనుకూలంగా ఉంటుంది. ఆ సమయంలో సౌర విద్యుత్‌ను కొనడం లేదా సొంతంగా ఉత్పత్తి చేసుకుని బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్‌లో నిల్వ చేసుకుంటే.. డిమాండ్ రాగానే అమ్ముకోవడానికి అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు.

మేడారంలో జోరుగా అభివృద్ధి పనులు!

తాడ్వాయి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో మాస్టర్ ప్లాన్‌లో భాగంగా అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెల స్థలాల మార్పు పనులు గురువారం ప్రారంభమయ్యాయి. బేస్‌మెంట్ నిర్మాణ పనులు మొదలయ్యాయి. అలాగే దేవస్థానం పరిసరాల్లో ప్రాకారం, విస్తరణ పనులనూ ప్రారంభించారు. 90 రోజుల్లో పనులు పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో పనులు ఊపందుకున్నాయి.

బనకచర్ల పీఎఫ్ఆర్‌ను పరిశీలించండి

- కేంద్ర జలసంఘానికి కేఆర్ఎంబీ వినతి

అమరావతి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సమర్పించిన పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకం ముందస్తు సాధ్యాసాధ్యాల నివేదిక(పీఎఫ్ఆర్)ను పరిశీలించాలని కేంద్ర జల సంఘాన్ని కృష్ణా నదీ యాజమాన్య సంస్థ (కేఆర్ఎంబీ) కోరింది. పీఎఫ్ఆర్ ప్రతిని గురువారం దానికి పంపింది. వాస్తవానికి.. ఆంధ్రప్రదేశ్ ఈ పీఎఫ్ఆర్‌ను జూన్‌లోనే సమర్పించగా.. జల సంఘం కొన్ని వివరణలు కోరింది. ప్రాజెక్టును గట్టిగా వ్యతిరేకిస్తున్న తెలంగాణ.. ఇటీవల డీపీఆర్ తయారీకి ఏపీ టెండర్లు పిలవడంపై తాజాగా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో కృష్ణా బోర్డు బనకచర్ల పీఎఫ్ఆర్‌ను జలసంఘానికి పంపడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఇన్ఫోసిస్.. మహిళలకు ఇంకో చాన్స్!

- కెరీర్ గ్యాప్ ఉన్న వారికి ఉద్యోగాలిస్తున్న ఐటీ సంస్థ
- ఉద్యోగులకు రిఫరెన్స్‌కు 50 వేల వరకు ప్రోత్సాహకాలు
- 'రీస్టార్ట్ విత్ ఇన్ఫోసిస్ ఇనిషియేటివ్' పేరుతో ప్రోగ్రామ్

హైదరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఓవైపు ఐటీ రంగంలో లేఆఫ్‌లు కొనసాగుతుండగా.. మరోవైపు దేశీయ సాఫ్ట్‌వేర్ దిగ్గజం ఇన్ఫోసిస్ మాత్రం నా రూటే సపరేటు అంటోంది. ఐటీ రంగం నుంచి వివిధ కారణాలతో కొంతకాలంగా విరామం తీసుకున్న మహిళా నిపుణులకు తిరిగి ఉద్యోగాలిచ్చేందుకు ఆ సంస్థ ముందుకొచ్చింది. ఈ మేరకు 'రీస్టార్ట్ విత్ ఇన్ఫోసిస్ ఇనిషియేటివ్' పేరుతో కొత్త రిఫరల్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. దీని ద్వారా ప్రస్తుతం తమ కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులు.. తమ పరిచయస్తుల్లో ఉన్న అర్హులైన మహిళా నిపుణులను రిఫర్ చేయొచ్చని.. వారు ఉద్యోగాలకు ఎంపికైతే రూ.50,000 వరకు రివార్డులు అందిస్తామని ప్రకటించింది. ఈ మేరకు తమ ఉద్యోగులకు అంతర్గత ఈమెయిల్‌లో సందేశాన్ని పంపింది. ఇక ఈ ప్రోగ్రామ్‌కు అర్హత సాధించాలంటే అభ్యర్థులు ఆయా విభాగాల్లో కనీసం రెండేళ్ల పని అనుభవం కలిగి ఉండాలి. అలాగే కనీసం 6 నెలల కెరీర్ బ్రేక్ తీసుకున్న వారికి ఈ అవకాశాలు వర్తిస్తాయి. నూతన నియామకాల్లో భాగంగా కంపెనీ డెవలపర్లు, టెక్ లీడ్‌లు, ప్రాజెక్ట్ మేనేజర్‌లు వంటి వివిధ సాంకేతిక పదవులను భర్తీ చేయాలని యోచిస్తోంది. ఇక ఉద్యోగులు రిఫర్ చేసిన అభ్యర్థులు ఇంటర్వ్యూలో ఎంపికైతే.. లెవల్-3 నియామకాలకు రూ.10 వేలు, లెవల్-4లో రూ.25వేలు, లెవల్-5లో రూ.35వేలు, లెవల్-6లో రూ.50,000 వరకు రివార్డులు అందజేయనున్నట్లు ఇన్ఫోసిస్ వివరించింది.

మక్కల కొనుగోళ్లు షురూ

- నిజామాబాద్ జిల్లాలో ప్రారంభించిన మార్క్‌ఫెడ్

హైదరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మక్కల కొనుగోళ్లకు మార్క్‌ఫెడ్ గురువారం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు గురువారం నిజామాబాద్ జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం జక్రాన్‌పల్లి మండలంలోని మునిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, ఛైర్మన్ మునిపల్లి సాయిరెడ్డి మక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. క్వింటాకు రూ. 4,200 చొప్పున కనీస మద్దతుధరకు రైతుల నుంచి మక్కలు కొనుగోలుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 202 మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలని మార్క్‌ఫెడ్ నిర్ణయించింది. మొక్కల సాగు, ఉత్పత్తి ఎక్కువగా ఉండే నిజామాబాద్‌లో 26, కామారెడ్డిలో 20, కొత్తగూడెంలో 16, జగిత్యాలలో 13, రంగారెడ్డిలో 13, వికారాబాద్‌లో 12, మహబూబాబాద్‌లో 12, ఖమ్మంలో 10, వరంగల్‌లో 10, నాగర్‌కర్నూల్‌లో 10 సెంటర్లు తెరవాలని మార్క్‌ఫెడ్ నిర్ణయించింది. మిగిలిన జిల్లాలో అవసరానికి అనుగుణంగా ఒకటి నుంచి 10లోపు సెంటర్లు ఏర్పాటు చేయనుంది. ఈసారి మ్యానువల్ పద్ధతిలో కాకుండా 'ఆధార్ సహిత వేలిముద్రలు' (బయోమెట్రిక్) పద్ధతిలో మక్కల కొనుగోళ్లు చేపడుతున్నారు.

రాష్ట్రంలో మూడు రోజుల పాటు వర్షాలు!

నైరుతి రుతుపవనాల తిరోగమన ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మూడు రోజుల పాటు వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈశాన్య రుతుపవనాలు దక్షిణాదిలోకి ప్రవేశించే అవకాశముందని తెలిపింది. దీని ప్రభావంతో నిజామాబాద్, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, వరంగల్, హనుమకొండ, కామారెడ్డి జిల్లాల్లో గంటకు 40 కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీస్తూ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది.

శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్..

వ్యయంలో 50% రాష్ట్రవాటా

ఆమోదం తెలిపిన రాష్ట్ర మంత్రివర్గం

- నిధుల రూపంలో 33 శాతం, నిర్మాణ సామగ్రి పన్నుల రద్దు రూపంలో 17% వ్యయం
- మిగతా వ్యయం భరించనున్న కేంద్రం
- త్వరలోనే అనుమతులు వచ్చే చాన్స్
- 'ఎలివేటెడ్ కారిడార్'పై ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

హైదరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి శ్రీశైలం మార్గంలోని అభయారణ్యంలో తలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ వ్యయంలో సగం ఖర్చును భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో దీనికి ఆమోదం లభించింది. తెలంగాణ నుంచి శ్రీశైలంతోపాటు ఏపీలోని పలుప్రాంతాలు వెళ్లేందుకు ప్రస్తుతమున్న ఇబ్బందులను తొలగించేలా రూ.7,700 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నాగర్‌కర్నూల్ జిల్లాలోని మన్ననూర్ చెక్‌పోస్టుకు కొంచెం ముందు బ్రాహ్మణపల్లి వద్ద ప్రారంభమై ఈగలపెంట తరువాత ఈ కారిడార్ ముగుస్తుంది. మొత్తం మార్గం 54 కిలోమీటర్లుకాగా, అందులో ఎలివేటెడ్ విభాగం 45.42 కిలోమీటర్లు ఉంటుంది. జాతీయ రహదారి కింద దీని నిర్మాణం చేపట్టాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించగా.. అది అంత లాభదాయకం కాకపోవచ్చని కేంద్రం అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో సగం నిధులు భరించేందుకు రాష్ట్రం సిద్ధమైంది. ఈ 50శాతంలో 33శాతం మేర అంటే సుమారు రూ.2,541కోట్లను నేరుగా, మరో 17శాతం వాటాను ప్రాజెక్టు నిర్మాణ సామాగ్రి, ఇతర అంశాల్లో పన్ను మినహాయింపు కింద భరించనుంది. సగం వాటా రాష్ట్రం భరిస్తుండటంతో ఎలివేటెడ్ కారిడార్‌కు త్వరలోనే కేంద్ర అనుమతి వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. శ్రీశైలం మార్గంలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నారని, సగం ఖర్చు భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోందని ఆంధ్రజ్యోతి సెప్టెంబరు 25వ తేదీనే కథనం ప్రచురించింది.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలకు స్థలాలు ఇవ్వాలి!

రాష్ట్రంలో జిల్లాల వారీగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలకు కొత్త భవనాల నిర్మాణం కోసం స్థలాలు కేటాయించాలని కేబినెట్‌భేటీలో పలువురు మంత్రులు కోరినట్టు తెలిసింది. ముఖ్యంగా కొత్త జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు సరిగా లేవని, దీనిపై నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్టు సమాచారం. దీనితో ప్రభుత్వ నిబంధనలకు లోబడి స్థలాల కేటాయింపునకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని రెవెన్యూ మంత్రికి సీఎం సూచించినట్టు తెలిసింది.

మీనాక్షి కోర్టులోకి కొండా వివాదం!

కూతురు సుస్మితతో కలిసి ఆమెతో కొండా సురేఖ సుదీర్ఘ భేటీ

- వివాదంపై వివరణ.. పరిష్కరిస్తామన్న మీనాక్షి, మహేశ్ గౌడ్
- తొలుత.. భట్టితో సురేఖ సమావేశం
- క్యాబినెట్ భేటీకి గైర్హాజరు.. ప్రస్తుతానికి సద్దుమణిగిన వివాదం
- ఎవరితోనూ విభేదాలు లేవు: మురళి



హైదరాబాద్, వరంగల్, న్యూఢిల్లీ, హైదరాబాద్ సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్‌ను అరెస్టు చేసేందుకు బుధవారం రాత్రి ఆమె ఇంటికి మఫ్టీలో పోలీసులు వెళ్లడంతో మొదలైన హైడ్రామా.. గురువారం రాత్రి వరకూ కొనసాగింది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌ల జోక్యంతో ప్రస్తుతానికి సద్దుమణిగింది. వారిద్దరితో గురువారం ఇక్కడ ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో సుదీర్ఘంగా భేటీ అయిన మంత్రి కొండా సురేఖ, ఆమె కూతురు సుస్మిత.. ఈ వివాదానికి సంబంధించి పూర్తి వివరణ ఇచ్చారు. అనంతరం కొండా సురేఖ మీడియాతో మాట్లాడారు. మీనాక్షి, మహేశ్ కుమార్‌గౌడ్‌లకు తన ఆలోచనలు, ఇబ్బందులను వివరించానన్నారు. అందరం కూర్చుని మాట్లాడి దీన్ని పరిష్కరిస్తామని, సమన్వయం చేస్తామని వారు చెప్పినట్లు వెల్లడించారు. వారు తీసుకునే నిర్ణయం, ఇచ్చే ఆదేశాల మేరకు ముందుకు పోతానని సురేఖ స్పష్టం చేశారు. కాగా.. ఈ హైడ్రామా సందర్భంగా.. రెడ్లంతా కలిసి బీసీ మంత్రి అయిన తన తల్లిని అణగదొక్కేందుకు కుట్ర చేస్తున్నారంటూ కొండా సురేఖ కూతురు సుస్మిత తీవ్ర ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. గురువారం ఉదయం తమ అనుచరులకు పంపిన వీడియో సందేశంలోనూ అవే ఆరోపణలు కొనసాగించారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వేం నరేందర్‌రెడ్డి తదితర రెడ్డి వర్గమంతా కలిసి కుట్రలు చేస్తున్నారని, ఇందులో కడియం శ్రీహరి, గుండు సుధారాణి, బస్వరాజు సారయ్య వంటి వారూ భాగస్వాములయ్యారని ఆరోపించారు. బీసీ నేతలపైన ఎందుకు ఇంత కక్షకట్టారో తనకు తెలియదన్నారు. తాను చిన్నతనం నుంచీ ఫైటర్‌నని, ఎంత మంది పోలీసులు వచ్చినా తనను ఏమీ చేయలేరని ధీమా వ్యక్తం చేశారు. ఆమె వీడియో సందేశం వైరల్ కావడంతో.. కొండా సురేఖపైన పార్టీ హైకమాండ్ చర్యలు తీసుకునే అవకాశం ఉందంటూ జోరుగా ప్రచారం జరిగింది. అయితే సురేఖకు మీనాక్షీ నటరాజన్ ఫోన్ చేసి ఎలాంటి ప్రకటనలూ చేయవద్దని సూచించారు. ఈ అంశంపై మాట్లాడేందుకు తాను కలుస్తానని సురేఖ చెప్పడంతో ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు రావాలని ఆమె సూచించారు. అక్కడికి వెళ్లేముందు.. ప్రజాభవన్‌కు వెళ్లిన కొండా సురేఖ డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కతో భేటీ అయ్యారు. క్యాబినెట్ సమావేశంలో పాల్గొనకూడదని అప్పటికే నిర్ణయించుకోవడంతో.. ఒక వేళ క్యాబినెట్లో ఈ అంశం చర్చకు వస్తే.. తన వాదన ఏంటన్నది ఆయనకు వివరించినట్లు తెలుస్తోంది. అక్కడి నుంచి మీనాక్షి వద్దకు వెళ్లిన కొండా సురేఖ.. దక్కన్ సిమెంట్స్ కంపెనీ అక్రమ మైనింగ్‌కు పాల్పడటమే కాకుండా పర్యావరణ నిబంధనలూ ఉల్లంఘించిందని వివరించినట్లు సమాచారం. తన మాజీ ఓఎస్డీని అరెస్టు చేసేందుకు మఫ్టీలో వచ్చిన పోలీసులు వ్యవహరించిన తీరునూ ఆమె తప్పు పట్టారని తెలిసింది. ఆమె వాదనలను సావధానంగా విన్న మీనాక్షి, మహేశ్‌గౌడ్.. ఒకటి రెండు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమై సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాగా.. మంత్రి సురేఖ కుమార్తె చేసిన వ్యాఖ్యలకు, తనకు ఎలాంటి సంబంధమూ లేదని ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి తెలిపారు. ఆమె ఆరోపణలపై ఎలాంటి విచారణకైనా సిద్ధమని స్పష్టంచేశారు.

రేవంత్.. మరో వైఎస్సార్

తమకు ఎవరితోనూ విభేదాలు లేవని.. ఎవరైనా సృష్టిస్తే వాటితో తనకు సంబంధం లేదని మంత్రి కొండా సురేఖ భర్త, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి అన్నారు.. "రేవంతన్న సీఎం కావాలని నేను, సురేఖ కష్టపడ్డాం.. తెలంగాణకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తరువాత రేవంత్‌రెడ్డి మరో వైఎస్ఆర్" అని వ్యాఖ్యానించారు. గురువారం హనుమకొండలోని ఆయన స్వగృహంలో మీడియాతో మాట్లాడారు. తనకు ఎమ్మెల్సీ ఇస్తానని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, తప్పకుండా సీఎం తనకు ఎమ్మెల్సీ ఇస్తారని ధీమా వ్యక్తం చేశారు. కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ వ్యవహారం గురించి తనకు ఏమీ తెలియదన్నారు. కాగా.. కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గం కాంగ్రెస్‌లో విభేదాలు మరోసారి రచ్చకెక్కాయి. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి నియామకం కోసం ఏఐసీసీ పరిశీలకుడు వరంగల్‌లోని నాయుడు హోటల్‌లో కొండా మురళి అధ్యక్షతన వరంగల్‌తూర్పు నియోజకవర్గం కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి మంత్రి సురేఖ కూడా హాజరుకావాల్సి ఉన్నప్పటికీ తాజా వివాదం నేపథ్యంలో సమావేశానికి హాజరుకాలేదు. అయితే నగరంలోని డివిజన్ కమిటీ అధ్యక్షులు, కార్పొరేటర్ల నుంచి పరిశీలకులు వ్యక్తిగతంగా పిలుచుకుని అధ్యక్ష పదవికి ఎవరు అర్హులనే విషయంపై అభిప్రాయాలు సేకరించారు. ఇదే క్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య హనుమకొండలో తన అనుచరులతో మరో సమావేశాన్ని నిర్వహించారు. ఒకే నియోజవర్గానికి చెందిన కార్యకర్తలతో ఇరువర్గాలు వేర్వేరుగా సమావేశాలు నిర్వహించటం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు.. మంత్రి సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ వ్యవహారంలో జరిగిన పరిణామాలపై అధిష్ఠానం ఆరా తీసింది. మీడియా ముందుకు రావొద్దని చెప్పినట్లు సమాచారం. దీంతో హైదరాబాద్‌లో సురేఖ తన ప్రెస్‌మీట్‌ను రద్దు చేసుకున్నారని తెలిసింది. కాగా.. సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులకు స్వేచ్ఛనిచ్చారని.. అలాగని బహిరంగంగా మాట్లాడ్డం సరికాదని కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి అన్నారు.

ఉద్యోగం కోసం వెళ్తే యుద్ధంలోకి దింపారు!

- రష్యాకు వెళ్లిన హైదరాబాదీ కష్టాలు
- ఉక్రెయిన్‌తో యుద్ధంలో బాధితుడి తరహాలో 30 మంది
- వీరిలో 17 మంది మృతి.. భార్యకు ఫోన్‌చేసి చెప్పిన బాధితుడు
- భర్తను రక్షించాలంటూ కేంద్రానికి విజ్ఞప్తి

హైదరాబాద్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ అహ్మద్ (37) ఉపాధి కోసం రష్యాకు వెళితే, ఉపాధి దొరకలేదు.. కానీ అతడిని ఉక్రెయిన్‌తో సాగుతున్న యుద్ధంలోకి ఓ సైనికుడిగా బలవంతంగా దింపారు. ఖైరతాబాద్‌కు చెందిన అహ్మద్ ఇక్కడే బౌన్సర్‌గా పనిచేసేవాడు. మెరుగైన ఉపాధి అవకాశాల కోసం ముంబైకి చెందిన ఓ ఏజెంట్ ద్వారా ఈ ఏడాది ఏప్రిల్ 25న రష్యా చేరుకున్నాడు. అక్కడికి వెళ్లాక అతడిని రష్యా ఆర్మీకి అప్పగించారు. మరో 30మందితో కలిపి కొన్ని రోజులపాటు అతడికి శిక్షణ అందించారు. ఉక్రెయిన్‌తో సాగుతున్న యుద్ధంలో పాల్గొనాలంటూ అహ్మద్‌తో పాటు మొత్తం 26 మందిని ఇటీవలే దేశ సరిహద్దుల్లోకి తరలించారు. మార్గమధ్యలో అహ్మద్ తప్పించుకునే ప్రయత్నం చేయగా అతడి కాలు విరిగింది. రష్యా ఆర్మీ పర్యవేక్షణలో చికిత్స పొందుతున్న అహ్మద్ ఇటీవలే తన భార్య ఫిరదౌస్ బేగంకు ఫోన్ చేసి విషయమంతా వివరించాడు. తన భర్తను స్వదేశానికి రప్పించాలంటూ ఆమె గురువారం కేంద్ర విదేశీమంత్రిత్వ శాఖకు విజ్ఞప్తి చేసింది. యుద్ధం కోసం తీసుకెళ్లిన మొత్తం 30 మందిలో 17 మంది యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారని తన భర్త చెప్పారని ఫిరదౌస్ వెల్లడించారు. యుద్ధంలో తప్పనిసరిగా పాల్గొనాల్సిందేనని లేకుంటే ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని రష్యా ఆర్మీ హెచ్చరించినట్లుగా తన భర్త చెప్పారని ఆమె పేర్కొన్నారు.

తహసీల్దార్ల నుంచి ఫైళ్లు కదలడం లేదు

96,316 దరఖాస్తులు పెండింగ్‌లో.. వీటిలో తహసీల్దార్ స్థాయిలో ఉన్నవే 54,346

- క్షేత్రస్థాయిలో సమన్వయ లోపమే కారణం
- కలెక్టర్లు ఫోన్ చేసినా స్పందించని తహసీల్దార్లు
- లాగిన్ ఐడీ లేదని, అధికారాలు లేవంటున్న అదనపు కలెక్టర్లు

హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకున్నవారు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ఫలితం ఉండటం లేదు. సాదాబైనామా, పట్టాదార్ పాస్ పుస్తకాల కోసం, డేటా కరక్షన్ జీపీఏ, నిషేధిత భూములు, నాలా, ఖాతా మెర్జింగ్, పెండింగ్ మ్యుటేషన్లు, వారసత్వ హక్కులు, అర్బన్ ల్యాండ్ సీలింగ్ వివాదాలకు సంబంధించిన దరఖాస్తులు తహసీల్దార్ కార్యాలయం దాటడం లేదని దరఖాస్తుదారులు వాపోతున్నారు. ఎప్పుడు వెళ్లి అడిగినా సీసీఎల్ఏ నుంచి స్పష్టత రాలేదు.. విధివిధానాలు రాలేదు.. మార్గదర్శకాలు రావాల్సి ఉందంటూ దరఖాస్తుదారులను తిప్పిపంపుతున్నారనే విమర్శలున్నాయి. ఇలాంటి సమస్యలకు సంబంధించి ఈనెల 14వ తేదీ వరకు 96,316 దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే అందులో 54,346 దరఖాస్తులు తహసీల్దార్ స్థాయిలో 18,796 దరఖాస్తులు ఆర్డీవో స్థాయిలో, 11,730 దరఖాస్తులు అదనపు కలెక్టర్ల స్థాయిలో, 11,444 కలెక్టర్ల స్థాయిలో పెండింగ్‌లో ఉన్నాయి. రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి, వికారాబాద్, ఖమ్మం జిల్లాలో పెండింగ్ దరఖాస్తుల సంఖ్య ఎక్కువగా ఉంది. ఒక్క రంగారెడ్డి జిల్లాలో 17,779 దరఖాస్తులు పెండింగ్ ఉండగా, వీటిలో తహసీల్దార్ స్థాయిలో 10,095 పెండింగ్ ఉన్నాయి. సంగారెడ్డి జిల్లాలో 9,838 దరఖాస్తులు పెండింగ్ ఉంటే అందులో 6,458 దరఖాస్తులు తహసీల్దార్ల స్థాయిలో పెండింగ్‌లో ఉన్నాయి. ఈ జిల్లాల్లో కొంతమంది తహసీల్దార్లకు కలెక్టర్, అదనపు కలెక్టర్లు ఫోన్ చేసినా తహసీల్దార్లు కనీసం ఫోన్ కూడా లిఫ్ట్ చేయరనే విమర్శలున్నాయి. ఎన్ని సమావేశాలు పెట్టినా తహసీల్దార్లు ఏదో ఒక క్వెరీ వేయడంతో దరఖాస్తుల పరిష్కారం ముందుకు సాగడం లేదనే విమర్శలున్నాయి. డాటా కరెక్షన్‌కు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 42,431 దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే అందులో తహసీల్దార్ల స్థాయిలో 25,509 పెండింగ్‌లో ఉన్నాయి. నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలకు సంబంధించి 23,813 దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే తహసీల్దార్ల స్థాయిలో 8,265 ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. వారసత్వ వివాదాలకు సంబంధించి 9,452 పెండింగ్ ఉంటే, వీటిలో తహసీల్దార్ల స్థాయిలో 7,062 పెండింగ్‌లో ఉన్నాయి. మ్యుటేషన్‌కు సంబంధించి రాష్ట్రంలో 7,918 కేసులు పెండింగ్ ఉంటే అందులో 5,682 దరఖాస్తులు తహసీల్దార్ల స్థాయిలో ఉన్నాయి.

సాదాబైనామా విషయంలో గందరగోళం

రెవెన్యూ సదస్సుల తర్వాత సాదాబైనామా దరఖాస్తులు 900880 పెండింగ్‌లో ఉన్నట్లు అధికారుల నివేదికల్లో చూపుతున్నారు. వీటికి సంబంధించి ఇప్పటి వరకు 8,55,529 మందికి నోటీసులు పంపారు. ఇంకా 45,351 మందికి నోటీసులు ఇవ్వాల్సి ఉంది. మొత్తం దరఖాస్తుల్లో అప్రూవల్ దశలో ఉన్నవి 9022 మాత్రమే. అఫిడవిట్ తీసుకోవాలనే గందరగోళ పరిస్థితి ఉండటం, సీసీఎల్ఏ నుంచి స్పష్టత లేదని, మార్గదర్శకాలు రాలేదనే కారణాలు చెప్పి సమస్య పరిష్కారాన్ని క్షేత్రస్థాయి అధికారులు వాయిదా వేస్తున్నారు. ఫలితంగా దరఖాస్తుదారులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సాదాబైనామాకు సంబంధించి అత్యధిక దరఖాస్తులు ఖమ్మం జిల్లా నుంచే ఉన్నాయి. ఈ జిల్లాలో 1,11,442 దరఖాస్తులు వచ్చాయి. సూర్యాపేట జిల్లాలో 81,626, మహబూబాబాద్ 80,002, వరంగల్ 53,996, జనగాం 33,305, ములుగు 34,440, హనుమకొండ 42,502, కొత్తగూడెం 62510, భూపాలపల్లి 51,347, సిద్దిపేట 44,583, పెద్దపల్లి 35,323, కరీంనగర్ జిల్లాల్లో 26,871 దరఖాస్తులున్నాయి. వీటిపై అధికారులు ఏ నిర్ణయం తీసుకుంటారనే దానిపై దరఖాస్తుదారులు ఎదురుచూస్తున్నారు.

క్షేత్రస్థాయిలో సమన్వయ లోపం

అధికారుల మధ్య సమన్వయ లోపం దరఖాస్తుల పరిష్కారంలో జాప్యానికి ప్రధాన కారణమనే విమర్శలు ఉన్నాయి. పెండింగ్ దరఖాస్తులపై ప్రతి సోమవారం రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్ అదనపు కలెక్టర్ల (రెవెన్యూ)తో సమీక్ష చేసినా ఆశించిన పురోగతి కనిపించడం లేదు. అదనపు కలెక్టర్లకు లాగిన్ లేకపోవడంతో ఏ తహసీల్దార్ వద్ద ఎన్ని దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయో తెలుసుకునే అవకాశం లేదు. కిందిస్థాయి సిబ్బంది మీద చర్యలు తీసుకునే అధికారాలు కూడా లేకపోవడంతో తమ మాట వినడం లేదని చాలామంది అదనపు కలెక్టర్లు వాపోతున్నారు. ఆర్డీవోలు రోజువారీ సమీక్షలు చేయడం లేదు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లకు మధ్య కూడా సమన్వయం లేదనే విమర్శలున్నాయి. నేరుగా నియామకం అయ్యే కలెక్టర్లు.. తహసీల్దార్ నుంచి పదోన్నతి పొంది అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న వారి సలహాలు, సూచనలను కలెక్టర్లు పరిగణనలోకి తీసుకోవడం లేదని వాపోతున్నారు. కొంతమంది కలెక్టర్లు తమను పురుగుల్లా చూస్తున్నారని అదనపు కలెక్టర్లు కొందరు సహచరుల వద్ద వాపోతున్న సందర్భాలున్నాయి.



ఇలాంటి కొడుకులొద్దన్న కథనానికి స్పందించిన లోకాయుక్త

- సుమోటోగా కేసు నమోదు
- 18న నివేదిక సమర్పించాలని ఆదేశాలు

సిద్దిపేట రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అద్దె ఇళ్లు అని చెప్పి తండ్రి మృతదేహాన్ని ఇంట్లో పెట్టనివ్వని కుమారుల సంఘటనపై లోకాయుక్త స్పందించింది. సిద్దిపేట జిల్లా రూరల్ మండలం పుల్లూరు గ్రామంలో గొడుగు పోచయ్య (67) అనారోగ్యంతో మృతి చెందాడు. ఇద్దరు కుమారులు అతడి మృతదేహాన్ని తమ ఇండ్లలో పెట్టనివ్వకపోవడంతో గ్రామంలోని రైతువేదిక వద్ద రాత్రంతా ఉంచిన అతడి భార్య యాదవ్వ మర్నాడు గ్రామ మాజీ ఎంపీటీసీతో పాటు గ్రామస్థులు సహాయంతో అంత్యక్రియలు పూర్తి చేసింది. దీనిపై గురువారం ఆంధ్రజ్యోతిలో 'ఇలాంటి కొడుకులొద్దు తండ్రీ' శీర్షికతో ప్రచురితమైన వార్తపై లోకాయుక్త స్పందించి సుమోటోగా కేసు నమోదు చేసింది. ఈ నెల 18న పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలని సిద్దిపేట కలెక్టర్ కె.హైమావతి, సిద్దిపేట రూరల్ తహసీల్దార్ స్వామికి ఆదేశాలు జారీ చేసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.